తొలివలపు

★

రచన:

తుర్గెనీవ్

★

•

నవోదయ పబ్లిషర్సు,

విజయవాడ-2

ప్రచురణ 10

ఆషాఢం 1879

రు. 1-00

ఆంధ్రా ప్రింట
విజయవాడ-

తొలివలపు

అనువాదం :

సిరిమూర్తి

తొలివలపు

........అతిథులంతా వెళ్ళిపోయి చాలాసేపయింది. గడియారం పన్నెండున్నర కొట్టింది. గదిలో గృహయజమానితోబాటు సెర్గీ నికొలాయిచ్, వ్లాడిమిర్ పెట్రోవిచ్ తప్ప ఇంకెవరూలేరు. యజమాని సేవకుణ్ణి పిలిచి భోజనంచేసిన పాత్రలూ పళ్లేలూ తీసి శుభ్రం చెయ్యమని పురమాయించి ఓ వాలుకుర్చీలో సుఖంగా కూర్చుని సర్దుకుంటూ చుట్ట ముట్టించి అన్నాడు—

"ఆఁ ఏవఁట్లా-మన ముగ్గురంకూడా మనమొట్టమొదటి ప్రేమానుభవాలు చెప్పుకోవాలనుకున్నాంగదూ ? ఊఁ—నువ్వు మొదలెట్టు సెర్గీ నికొలాయిచ్ !"

సెర్గీనికొలాయిచ్ ఓసారి ఆయనవంకచూసి తలయెత్తి పైకప్పు కేసి చూస్తూ నెమ్మదిగా అన్నాడు—

"నాకసలు మొదటి అనుభవం ఆనేదే లేదు. సరాసరి రెండో దాంతోనే ప్రారంభించాను."

"అదెల్లాగోయ్ ?"

"ఏముందీ-?నా పద్ధెనిమిదోయేట ఓ ఆడపిల్లని మచ్చిక చేసుకోవడానికి ప్రయత్నించాను. అలాంటి ప్రయత్నం అదే నాకు మొట్టమొదటిసారి అయినా అది నాకేం కొత్తగా కనిపించలేదు. తర్వాత చాలామంది ఆడవాళ్ళతోకూడా అదే పద్ధతి అవలంభించాను. అసలు నిజానికి నా జన్మకల్లా మొదటిసారిగా ఆఖరుసారిగాకూడా నా ఆరోఏట నా దాదిని ప్రేమించాను. కాని అది ఏనాటి సంగతో ! మా యిద్దరిమధ్యా

పడిచిన వివరాలుకూడా నాకు జ్ఞాపకంలేవు. ఓవేళ వున్నా అవి ఎవళ్ళకి అంత రుచికరంగాకూడా వుండవు."

"ఐతే మరేంచేద్దాం........?"

కాస్సేపు ఆలోచించాడు గృహయజమాని—

"నా ప్రధమ ప్రేమకూడా ఏమంత సరదా అయిన విషయంకాదు. నా భార్య అనా ఇవనోవ్నాను కలుసుకునేంతవరకూ నే నెవర్నీ ప్రేమించనేలేదు. ఆ తర్వాత మా యిద్దరి ప్రేమ జీవితమూ మామూలుగానే సాఫీగా ఏ గొడవలూ లేకుండా ఈనాటికీ సాగిపోతోంది. సంబంధం కుదిర్చిందేమో మా తల్లితండ్రులు. మేమూ పరస్పరం ఇష్టపడ్డాము. ఆలస్యంలేకుండా పెళ్ళిచేసుకున్నాం. అంతే. అంతకంటే చెప్పదగిన విశేషాల్లేవు. అసలు నేనే ప్రధమ ప్రేమ సంగతి ఎత్తినప్పుడు ఇంకా బొత్తిగా పండిపోకపోయినా-మరీ తరుణ బ్రహ్మచారులు కాదుగదా-మీరేదో చెప్పగలరని నేనాశపడ్డాను. ఆఁ-మీరేమంటారు వ్లాడిమిర్ పెట్రోవిచ్? మీరైనా చెప్పగలరనుకుంటాను మంచి విశేషం!"

వ్లాడిమిర్ పెట్రోవిచ్‌కి నలభై సంవత్సరాలుంటాయి. జుట్టు అక్కడక్కడ నెరిసీ నెరవకుండా వుంటుంది—

"అవును - నా ప్రధమప్రేమగాధ కాస్త విచిత్రమైనదే!"అన్నాడు. గృహస్థూ, సెర్గీనికొలాయిచ్ - ఇద్దరూ ఒక్కసారే 'ఆఁ' అంటూ సంతృప్తి ప్రకటించారు—

"మాక్కావాల్సిందీ అదే! చెప్పండి వింటాం" అన్నారు.

"ఆఁ....అదిసరే....ఆఁహఁ - అది మీకు నేను నా నోటితో చెప్పను. కధలు చెప్పడం నా కసలు చేతకాదుకూడానూ. చెప్తే రెండు ముక్కల్లో తేల్చేసి రసవిహీనమైనా చేస్తాను - లేకపోతే మరీ కొండపీటి చాంతాడంతచేసి విసుగైనా యెత్తిస్తాను. మీరు సరేనంటే నాకు జ్ఞాపకం వున్నదంతా ఓ నోట్‌బుక్‌లోరాసి తెచ్చి చదివి వినిపిస్తాను మీకు."

మిగతా యిద్దరూ ముందు అదేంకుదరదు చెప్పాల్సిందే నన్నారు గాని చివరకు వ్లాదిమిర్ పెత్రోవిచ్‌మాటే నెగ్గింది. తర్వాత మళ్ళీ రెండువారాల తర్వాత ముగ్గురూ కలుసుకున్నారు. వ్లాదిమిర్ పెత్రోవిచ్ అన్నమాట నిలబెట్టుకున్నాడు.

అతను రాసుకొచ్చి తన మిత్రులిద్దరికీ వినిపించిందిది:—

1

నేనిప్పుడు మీకు చెప్పబోయే విషయం 1833 లో జరిగింది. నా కప్పటికి పదహారేళ్లు.

మాస్కోలో మా తల్లి తండ్రులతోనే వుంటూండేవాణ్ణి. వూరి బయట నెస్కూచ్నీగార్డెన్స్‌కు ఎదురుగా కాలుష్కీగేటులో ఓ ఇల్లు అద్దెకు తీసుకునివున్నాం. యూనివర్శిటీలో ప్రవేశ పరీక్షకు కట్టామగాని ఇంకా కష్టపడి చదవటం ప్రారంభించలేదు.

ఇంట్లో నా కెప్పుడూ సంపూర్ణమైన స్వేచ్ఛ వుండేది. సామాన్యంగా నా యిష్టానికి ఎదురులేదు. అందులోనూ మా ట్యూటరు మానేసిన దగ్గరనుంచీ 'మరీనూ'। మా నాన్నగారు నా యిష్టప్రకారం వదిలేసి చూసీచూడకుండా వూరుకునేవారు. నా పైనగానీ తర్వాతగాని పిల్లలెవరూ లేకపోయినా మా అమ్మ అసలే పట్టించుకునేదిగాదు నన్ను. ఆవిడ గొడవ లావిడకున్నాయి. మా నాన్నగారు ఇంకా మంచి యౌవనంలో చాలా అందంగా వుండేవారు. కట్నంకోసం మా అమ్మని పెళ్లి చేసుకున్నారు. ఆయనకంటే ఆవిడ పదేళ్లుపెద్ద. ఆమె ఎప్పుడూ ఆవేశంతో చింతాక్రాంతంగావుండేది-ఎప్పుడూ అదుర్దాగా ఈర్ష్యతో నిరుత్సాహంగా వుండేది.నాన్నముందుమటుకు ఇవన్నీ మాయమయ్యేవి.ఆయనంటే తగని భయం. కాని ఆయనకూడా కాస్త దూరంగా వుండేవారు. పలకరించడానికి

భయమేసేటట్టుండేవాడు. కాని మా నాన్నగారిలాగా అంతరాజసం ఉట్టిపడేమనిషిని - అంత ఆత్మ విశ్వాసం నాగరికత కల మనిషిని ఇంకెవర్నీ ఎరగ నేను.

ఆ యింట్లో చేరిన మొదటి రోజులు నే నెప్పటికీ మర్చిపోలేను. మే తొమ్మిదో తేదీన ప్రవేశించాం. వాతావరణం నిర్మలంగా వుంది. నెస్కూష్ని గార్డెన్స్. పొలాలు మైదానాలూ అన్నీ తిరిగేవాణ్ణి. ఎప్పుడూ చేతిలో పుస్తకం - కైదనోవ్ రాసిన 'చరిత్ర'-వుండేదిగాని ఏ రోజునా అది తెరిచిన పాపాన పోలేదు. ఏవో పాటలూ పద్యాలూ పాడుకునే వాణ్ని. నా రక్తం జిల్లుమనేది - నా హృదయం ఏదో విశిష్టమైన కొత్త బాధను అనుభవించేది. దేనికోసమో భయావిష్టుణ్ణై ఎదురు తెన్నులు చూసేవాణ్ణి. ఏదిచూసినా ఆశ్చర్యం - దేనికైనా సిద్ధం. కాని నా ఆలోచనలన్నీ ఎప్పుడూ ఒకచే తిరుగ గిరికీలు కొట్టేవి. పరధ్యానం - అర్థంకాని విచారం - దుఃఖం పెల్లుబికి ఒక్కోసారి కన్నీరుకూడా కారేది. ఏ పద్యపాదంలోని మధురశ్రావ్యతమో, ఏ సంధ్యాకాంత సౌందర్య మరీచులో రెచ్చగొట్టే ఈ మనోవికారాలమధ్య నవయౌవన జీవితానంద భావం-మనస్సు అల్లకల్లోలంచేసి గిలిగింతలు పెట్టి విభ్రాంతుణ్ణిచేసే అర్థంకాని భావావేశం, వసంతకాలంలో భూమిని పెగల్చుకుని పెరుక్కువచ్చే గడ్డిపోచల్లా తన అస్తిత్వాన్ని నిరూపించుకుంటూండేది.

నాకు సొంతంగా ఓ చిన్న గుఱ్ఱపుపిల్ల వుండేది. దానికి నేనే జీనుకట్టి గాలి చెవుల్లో హోరుపెడుతున్నా లెక్కచెయ్యక అతి వేగంగా అతి దూరంగా దౌడుతీసేవాణ్ణి. ఒక్కోసారి ఏదో అతి సాహసకార్యం మీద బయల్దేరిన రాజపుత్రవీరుడిలా పోయేవి ఆలోచనలు. ఒక్కోసారి మొహమెత్తి ఆ విశాలాకాశపు వెలుగూ వైశివ్యమూ నా మనస్సులోనికి అహరించుకునేవాణ్ణి.

కాని నాకు జ్ఞాపకం వున్నంతవరకూ అప్పటికి నా హృదయంలో స్త్రీలనుగురించి ప్రేమ భావాలనుగురించి ఓ స్థిరరూపం ఏర్పడలేదు. స్థిరరూపం అనేదేమిటో-అసలంటేమిటో ఎరగనే ఎరగను. ఐనా నా

ఆలోచనల్లో అనుభూతుల్లో వాచామగోచరమై వ్యక్తావ్యక్తమైన ఏదో మధురభావశంక–స్త్రీవాచకమే ననుకుంటాను-తొంగిచూస్తూండేది.

ఈ శంక-ఈ అనంతమైన ప్రతీక్షణం నా సర్వాంగాల్లో జీర్ణించి పోయింది. నా ప్రతి రక్త బిందువులోనూ గూడుకట్టుకుని నా ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లో నా నరాల్లో సైతం పరుగులెత్తే ఆ శంక చివరికి సత్యమై కూర్చుంది ఓనాడు.

మా ప్రహరీలోపల మా యిల్లే పెద్దది. దాని కటూ యిటూ రెండు చిన్న ఇళ్ళు వున్నాయి. ఎడంపక్క యింట్లో చౌకబారు గోడ కాగితం తయారుచేసే ఫ్యాక్టరీ ఒకటుంది. కుడిపక్కన యింట్లో ఎవరూ లేరు. అద్దెకివ్వబడుతుంది. మే మా యింట్లో జేరిన తర్వాత మూడు నాలుగు వారాలకి ఓనాడు హఠాత్తుగా ఆయింటి కిటికీలు తెరుచుకుని ఆడముఖాలు కనిపించాయి. ఎవరో ఆ యింట్లో దిగారు-కుటుంబంతోసహా!....మా అమ్మ బట్లర్నడిగి ఆ కొత్తవాళ్ళపేరు తెలుసుకుంది. రాజకుమారి జెసీకినా పేరు వినంగానే మా అమ్మ కాస్త గౌరవభావంతో 'ఓ! రాజకుమారి....!'అని 'పాపం-చితికిపోయినట్టుంది' అని జాలి వెలిబుచ్చింది.

"సొంత * సార్టు లేనట్టుంది - మూడు ఇజ్వోషిక్కులమీద సామాను వేసుకొచ్చారు. సామానుకూడా చౌకబారుగానే కనిపించిం" దన్నాడు బట్లరు.

"విశేషటుకేంలేద్దూ....నాకు సంతోషంగానేవుంది."

ఇంతలో మా నాన్న ఓ చూపు విసరేసరికి అమ్మ నోరు కట్టుపడి పోయింది.

రాజకుమ్మారి జెసీకినా నిజంగా స్థితిమంతురాలు కాదేమో. ఆవిడ తీసుకున్న ఇల్లు చాలా చిన్నది-పాతది-ఏమాత్రం బాగా బతుకుతున్న వాళ్ళా ఆ ఇంట్లో వుంటాని కొప్పుకోరు. కాని ఆ సంభాషణ నేనంతగా పట్టించుకోలేదప్పుడు. అప్పుడే షిల్లర్ రాసిన 'దొంగలు' అనే పుస్తకం చదివివున్నానేమో-రాజకుమారి హోదా నన్నేం ఆకర్షించలేదు.

* రష్యాలో సామాన్యంగా వాడబడే బళ్ళు.

2

ప్రతిరోజూ సాయంత్రంపూట తుపాకీ భుజాన వేసుకుని కాకుల్ని కొట్టడానికి తోటంతా తిరగటం అలవాటు నాకు. కాకులంటే నాకేమిటో పరమ అసహ్యం. ఆరోజునకూడా మామూలుప్రకారం బయల్దేరాను. ఎంత ప్రయత్నించినా ఒక్క కాకినికూడా కొట్టలేకపోయాను. దూరాన ఎక్కడో వుండగానే చూసి కావుకావుమంటూ ఎగిరిపోయాయి. తోటంతా తిరుగుతూ మాకూ కుడిపక్కయింటికీ మధ్యనున్న కంచె దగ్గరకొచ్చాను. ఆ కంచె అవతల ఆయింటికూడా ఓ చిన్న ఉద్యానవనం లాంటిదుంది. నేను తలవంచుకునే నడుస్తున్నాను. హఠాత్తుగా కంఠస్వరాలు వినిపించాయి. తలెత్తి కంచెమీదగా చూసి అలానే నిలబడిపోయాను. నా కళ్ళముందొక అసాధారణమైన దృశ్యం సాక్షాత్కరించింది.

కొద్ది అడుగులదూరంలో పచ్చని కోరిందకాయ చెట్ల పొదల మధ్య తలకు తెల్లని రుమాలు కట్టుకుని ఓ ఆడపిల్ల నిలబడి వుంది. సన్నగా - పొడుగ్గా-గులాబీరంగు దుస్తులు వేసుకుని వుంది. నలుగురు యువకులు ఆమె చుట్టూ మూగివున్నారు. ఆమె ప్రతి ఒక్కరి నుదుటి మీదా అవ్వేమిటో ఊదారంగు పూలతో చిటుకూ చిటుకూ కొడ్తోంది. ఆ పూలదళాలు చిన్న చిన్న సంచులుగా తయారై మొహంమీద కొట్టంగానే చిటుక్కున పగులుతాయి. నా మొహంమీదనంటే నా మొహంమీద కొట్టమన్నట్టు ఆమెమీదికి ఎగబడుతున్నారా యువకులు. ఆ పిల్ల ప్రతి చలనంలోనూ ఒలికిపోతున్న లోకాతీతమైన ఠీవి, అనురాగం, కవ్వించే వెక్కిరింపు, సమ్మోహనశక్తిని చూసి అద్భుతపడ్డాను - ఉత్సాహపడ్డాను-

ఆమె సుకుమార కరాంగుళులచేత నా మొహంమీద కొట్టించుకోడానికి నేం త్యాగం చేయమన్నా చేసేవాణ్ని. నా భుజంమీదనుంచి తుపాకీ జారిపోయింది. సర్వం మరిచిపోయి ఆమె నాజూకైన నవ్వుని నడుము, ఆ తెల్ల రుమాలు కిందనుంచి కొద్దిగా రేగి కనిపిస్తున్న సుందరమైన కురులు - అందమైన నేత్రాలు....రెప్ప వాల్చకుండా చూస్తూ నిలబడిపోయాను.

"ఏయ్ కుఱ్ఱాడా ! ఏయ్ ! కొత్త ఆడవాళ్ళవంక ఏమిటాచూట్టం ఎగబడి ?"

అని అంతలోనే ఎవరో నా పక్కనే గర్జించారు.

నేను ఉలిక్కిపడి తెల్లబోయి చూశాను. ఫెన్సింగ్‌కు అవతలే ఒకాయన నావంక విచిత్రంగా చూస్తూవున్నాడు. సరిగ్గా అప్పుడే ఆపిల్ల కూడా నావంక తిరిగింది. రెండు నల్లని కళ్ళు విశాలములై, ఓ అందమైన మొహం ఉద్దీపించి కనుబొమలు అదిరిపోతూండగా దంతాలు తళతళలాడేట్టు ఫకాలున నవ్వింది........నాకు ఎక్కడలేని బిడియం పుట్టుకొచ్చి గభాల్న తుపాకీ చేతబట్టుకుని వెనకనుంచి వినిపిస్తున్న పక పకలు వికవికలు వెన్నంటి తరమగా పరుగెత్తుకెళ్ళాను. ,సరాసరి నా గదిలోకి వెళ్ళి మంచంమీదపడి చేతుల్తో మొహం కప్పుకున్నాను. నాగుండెలు అతివేగంతో కొట్టుకొంటున్నాయి ఓవక్కన సిగ్గుపడుతూనే దివ్యానందం ఏదో అనుభవిస్తున్నట్లుంది. జన్మలో అంతవరకూ అంత కల్లోలపడి యెరగన్నేను.

కొంచెంసేపు విశ్రాంతి తీసుకున్నాను. తల దువ్వుకుని తొడుకున్న కోటు ముడతలు సర్దుకుని కిందికి 'టీ'కి వెళ్ళాను. హృదయవేగం ఇందాకటంత తీవ్రంగా లేకపోయినా మధ్య మధ్య ఏదో చురుక్కుమనేది గుండెల్లో. ఆ పిల్ల విగ్రహం నాకళ్ళముందు మెసులుతూనేవుంది.

"ఏమిట్రా సంగతి ? కొట్టావేమిటి ఏదైనా పక్షిని ?" అని హఠాత్తుగా ప్రశ్నించారు మా నాన్న.

సంగతంతా ఆయనకి చెప్దామనుకునికూడా మళ్ళీ ఆగిపోయి ఓ చిరునవ్వుమాత్రం నవ్వాను. ఆ రాత్రి మంచంమీద పడుకునేముందు

నా బొటనవ్రేళ్ళమీదా మడమలమీదా రెండుమూడుసార్లు గిఱ్ఱున తిరిగాను. తలకి వాసననూనె పట్టించాను. ఆ రాత్రి ఆదమరిచి నిద్రపోయాను. తెల తెల్లవారుతూండగా ఓ క్షణం మెలకువవచ్చి దిండుమీదనుంచి తల యెత్తి ఏమిటో ఆనందంతో ఓసారి చుట్టూ కలయజూసి మళ్ళీ పరుండి నిద్రపోయాను.

3

"ఎలా వీళ్ళతో పరిచయం చేసుకోవడం? ఇదీ నిద్ర లేవంగానే నా మొట్టమొదటి ఆలోచన. ప్రొద్దునే ఫలహారంకూడా తీసుకోకముందే తోటలోకి వెళ్లానుగాని ఫెన్సింగుదగ్గిరికిమటుకు సాహసించలేదు. ఎవళ్లూ కనిపించలేదుకూడానూ. ఫలహారం అయ్యాక వీధిలో వాళ్ల యింటి ముందునుంచి అటూయిటూ తిరిగాను కిటికీలవంక చూస్తూ. ఈసారి ఆ అమ్మాయి మొహం కనిపించినట్లైంది. భయంతో వెనక్కు తగ్గాను.

నెప్కుష్నిగార్డెన్స్ముందు ఇసకదిబ్బమీద కాస్సేపు కూర్చున్నాను.

'ఆ అమ్మాయి పరిచయం కావాలినాకు....కాని ఎలా?'

ఇదీ ప్రశ్న. క్రిందటిరోజు దృశ్యం అంతా స్మరణకు తెచ్చుకున్నాను. అన్నిటికంటే ఆ పిల్ల నవ్వే నాస్మృతిపథంలో కళ్లకట్టినట్టుంది - నా చెవుల్లో ఇంకా గింగిరులెత్తుతోంది. కాని-ఇక్కడ నేనిలా పరవళ్ళు తొక్కుతూండగానే అక్కడ దేవుడు నాపక్షాన పనిచేస్తున్నాడు.

నే నింట్లో లేనప్పుడు కొత్త పొరుగావిడ మా అమ్మకో ఉత్తరం పంపించింది. వూళ్లో కొందరు పెద్దవాళ్లతో మా అమ్మకు పరిచయం వుందని ఆవిడకు తెలుసునట. తనయొక్క, తన పిల్లలయొక్క గతి వాళ్లమీద ఆధారపడి వుందనీ కొన్ని ముఖ్యమైన దావాలు కోర్టులో

నడుస్తున్నాయనీ అందుకోసం మా అమ్మని తన పక్షం వహించ వలసిందిగా కోరుతూ రాసింది రాజకుమారి. ఓసారి మా యింటికి వచ్చి చూసిపోవాలని వుందనికూడా రాసింది. ఈ వుత్తరం చూసి మా అమ్మ చాలా చికాకుపడింది. మానాన్నగారేమో ఇంట్లో లేరు. ఏం సమాధానం ఇవ్వాలో ఆవిడకేం తోచలేదు. సమాధానం పంపకుండా వుండటం అసంభవం - అందులోనూ అవతల మనిషి 'రాజకుమారి'. అయ్యో! ఫ్రెంచి భాషలో ఓ చీటీరాసి పంపాలి నిజానికి. కాని మా అమ్మ రష్యనే సరిగా రాయలేదు।

నేనింటికొచ్చేసరికి మా అమ్మ మొహం విప్పారింది. వెంటనే నన్ను వెళ్ళి 'రాజకుమారికి' ఏవిధంగానైనాసరే తోడ్పడటం తనకు చాలా ముదావహమైన విషయమనీ, ఆమెగారు పన్నెండూ ఒంటిగంట మధ్య రాగలిగితే చాలా సంతోషిస్తాననీ ముఖతః చెప్పి రమ్మంది.

నా రహస్యవాంఛ ఇలా ఇంత త్వరగా అనుకోకుండా తీరటం ఓవంక ఆనందంగానే వున్నా ఓవంక నా గుండెల్లో ఏదో అదటు ప్రారంభించింది. కాని అదేం నా మొహంలో కనబడకుండా నా గదికి వెళ్ళిపోయాను. నాకెంత ఇష్టంలేకపోయినా అమ్మకీ నాన్నకీ జడిసి జాకెట్ వేసుకుని కాలరు కిందికిదించి వుంచుకోడం మామూలు.

కాని- ఇప్పుడు కొత్త నెక్టై కట్టుకోవాలి—సర్టౌట్ (మోకాళ్ళ వరకూ దిగే ఓవర్కోటులాంటిది) వేసుకోవాలి-ఇంకా..............

4

మనిషిని కంపించిపోతూ వాళ్ళ యింటిముందు కెళ్ళాను. లోపల్నుంచి వస్తున్న ఓ పురాతన శతవృద్ధు-సేవకుడు కాబోలు-కని పించాడు. అంత ముడతలుపడ్డ శరీరం ఇంతవరకూ నేనెక్కడా చూసెర గను. చేతిలో వున్న ఓ పళ్ళెంలో సహం తిన్న ఉప్పుచేపలు మిగిలి వున్నాయి. కాలితో తలుపు దడాలున వేసి బొంగురుపోయిన గొంతుతో గదమాయించాడు—

"ఏం కావాలి ?"

"రాకుమారి జెసీకినా వున్నారా ?" అనడిగాను.

"వానిషేటీ !"

అని లోపల్నుంచి ఓ స్త్రీ కంఠస్వరం వణికిపోతూ కేక పెట్టింది.

మరి మాట్లాడకుండా పళ్ళెం కిందపెట్టి 'వానిషేటీ' వెనక్కు తిరిగి లోపలి కెళ్ళాడు.

"పోలీస్ స్టేషనుకు వెళ్లొచ్చావా ?" అని అడిగింది ఇందాకటి కంఠస్వరమే.

సేవకుడేదో గొణిగాడు.

"ఏమిటి....ఎవరు ?....పక్కింటివాళ్ళ బాబా ? రమ్మను-లోపలికి రమ్మను."

సేవకుడు మళ్ళీ బయటకు వచ్చి పళ్లెం ఎత్తుకుంటూ "లోపలి కెళ్ళండి-డ్రాయింగ్ రూంలోకి." అన్నాడు.

నేను పైై వర్గుకుని లోపలి కెళ్ళాను. 'డ్రాయింగ్‌రూం' చాలా చిన్నది. పరిశుభ్రంగాకూడా లేదు. మాసిపోయిన కుర్చీలు-బేబుల్సు....

అన్నీ తెచ్చి గబగబా అక్కడ పడేసినట్లుంది. కిటికీ పక్కనే ఒక చెయ్యి విరిగిపోయిన కుర్చీలో ఒకామె కూర్చునివుంది. యాభై యేళ్ళ వయసుంటుంది-తలమీద టోపీయేంలేదు-ఆకుపచ్చరంగు బట్టలేసుకుని మెడకు గాడీగా వున్న స్కార్ఫ్ ఒకటి చుట్టుకువుంది. ఆమె నల్లని చిన్నకళ్ళు నామీద కేంద్రీకరించింది. నేనామెను సమీపించి శిరసువంచి-

"రాజకుమారి జెసీకినాగారితోనేనా నేను మాట్లాడుతున్నది?" అన్నాను.

"అవును. నేనే రాజకుమారి జెసీకినాని, నువ్వు 'వి.......'గారి అబ్బాయివా?"

"అవునండీ. మా అమ్మగారు మీకో కబురు పంపారు."

"కూర్చో బాబూ. వానిఫేటి! నా కాళంచెపు లెక్కడ్రా?"

ఆమె రాసిన వుత్తరానికి మా అమ్మ యిచ్చిన జవాబు వినిపించాను. కిటికీ కమ్మమీద తన ఎఱ్ఱని మొద్దుబారి వేళ్ళతో తాటిస్తూ, నే చెప్పింది విని దృష్టి నామీదికి మళ్ళించి కాస్సేపు దీక్షగా చూసి చివరకంది—

"మంచిదిబాబూ! అలాగే. తప్పకుండా వస్తాను....నువ్వేమిటి చాలా చిన్నపిల్లాడిలా కనిపిస్తున్నావ్! నీవయసెంత?"

"పదహారు." నామాట తొట్రుపడింది.

నా సమాధానం వినిపించుకున్నట్టులేదు—

ఏవో నలిగిపోయి దుమ్ముకొట్టుకుపోయిన కాగితాలు తీసి వాటి మీద ఏమిటో బరికి కళ్ళకు అతి దగ్గిరిగా పెట్టుకుని చూడసాగింది.

కుర్చీలో సర్దుకుంటూ నావైపు హఠాత్తుగా తిరిగి అంది-"మంచి వయసు! మాదగ్గిర మొహమాటం అదీ ఏం పెట్టుకోక. మాకేం లేని పోని గొప్పలు లేవు బాబూ."

'అవును-గొప్ప అనేదే ఏంలేదు మీదగ్గర!' అనుకున్నాను రోత పుట్టిస్తున్న ఆమె అవతారంవైపోసారి చూసి.

సరిగ్గా ఆక్షణంలో ఓ తలుపు తెరుచుకుని. క్రిందటిరోజు నేను చూసిన దివ్యసుందరి విగ్రహం గుమ్మంలో ప్రత్యక్షం అయింది. ఆమె పెదవులమీద నడయాడిన మందహాసాన్ని కప్పిపుచ్చుకోడానికి కాబోలు చేయి యెత్తింది.

రాజకుమారి జేసీకినా మోచేత్తో ఆమెవైపు నిర్దేశిస్తూ అంది—

"నా కుమార్తె! ఇతను మన పొరుగింటి 'ఎ....' గారి అబ్బాయి జినా! నీపేరేమిటి బాబూ!"

నేను కూర్చోలేక లేచి నిలబడ్డాను. ఓ పట్టాన నోటమాట రాలేదు—

"వ్లాడిమిర్" అని ఎలాగో అన్నాను.

"తండ్రిపేరు?"

"పెట్రోవిచ్"

"అరె! తమాషాగానే వుందే! వెనక వ్లాడిమిర్ పెట్రోవిచ్ అనే పోలీస్ ఆఫీసర్ని ఒకాయన్ని ఎరుగుదును నేను. ఆఁ-వానిపెటీ? తాళంచెవులు నా జేబులోనే వున్నాయిలే; వెతకబోక"

ఆ అమ్మాయి తల ఓ పక్కకి కాస్తవంచి కళ్ళు చికిలించి ఇంకా ఆ చిరునవ్వుతో ఎగతాళిచేస్తున్నట్టు నా వంక చూస్తూనే అంది—

"మాన్షియర్ వాల్డియర్ దర్శనం నా కిదివరకే అయింది. మీక్రిష్టి యన్ పేరుతో పిలిస్తే ఫరవాలేదుగదు నేనూ" ఆమె కంఠస్వరం నా వొళ్ళంతా పులకలు రేపింది—

"ఓయస్. దానికేమండీ" అని తబ్బిబ్బు పడుతూనే అన్నాడు.

"ఎప్పుడే! ఎక్కడ?" అని అడిగింది రాజకుమారి. కాని యువరాజకుమారి సమాధానం చెప్పకుండా ఇంకా నావంకే చూస్తూ అడిగింది—

"ఇప్పుడు మీకేమైనా పనివుందా?"

"అబ్బే-ఏం లేదండీ-"

"కొత్త పూలుచుట్టాలి-ఓ చేయి సాయంచేస్తారా?....రండి."

అని వెనుదిరిగింది. నేనూ ఆమె ననుసరించాను.

ఈసారి నేను ప్రవేశించిన గదిలో సామాను కొత్త బాగుంది. నీటుగాకూడా సర్దివుంది. ఆ క్షణాన ఇదేం నాదృష్టిలో పడలేదులెండి. ఓ స్వప్నంలో విహరిస్తున్నట్లుంది. ఏదో తియ్యని కమ్మదనం దేహమంతా ఆవహించి అవయవాలన్నీ బిగుసుకు పోయినట్టుంది.

యువరాజకుమారి ఊలువుండ ఒకటి చేతబట్టుకుని అతిశాపీగా కుర్చీలో కూర్చుని ఎదురుగావున్న కుర్చీలో నన్ను కూర్చోమని సంకేతం చేసి అజాగ్రత్తతో పూలు నాచేతుల చుట్టూ చుట్టసాగింది. విడివడి వున్న ఆమె పెదవులను ఆ చిరునవ్వు ఒక్క-క్షణంకూడా విడనాడలేదు. ఒకఅట్ట మధ్యకి మడిచి చిక్కు-తీసిన పూలు దానికి చుడుతూ మధ్య ఓసారి విద్యుల్లతలా నా వంక దృష్టి సారించింది. గభాల్న నేను కళ్ళు నేలకు దించేసుకున్నాను. సర్వసాధారణంగా కుంచించుకుని వున్న ఆమె కళ్ళు ఒక్క-సారి విశాలంగా తెరుచుకునేసరికి ఆమె ముఖమే మారిపోయినట్లుంది-ఒక్క-సారి ప్రజ్వలించిపోయినట్లయింది.

చివరకు మౌనం విడిచి అంది——

"విన్న నన్నుగురించి మీరేమనుకున్నారు మాన్షియర్ వాల్డియర్? చాలా కోపంవచ్చి వుంటుంది నామీద?"

"నేను....రాకుమారీ....నేను....నేనేం అనుకోండే...అసలను కోడానికి మటుకు——"

నేను పూర్తిగా సంభ్రమగోళంలో పడిపోయాను.

"మీరు నన్నింకా యెరుగరు. నేనో విచిత్రమైన వ్యక్తిని. ప్రతి వాళ్లూ నాతో చావరికం లేకుండా వుండాలని నా అభిప్రాయం. మీకు పదహారేళ్ళని చెప్పటం విన్నాను. నా వయసు ఇరవై ఒక్క-టి. చూశారా మీ

కంటే నేనెంత పెద్దదాన్నో! నాదగ్గర మీరెప్పుడూ అబద్ధం ఆడగూడదు .. ఎదురు తిరగ్గూడదు-నేచెప్పినట్టు వినాలి. చూడండి-నావంక చూడకుండా అలా తలవంచుకు కూర్చుంటారేం!"

నాకు కలవరపాటు రెచ్చిపోయింది. కాని ఎల్లాగో తలయెత్తి ఆమెవంక చూశాను. ఆమె మళ్ళీ చిరునవ్వు నవ్వింది-ఇందాకటిలాకాదు; 'అద్దదీ అలా వుండాలి,' అన్నట్టు నవ్వింది.

"ఊ-అలాగే చూడండి నా మొహంకేసి. మరేం ఫరవాలేదు. నేనేం అనుకోనులేండి. మీ మొహం నాకు నచ్చింది. మనిద్దరం మంచి స్నేహితులం అవుతామనిపిస్తోంది నాకు. మీ కిష్టమేనా ?"

ఎంత సవిలాసంగా ఎంత లావణ్యం చిందిస్తూ అడిగిందా ప్రశ్న!

"రాజకుమారీ........"

ఆమె మధ్యలోనే అడ్డగించింది-"రెండు విషయాలు మీరు జ్ఞాపకం వుంచుకోవాలి-నన్నెప్పుడు పిలిచినా జినైదా అలెగ్జాండ్రోవ్నా అనే పిలవాలి ఒకటి! రెండోది! పిల్లలు-" అంతలోనే మాటసర్దుకుంది- "యువకులు మనస్సులోవున్న మాటేమిటో సూటిగా చెప్పకపోవడం చూస్తే నాకు పరమాసహ్యం. అది పెద్దవాళ్ళకే వదిలేద్దాం. ఇప్పుడు మళ్ళీ అడుగుతాను చెప్పండి-నేనంటే మీ కిష్టమేనా ?"

ఆమె నిష్కాపట్యం బాగానేవుందిగాని నా మనస్సు కాస్త చివుక్కుమంది. ఆమె మాట్లాడుతున్నది మరీ అంత పసిపిల్లాడితో కాదని నిరూపిద్దామని డాంబికమైన చనువు ఒలకబోస్తూ అన్నాను—

"మీరంటే నాకిష్టంలేకపోవడమేమిటి జినైదా అలెగ్జాండ్రోవ్నా! అలాంటి సందేహం ఎప్పుడూ పడవద్దు. అసలావిషయం దాచిపెట్టాలని కూడా నాకేకోశానా లేదు........"

ఆమె నావంక చూస్తూ నెమ్మదిగా తల ఆడించింది.

"మీకు ప్రైవేటు మాష్టరు ఉన్నాడూ ?" హఠాత్తుగా వేసిందిప్రశ్న.

"లేదు. చాలారోజులనుంచి లేదు". ఇది అబద్ధం నా ఫ్రెంచి మాష్టరు మానేసి ఇంకా నెలరోజులుకూడా కాలేదు.

"ఓ ! అలాగా ! బాగా పెద్దవాడివయ్యావ్ !" లలితంగా నా వేళ్ళ మీద తట్టి-"చేతులు పరిగ్గాపట్టు" అని మళ్ళీ పూలు చుట్టసాగింది. ఆమె తలవంచుకు పనిచేస్తున్న అదును తీసుకుని ఆమెను నిశితంగా పరిశీలించి చూడాసాగాను. ముందు ఎక్కడ గమనిస్తుందోనని బెరుకు బెరుకుగా చూసినా తర్వాత ధైర్యంతో దీక్షగా చూశాను. ఆమె ముఖం నిన్నటి కంటే మనోజ్ఞంగా వుంది. ఆమె అవయవాలన్నీ అతి సున్నితంగా, అతి మధురంగా కనిపించాయి. తెల్లని తెర వ్రేలాడుతున్న కిటికీకి వెన్నిచ్చి కూర్చునివుంది. తెరలోంచి చొచ్చుకువచ్చిన సూర్యకిరణాలు ఆమె బంగారపు శిరోజాలమీద, అమాయకపు మెడమీద, భుజాలమీద, మృదుల ప్రశాంతమైన వక్షస్థలాని కిరుప్రక్కలా పడి ప్రకాశిస్తున్నాయి. ఆమె నాకెంత సన్నిహితురాలై పోయినట్టుంది ! యుగయుగాలుగా ఆమె నెరిగివున్నట్టనిపించింది. ఆమె నెరక్కముందు నే నజ్ఞానుణ్ణనీ - అసలు నిజంగా జీవించే వుండలేదనీ అనిపించింది....కొద్దిగా నలిగిన దుస్తులు ధరించివుంది. ఆ దుస్తుల్లోని ప్రతి ముడతా పరిదిద్దుదామనిపించింది. లంగాకిందనుంచి బయటికి కనిపిస్తున్న ఆమె పాదరక్షల ముందు సాష్టాంగపడదామనిపించింది........

'ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు !....ఇప్పటి కామె పరిచయం అయింది.... ఇప్పటికా మెముందు కూర్చోగల్గాను....ఎంత దివ్యానందం !'

ఆ అమితమైన పారవశ్యంలో నిజంగానే ఎగిరిపడిలేవబోయాను. కాని సమయానికి నిగ్రహించుకుని లేవడాని కుద్యుక్తమైన పాదాల్ని కాస్సేపు కదిలించి వూరుకున్నాను.

అక్కణ్ణుంచి కదలబుద్ధిపుట్టలేదు. ఆ గదిలోనే, ఆ కుర్చీలోనే ఎంతకాలమైనా అలానే కూర్చుండిపోగలననిపించింది.

వాలివున్న కనురెప్పలు నెమ్మదిగా లేచి ఆమె ప్రకాశమాన నయనాలు మళ్ళీ ఓసారి నామీద వెలుగులు గుమ్మరించాయి. మళ్ళీ ఆమె దంతాలు విద్యున్మరీచికలు వర్షించాయి.

నెమ్మదిగా తర్జని అటూ యిటూ వూపుతూ అంది—

"ఎందుకంత తీక్షణంగా చూస్తావ్ నావంక ?"

నా ముఖం ఎంత ఎఱ్ఱబడిపోయి వుంటుందో నాకే తెలీదు. ఆమె కంతా తెలుసు-అంతా కనిపించిపోతుంది, ఎక్కడిదీమె కీ శక్తి ?

ప్రక్కగదిలో ఏదో చప్పుడైంది. ఏదో ఖడ్గం వొరలో దోపిన శబ్దం........

డ్రాయింగ్ రూంలోంచి రాజకుమారి కేక పెట్టింది—

"జీనా ! బెలోజొరోవ్ నీకోసం పిల్లికూనను తెచ్చాడే !"

"పిల్లికూన !" అంటూ ఎగిరి గంతేసి జినైదా పూలచెండు నా వొళ్ళో పడేసి గదిలోంచి పరుగెత్తుకుపోయింది.

నేనుకూడా లేచి పూలు కిటికీలో పెట్టి డ్రాయింగ్ రూంలోకి వెళ్ళాను. గదిమధ్య పట్టుకుచ్చులాంటి పిల్లిపిల్ల కాళ్ళన్నీ బారజాచుకు వుంది. జినైదా దానిముందు మోకరిల్లి నెమ్మదిగా దాని తలయెత్తి పట్టుకుని చూస్తోంది. రాజకుమారి జెసీకినా ప్రక్కనే రెండు కిటికీలమధ్య ఖాళీస్థలమూ ఆక్రమించే స్ఫురద్రూపియైన యువకుడు-ఒక హుస్సార్-వున్నారు. ఉంగరాలు తిరిగిన జుట్టు-ఎఱ్ఱగా కందగడ్డలాంటి మొహము-విశాలమైన కళ్ళు..........

"ఎంత ముద్దొస్తున్నావే !" అని పళ్ళుబిగించి అధరం ముందుకు జాపి మధురమైన స్వనంతో అంది జినైదా—పిల్లి కళ్ళల్లోకిచూస్తూ.

"చూశారా-దాని కళ్ళు బూడిదరంగుకాదు-ఆకుపచ్చగా వున్నాయి. చెవులు చూడండి ఎంత పెద్దవో ! థేంక్యూ విక్టర్ యెగోరిచ్ ! థేంక్యూ"

నిన్న నే చూసినవాళ్ళల్లో ఒకడైన ఆ హుస్సార్ యువకుడు మందహాసం చేసి నడుం వంచి ప్రణామం చేశాడు-మిలిటరీ బూట్లు ఫట్‌మని కొట్టుకున్నాయి-కత్తి ఒరకు వున్న ఇనప రింగులు గణగణమన్నాయి.

"విన్నారుగా పిల్లికూన ఒకటుంటే బాగుంటుందని! అందు కని వెంటనే తీసుకొచ్చి మీకు సమర్పించుకుంటున్నాను. మీమాట కింకా యెదురేం వుంటుంది!" అని మళ్ళీ శిరసు వివమించాడు.

పిల్లికూన అతి మందస్వరతో మ్యావుమని నేలను మూచూడ సాగింది.

"ఆకలేస్తున్నట్టుంది పాపం...కాని పేటీ! పోన్యా! కాపీని పాలు పట్రండి త్వరగా!" అని కేకలు పెట్టింది జినైదా.

ఒకదాసీ చిన్న కప్పులో పాలుతెచ్చి కూనముందు పెట్టింది. అది ఉలిక్కిపడి వెనక్కి తగ్గింది, కళ్లోసారి గుండ్రంగా తిప్పి ధైర్యం చేసి నాలికతో అద్దుకోసాగింది.

"దాని నాలుక చూశారా మంచి గులాబీ రంగులో వుంది!"

అంది జినైదా తల నేలకానించి పిల్లి గడ్డంకిందనుంచి తొంగి చూస్తూ.

పిల్లి పాలన్నీ తాగేసి మీసాలు నాకుతూ గోళ్ళతో నేలమీద గీర సాగింది.

జినైదా లేచి చేతులు దులుపుకుంటూ 'తీసికెళ్ళండి' అంది నిర్ల క్ష్యంగా. హుస్సార్ కాస్త వెనకంజ వేస్తూనే చిరునవ్వుతో అర్థించాడు.

"మరి నా బహుమానం!"

"ఊఁ-రెండు చేతులూ" అంటూ చేతులెత్తి అతనికందించింది జినైదా.

అతను తన హస్తాలు చుంబిస్తూండగా అతని భుజంమీదనుంచి నావంక చూసింది.

నేను నవ్వాలో ఏమైనా అనాలో ఏం తోచక మౌనంగా నిశ్చ లంగా నిలబడిపోయాను. ఇంతలో అకస్మాత్తుగా గుమ్మం అవతల నిలబడి నా పై పేవో పొజ్ఞలు చేస్తున్న మా సేవకుడు ఫ్యోదర్‌ని చూశాను. అతని దగ్గరకు వెళ్ళి ఏమిటని అడిగాను.

"అమ్మగారు మిమ్మల్ని తీసుకురమ్మన్నారు బాబూ-ఇంతసేపు రానందుకు మండిపడుతున్నారు" అన్నాడు రహస్యంగా వాడు.

"ఎందుకూ-ఎంతసేపైందని నేవచ్చి?"

"గంటపైనే అయిపోయింది బాబూ"

"గంటపైనా!?"

వెంటనే డ్రాయింగ్‌రూంలోకి వెళ్ళి రాజకుమారి దగ్గర శలవు తీసుకున్నాను.

హూస్సార్ బుజాలమీదనుంచి జినైదా నావంక చూసి అడిగింది-

"ఎక్కడికి వెళ్తున్నారు?"

"ఇంటికి. ఆఁ-ఐతే మీరు ఒంటిగంట ప్రాంతంలో వస్తారని మా అమ్మగారికి చెప్పవచ్చుగదూ?" అని మళ్ళీ వృద్ధురాలివైపు తిరిగి అడిగాను.

"ఆఁ ఆఁ. చెప్పుబాబూ-"అంటూ ఆవిడ పొడుండబ్బీ తీసి నేను పులిక్కిపడేట్టు విపరీతమైన శబ్దం చేస్తూ చిట్టెడు పొడుం పీల్చి-"అలాగే చెప్పు బాబూ" అని మళ్ళీ అంది నీళ్ళు తిరుగుతున్న కళ్ళతో.

మరోసారి నేను శిరసు వినమించి వెనుదిరిగి బైటికొచ్చాను. వెనకనుంచి వాళ్ళు మనల్ని పరీక్షగా చూస్తున్నారని మనసు ఖితుకు ఖితుగ్గానే వుంది.

జినైదా మళ్ళీ నవ్వి వెనకనుంచి కేక వేసింది—

"అప్పుడప్పుడొచ్చి చూపి పోతూండాలి మాన్షియర్ వాల్డిమర్."

'ఎందుకంతచేటు నవ్వుతుంది ఆ పిల్ల?' అనుకున్నాను ఇంటికి వెళ్తూ. నాతోవస్తున్న ఫ్యోదర్ ఏమీ అనలేదుగాని, నాప్రవర్తన వాడికూడా ఏం వచ్చినట్టులేదు. మా అమ్మ గట్టిగా చివాట్లు పెట్టి అనలక్కడింత సేపేంచేస్తున్నావని ఆశ్చర్యపడింది, నేనేం జవాబివ్వకుండా గబగబా నాగదికివెళ్ళిపోయాను. వున్నట్టుంది నన్నేదో దిగులు పట్టుకుంది. కన్నీళ్ళు కుంభవృష్టి కాకుండా ఆపుకునేసరికి నా పనైపోయింది....ఆ హూస్సార్ గాడిమీద ఈర్ష్య వేసిందినాకు।

5

రాజకుమారి తన వాగ్దానంప్రకారం ఆ రోజు మధ్యాహ్నం మా యింటికి వచ్చిందటగాని మా అమ్మ హృదయంలో స్థానం సంపాదించుకోలేకపోయింది. ఆ సమావేశసమయాన నేనింట్లో లేను. తర్వాత మా నాన్నతో చెప్తూండగా విన్నాను - అంత నిర్మొహమాటస్తురాల్ని - అంత సభ్యత యెరగని మనిషిని ఎక్కడా చూడలేదట మా అమ్మ. తల మునిగే దావాలు వున్నాయనీ తన్నుగురించి ప్రిన్స్ సెర్జీతో కాస్త మాట్లాడమనీ వేపుకు తిన్నదట. ఐనా ఎంతచెడ్డా ఇరుగూ పొరుగూ కదా అనీ బ్రతికి చెడ్డవాళ్ళనీ ఆలోచించి ఆమెనీ ఆమె కుమార్తెనీ మా అమ్మ మర్నాడు మధ్యాహ్నం భోజనానికి ఆహ్వానించిందట. మా నాన్నగారికి కూడా ఆవిడెవరో జ్ఞాపకం వచ్చింది వెనక ఎప్పుడో ప్రిన్స్ జెసీకిన్ను తానెరుగునట. మంచి కులీనుడేగాని డాంబికం దర్పం జాస్తి-ఎప్పుడూ పారిస్‌లోనే వుంటూండేవాడు. అందుకనే పారిస్‌వాలా అని పేరుకూడా వచ్చిందట. మొదట్లో చాలా భాగ్యవంతుడేగాని వున్నదంతా నాశనం చేసి చివరకు డబ్బుకోసం ఓ చిన్న ఆఫీసరు కూతుర్ని పెళ్లాడి 'స్పెక్యులేషన్'లో దిగి సర్వనాశనం చేసుకున్నాడట. ఆ భార్యే ఈ జెసీకినా.

"కొంపదీసి డబ్బూగిబ్బూ అప్పడగదుగదా?" అంది మా అమ్మ.

"అడిగినా నేనాశ్చర్యపడను. ఫ్రెంచి వచ్చా ఆవిడకి?"

"చాలా దారుణం."

"ఊఁ....సరేకానీ. పిలవటం అయిపోయిందిగదా. ఆఁ- ఆవిడ కూతుర్నికూడా పిలిచావనా అన్నావ్? ఆ పిల్ల బాగా చదువుకున్నదనీ చాలా మంచిదనీ విన్నానుమరి."

"ఐతే ఫరవాలేదు, తల్లిలాగా తయారవదు."

"తండ్రి పోలికకూడా వచ్చివుంటదులే. చదువుతున్నావన్న మాటేగాని వట్టి స్టుపిడ్ !"

అమ్మ ఏదో ఆలోచనలో పడిపోయింది. నాన్నగారుకూడాఇంకేం మాట్లాడలేదు. ఈ సంభాషణ జరుగుతున్నంతసేపూ నాకుమటుకు ముళ్ళమీద కూర్చున్నట్లుంది.

భోజనంకాగానే తోటలోకి వెళ్ళాను. జెసీకిన్ తోటవైపు వెళ్ళ కూడదని శపథం చేసుకున్నామగాని ఏదో అనివార్యమైన శక్తి నన్నటు ఆకర్షించింది ఇంకా కంచెదాపుకు వెళ్ళకుండానే అవతలపక్కన జెనైదా కనిపించింది. ఈసారి ఆమె ఒంటరిగానేవుంది చేత నేదో పుస్తకం పట్టుకుని అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తోంది. నన్ను చూడనేలేదు.

నన్ను దాటి వెళ్ళిపోయేదేగాని ఓ చిన్న దగ్గు దగ్గాను.

ఆమె ఆగకుండానే తల వెనక్కు తిప్పి టోపీనుంచి వ్రేలాడు తున్న రిబ్బన్ను చేత్తో ఓ పక్కకు నెట్టి ఒక్కసారి చిరునవ్వుతోనావంక చూసి మళ్ళీ పుస్తకంలోకి చూస్తూ పోయింది.

నేను నెత్తిమీదనుంచి టోపీ తీసి, అక్కడే కాస్సేపుబరువెక్కిన గుండెలతో నడయాడాను.

నావెనక అడుగులచప్పుడువిని వెనక్కితిరిగి .చూశాను. మా నాన్నగారు హుషారుగా నావేపు నడిచి వస్తున్నారు.

"ఆ అమ్మాయేనా రాజకుమారి కూతురు ?" అనడిగాడు నన్ను.

"అవును"

"ఐతే నువ్వెరుగుదువన్నమాట !"

"పొద్దున వాళ్ళయింటికి వెళ్ళానుగా."

మా నాన్న ఆగిపోయి గిరుక్కున వెనక్కు తిరిగి జెనైదాను సమీపించి సగౌరవంగా వినమితుడైనాడు. ఆమెకూడా హఠాత్తుగా కలి

గిన తన ఆశ్చర్యాన్ని కాస్త కప్పిపుచ్చుకుని తిరిగి ఏమనుంచి చేతిలోని పుస్తకం మూసేసింది. మానాన్న వెళ్ళిపోతుంటే ఆమె చూపులాయన్నే అనుసరించిపోయాయి. మానాన్న ఎప్పుడూకూడా అతి సొగసుగా దుస్తులు ధరిస్తాడు. దాని దర్పంలేని బట్టలైనా ఆయన వేసుకుంటే అంత బాగుంటాయి. తలమీద టోపీ-శివిగల విగ్రహం-యౌవనం ఉట్టిపడే హుషారైన నడక-ఆరోజున కనిపించినంత మనోజ్ఞంగా మరెప్పుడూ కనిపించలేదాయన నాకు.

జీనైదాకేసి నేను నాలుగడుగులు వేశానుగాని ఆమె నావైపైనా చూడకుండా మళ్ళీ పుస్తకం తెరిచి ముందుకి నడుస్తూ పోయింది.

6

ఇహవారోజంతా, మర్నాడు ఉదయంకూడా మరీ దిక్కుమాలి నట్టు గడిపాను. క్రైదానోవ్ తెరిచి చదువుదామని ప్రయత్నించాను. 'జూలియస్ సీజర్ యుద్ధరంగంలో ధైర్య సాహసాలకు పుట్టినిల్లు....' అనే వాక్యం అధమం పదిసార్లయినా చదివివుంటాను. కాని ఒక్క-అక్షరమైనా బోధపడక చివర కదికూడా మూసేశాను. డిన్నరుకు ముందు తలకు వాసన నూనె, వేస్‌లీన్ రాచి దువ్వుకుని, మళ్ళీ నెక్ టై పర్‌టౌట్ వేసుకున్నాను. నన్ను చూడంగానే మా అమ్మ అంది—

"అదేమిట్రోయ్! అదంతా యెందుకిప్పుడ్నుంచీ? ఇంకా విశ్వ విద్యాలయంలోనైనా చేరలేదుగదా. అదీగాక సరికొత్త జాకెట్ అది-పాడెయ్యడమేనా?" అవి ఎక్కడ పాడదియ్యాల్సి వస్తుందోనని చేత్తో గట్టిగా పట్టుకున్నాను—

"కొత్తవాళ్లొస్తున్నారమ్మా డిన్నరుకి."

"నాన్సెన్స్. వాళ్లేం పెద్ద దిగొచ్చారేమిటి-వాళ్ళముందేం ఒళ్ళువేసు కున్నా పరవాలేదు?"

మరి నేను లొంగిపోక తప్పిందికాదు, సర్ టౌట్ తీసి, జాకెట్ వేసుకున్నానుగాని షైమాత్రం తియ్యలేదు. రాజకుమారి ఆమె కుమార్తె భోజన సమయానికి అరగంటముందు వచ్చారు. ముసలావిడ నిన్నటి ఆకుపచ్చని దుస్తులమీదనే మరో పసుపుపచ్చని శాలువా వేసుకుని, నెత్తి మీద పాతకాలపు బానెట్ పెట్టుకుని వచ్చింది. వచ్చీ రావడంతోటే తన ప్రామిసరీనోట్ల గొడవ ప్రారంభించి తన దారిద్ర్యంగోడు చెప్పుకుని నిట్టూరుస్తూ మూలుగుతూ ముక్కుతూ ఎదటివాళ్ళేమన్నా అనుకుంటారేమోననికూడా లేకుండా పొడుం పీలుస్తూ-తనయింట్లో వున్నట్టు ప్రవర్తించసాగింది. తానో రాజకుమారినన్న విషయమే ఆమె బుర్రలో వుండదులాగుంది. కాని జినైదా అలాకాదు-అతి సనాగరికంగా తయారయింది. మాంచి - గంభీరంగా - గర్వం అని పేరుపెట్టతగినంత గంభీరంగా వుంది. నఖశిఖ పర్యంతమూ నూటికి నూరుపాళ్ళు రాజకుమారి అనిపించుకుంది. ఆమె చిరునవ్వు, చూపులుకూడా మారిపోయాయి. నేనసలు గుర్తే పట్టలేనంతగా మారిపోయింది. మారిపోయినా నా కళ్ళకి వెనకటికంటే సుందరంగా కనిపించింది, డిన్నరు దగ్గిర మానాన్న ప్రక్కనే కూర్చుంది. డిన్నరౌతున్నంతసేపూ మానాన్న మంచి సభ్యతతో, మర్యాదతో ఆమెను వినోదపరిచాడు. మధ్యమధ్య ఆమె ముఖంలోకి చూసేవాడు-ఆమెకూడా అలాగే చూసేది. కాని వారి చూపుల్లో ఏదో విచిత్రమైన వైషమ్యం స్ఫురించింది నాకు. సంభాషణఅంతా ఫ్రెంచిలో జరిగింది, ఆమె స్వచ్ఛమైన ఉచ్చారణచూసి నేను చాలా ఆశ్చర్యపడ్డట్టు కూడా జ్ఞాపకం. ముసలావిడ భోజనాత్పూర్వం చూపించినంత చనువూ స్వతంత్రం భోజనం ముందుకూడా తీసుకుంది, మొహమాటం లేకుండా భోంచేసింది. పదార్థాలన్నీ బాగున్నాయని తెగకొనియాడింది. మాఅమ్మకి విసుగెత్తినట్టుంది-ఎందుకొచ్చిందిరా భగవంతుడా అన్నట్టు సమాధానాలు చెప్పింది. ఒక్కోసారి మా నాన్నగారి మొహంలో కూడా చిరాకు, ఏహ్యతద్యోతక మయ్యాయి. జినైదామీద కూడా అమ్మకి పెద్ద సదభిప్రాయం ఏం కలగలేదు. మర్నాడు అంది- "ఒట్టి గర్విష్టిపిల్ల; ఏం చూసుకునో ఆ మిడిసిపాటు ఫ్రెంచి షావుపిల్లల్లాగా!"

"ఐతే ఏ జన్మలో ఫ్రెంచిషావుపిల్లల్ని చూసివుంటావు నువ్వు!" అన్నారు నాన్నగారు.

"చూడకపోతే-ఏం?"

"లేదుగాని....అలాంటప్పుడు వాళ్ళమీద జడ్జిమెంటు ఇవ్వరాదు నువ్వు."

మా యింట్లో వున్నంతసేపూకూడా జినైదా నా వంకైనా చూడలేదు. భోజనం కాంగానే రాజకుమారి శలవు తీసుకుంటూ మా అమ్మనీ నాన్నగార్నీ పేర్లుపెట్టి పిలిచి అంది—

"ఏమిటో....! బాగున్న రోజుల్నీ గతించిపోయాయి. చివరికి మిగిలింది నేమో నా బిరుదులూ-'హర్ లేడీషిప్' హుఁ- ఎందుకొచ్చిన హోదాలు; ఎందుకొచ్చిన మర్యాదలు చెప్పండి! తింటానికి తిండి లేనప్పుడు—అఁ-ఐతే–మీరొకరు నాపక్షం వున్నారని భావించుకోవచ్చుగా? ....శలవు మరి...." నాన్నగారు ఆమెను సాగనంపటానికి బైటికివెళ్లారు. మరణశిక్ష విధింపబడిన వానిలా తలవంచుకు నే నా కుర్చీలోనే కూర్చున్నాను. జినైదా ప్రవర్తన నన్ను కాలరాచి నలిపి పారేసినట్లయింది. అలాంటప్పుడు ఆమె వెళ్తూ వెళ్తూ వెనకటి దయాపూరితమైన దృక్కుల్తో నావంక చూసి గబగబా రహస్యం చెప్పినట్లు 'రాత్రి ఎనిమిదింటికి మా యింటికి రావాలి. తప్పకుండా రావాలిస్మీ' అనేసరికి నా ఆశ్చర్యం మీరే వూహించుకోండి. జినైదా మాటలు నా మస్తిష్కంలోకి చొచ్చి అర్ధమయ్యేవరికి ఆమె గుమ్మందాటి తెల్లని రుమాలు తలమీద కప్పుకుంటూ వెళ్ళిపోనే పోతోంది.

7

సరిగ్గా ఎనిమిది గంటలకల్లా మళ్ళీ సర్‌టౌటు వేసుకుని వాళ్ళ గుమ్మంముందు నిలబడ్డాను. బైటనే బల్లమీద కూర్చున్న వృద్ధసేవకుడు బద్ధకంగా నా వంకచూసి అంతకంటె ఎక్కువ బద్ధకంతో నెమ్మదిగా లేచి నిలబడ్డాడు. డ్రాయింగు రూంలోంచి ఉల్లాసంగా గొంతులు వినిపిస్తున్నాయి. తలుపునెట్టి లోపలికి వెళ్లాను. అక్కడి దృశ్యం చూసి భ్రమాన్నపడి అలాగే నిలబడిపోయాను. గది మధ్యలో ఓ కుర్చీమీద యువరాజకుమారి ఎవరిదో మగవాని టోపీ చేతపట్టుకుని వుంది. ఐదుగురు మమమలు కుర్చీచుట్టూ మూగివున్నారు. రాకుమారి టోపీ వాళ్ళకందించీ అందించకుండా ఆడిస్తుంటే వాళ్ళంతా కలియబడి దాన్ని అందుకుని అందులోంచి ఏదో తియ్యడానికి ప్రయత్నంచేస్తున్నారు. నన్ను చూడంగానే ఒక్క కేకపెట్టింది—

"ఆగండి ఆగండి. కొత్తాయన ఒకరొచ్చారు. ఆయనక్కూడా ఓ టిక్కెట్టివ్వాలి"

కుర్చీమీదనుంచి అతిచులాగ్గా గెంతి దిగి నాకోటు పట్టుకుని ఈడ్చుకుపోసాగింది.

"రండి. అలా నిలబడతారేం....ఆఁ-ఏవండీ! కొత్త మీకందరికీ పరిచయం చేస్తాను. ఈయన మా పొరుగింటివారి అబ్బాయి-మాన్షియర్ వాల్డెమార్." అని నన్ను అందరికీ పరిచయంచేసి నావంక తిరిగి వాళ్ళనికూడా నాకు పరిచయం చేసింది—

"ఇదుగో-ఈయన కౌంట్ మాలెస్కీ. ఈయన డాక్టర్ లూషిన్. కవి మైదనోవ్. రిటైర్డ్ కాప్టెన్ నిర్మాట్స్కీ. ఈయన బెలోవ్జొరోవ్. ఇదివరకే తెలుసుగా!"

అందరికీ ప్రతినమస్కారం చెయ్యడానికూడా ఇంకానూ, ముచ్చెమటలు పోసినంతపనైంది....డాక్టర్ లూషిన్‌ను వెంటనే గుర్తు పట్టాను. మొన్నారోజున తోటలో నన్నెగతాళిచేస్తూ వెకిలినవ్వు నవ్విన పెద్దమనిషి అతనే; మిగతా వాళ్ళంతా నాకు కొత్త.

"రాయండి కౌంట్ గారూ-మాన్షియర్ వాల్డెమార్‌కి కొత్తటిక్కెట్టు రాయండి" అంది జినైదా.

కౌంట్ మాలెవ్స్కీ అందగాడే గాని మనిషిలో కాస్త టెక్కు ఎక్కువ. మంచి భావస్ఫోరకాలైన కళ్ళు-చక్కని ముక్కు-ముచ్చట గొలిపే పిల్లిపైన మీసం-అతి చిన్ననోరు-తమాషా అయిన విగ్రహం మొత్తానికి; ఉచ్చారణలో కొంచెం పోలిష్‌పోకడ వుంది—

"అదన్యాయం. మాతో ఫర్‌ఫీట్స్ ఆడందే ఆయన;"

"అవును-అన్యాయం అన్యాయం" అని ప్రతిధ్వనించారు, బెలొవ్‌జొరోవ్, రిటైర్డుకెప్టెనుకూడా

ఈ కెప్టెన్‌కి నలభై ఏళ్ళ వయసుంటుంది. మొహమంతా వికారమైన స్ఫోటకం మచ్చలు-నీగ్రోలకంటే కనాకష్టంగా వంకర్లు తిరిగి పోయిన బిరుసుజుట్టు-కొంచెం దొడ్డికాళ్ళు-గుండీలు పెట్టుకోని మిలిటరీ కోటు వేసుకుని పాతకీర్తి చాటుకోడానికన్నట్టు వెనకటి భుజకీర్తులు విడవకుండా ధరిస్తూంటాడు.

"ష్....!ఇదుగో-కీచులాటలూ-కలహాలూ ఏం పనికిరావుచెప్తున్నా. వాల్డెమార్ ఇవ్వాళే కొత్తగా జేరుతున్నారు మనలో. రూలు కాస్త సడలించవచ్చు-మరేం ఫరవాలేదు. ఊఁ-కానీండి-నే చెప్పినట్టు చెయ్యండి;" అని గదమాయించింది జినైదా.

కౌంట్ సరే మీ చిత్తం అన్నట్లు తల ఓసారి వంచి కాగితంముక్కమీద కలంతో వ్రాయసాగాడు.

డాక్టర్ లూషిన్ ఉడికిపోయాడు.

"పోనీ మాన్షియర్ వాల్డెమార్‌కు ఆట నియమాలయినా చెప్పవచ్చు; పాపం అంతా అయోమయంగా వున్నట్టుంది ఆయనగారికి ;" అని ఎకసక్కెంగా నావంక తిరిగాడు—

"ఏంలేదు బాబూ-మేమిప్పుడు ఆడుతున్నది 'ఫర్‌ఫీట్స్.' రాకుమారికి జరిమానా పడింది, లక్కీటిక్కెట్టు ఎవళ్ళకొస్తే వాళ్ళు ఆమె చెయ్యి ముద్దుపెట్టుకోవచ్చు. అర్థమయిందా ?"

నామతి మరీపోయింది. ఇంకా నేను ఆశ్చర్యంలోంచి కోలుకోక ముందే జినైదా మళ్ళీ కుర్చీమీదకు ఎగిరిదూకి టోపీ అల్లల్లాడించ సాగింది. మళ్ళీ అందరూ గుమిగూడి చేతులుజాచి అందుకోవడానికి ప్రయత్నించసాగారు. వాళ్ళల్లో నేనూ వున్నాను.

జినైదా మైదనోవ్‌ను పిలిచి అంది—

"మైదనోవ్ ! మీరు కవులు. టిక్కెట్టు మీకు వస్తే అది మాష్యెర్ వాల్డెమార్‌కు వదిలెయ్యండి. ఆయనకు రెండవకాశాలు ఇచ్చినట్టు వుంటుంది-మీ నిస్వార్థత, మీ హృదయ వైశాల్యంకూడా అందరికీ తెలుస్తుంది."

అసలే హ్రస్వదృష్టేమో-కళ్లు మరికాస్త చికిలించి చూస్తూ మైదనోవ్ నిడుపాటి జులపాలు వెనక్కి పడేట్టు తన సన్నని కోలమొహం అడ్డంగా అతి తీవ్రంగా వూపాడు. అందరికంటే చివర నేను చెయ్యిపెట్టి ఒక చీటీతీసి....మడత విప్పాను. దానిమీదరాసివున్న 'ముద్దు'అన్న రెండక్షరాలూ చూడంగానే నా అనుభూతులెలా వుండివుంటాయో మీరే వూహించుకోండి. అప్రయత్నంగా "ముద్దు !" అని వెఱ్ఱికేక వెలువడింది నా నోట్లోంచి. వెంటనే ప్రతిధ్వనిలా రాకుమారి—

"వహ్వా ! ఆయన గెల్చారు !" అంటూ కుర్చీదిగింది. "నాకెంత సంతోషంగా వుందనుకున్నారు !" అంటూ నాగుండెలు గతుక్కుమనేట్టు ఆ మధురమైన ప్రశాంత మందహాసంతో నా కళ్ళల్లో కళ్లు పెట్టి చూస్తూ "మీకూ సంతోషంగానే వుందా ?" అని అడిగింది.

"నాకు...." అంతకుమించి మరి మాట పెగల్లేదు నాకు.

బెలొవ్జొరోవ్ నా చెవిదగ్గరకొచ్చి "ఆ చీటి అమ్మేస్తావా నేను కొంటాను ! మూడు రూబుల్స్-రెడీకాష్ !" అని హోరుపెట్టాడు.

అప్పుడు నేనతనివంక చూసిన చూపులోకి అంత అసహ్యమూ, ఛీత్కారమూ ఎలా వచ్చాయో నాకే తెలీదు. పాపం మనిషి మనసులో మాడిపోయి వుండాలి. నాచూపు చూసి జినైదా చప్పట్లుకొట్టి 'శహబాస్' 'శహబాస్' అని అభినందించింది.

లూషిన్ అన్నాడు—

"ఆదేం లాభంలేదు. రూలంటే రూలే. ఊఁ-ఒక కాలిమీద మోకరిల్లండి మాన్షియర్ వాల్డెమార్! అది మా పద్ధతి."

జినైదా వచ్చి నాముందు నుంచుంది. నన్నింకా బాగా చూడటానికా అన్నట్టు తలకాస్త ఓవక్కకి వాల్చి నిలబడి అతి హుందాగా చేయి జాపింది. నా కళ్ళకు చీకట్లుగమ్మినట్టయింది. ఒక కాలిమీదనే మోకరిల్లుదామనుకున్నానుగాని తబ్బిబ్బై రెండు కాళ్ళమీదా మోకరిల్లాను. అతి కంగారుతో ఆమె హస్తాన్ని నా పెదవులతో ఎలాగో అలా స్పృశించాను. నా కంగారులో ఆమె వేలిగోరు నా నాసికమీద గీరుకుపోయింది కూడాను.

"చాలు-చాలు-ఇహ లేవండి" అంటూ లూషిన్ నా చెయ్యి పట్టుకు లేవదీశాడు.

ఆట మళ్ళీ సాగింది. జినైదా నన్ను తన పక్కనే కూర్చోబెట్టుకుంది. అబ్బ-ఎటువంటి జరిమానాలు సృష్టించేది! తను సృష్టించిన జరిమానా ఓసారి తనకే తగిలింది. దాని ప్రకారం ఆమె ఒక 'స్మృతి చిహ్నం'లా నటించాల్సివచ్చింది, తనకి పీఠంగా నిర్మట్స్కీని ఎన్నుకుని బోర్లబక్కలా పడుకోమని తాబేలులా తల బుజాలమధ్యకు కుంగింపించింది. అనుక్షణమూ గది నవ్వులతో ప్రతిధ్వనించిపోయింది. నానా గోల-అల్లరి! ఈ అల్లరి, గోల, విశృంఖలమైన విహారం, కొత్తవాళ్ళనైనా లేకుండా అతి దోస్తీగా వ్యవహరించడం-ఇవన్నీ నాగరికత, సభ్యత అనే అవరోధాలమధ్య కాస్త గొప్పయింట్లో ప్రశాంత ఏకాంతంలో పెరిగిన నా తలకెక్కిపోయాయంటే ఆశ్చర్యం ఏముంది! వైన్ తాగినట్టు కైపెక్కిపోయింది నాకు. మిగతా అందరికంటే బిగ్గరగా అరవడం

నవ్వడం ప్రారంభించాము. చివరికి నాగోల మరీ ఎక్కువై పక్కగదిలో ఎవరో ఆఫీసరుతో సంప్రదిస్తున్న వృద్ధ రాజకుమారికూడా లేచివచ్చి ఏమిటి సంగతి అని అడగాల్సివచ్చింది. అయినాకూడా- 'ఫికరులేదం'టూ చూడండి—అలావుంది మన పరిస్థితి. కొందరు వేళాకోళంగా ఏదో వాగారు-కొందరు మొహం నల్లగా పెట్టుకు చూశారు. అయినా ఆమజాలో అవ్వేం లెక్కచెయ్యలేదు నేను. జినైదామటుకు నన్ను ప్రత్యేకిస్తూనే వుంది. తన పక్క వదలనియ్యలేదు నన్ను. ఓసారి నాకో జరిమానా పడింది. జినైదా నేనూ పక్కపక్కనే కూర్చుని ఒకటే సిల్కురుమాలు మాయిద్దరిమీదా కప్పుకుని నా 'రహస్యం' ఆమెకు చెప్పాలి. మాయిద్దరి తలలూ ఆ పరిమళభరితమైన కమ్మని స్వచ్ఛమందారంలో మునిగిపోయి నప్పుడు-ఆ మందారంలోంచి ఆమె నేత్ర జ్యోతులు అంత చేరువలో అంత స్నిగ్ధతతో వెలిగిపోయినప్పుడు-ఆమె యూర్పులు వెచ్చగా చమ్మగా నా ముఖానికి సోకినప్పుడు-ఆమె దంత ముత్యాలు మెరిసిపోయి నప్పుడు-ఆమె కుటిలాలకలు నా మేను తాకి గిలిగింతలుపెట్టినప్పుడు.... ఆ మధుర భావాలు-ఆ దివ్యస్మృతులు నే నెన్నటికీ మరువలేను. నా నోరు కట్టడిపోయింది. జినైదా అతి విన్నాణంగా నిగూఢమైన మంద హాసంచేసి రహస్యంగా అంది-"ఊఁ ?"

విషమావస్థలో పడ్డాను నేను. సిగ్గు ముంచెత్తుకొచ్చింది. ఏమీ చేతకాక నవ్వి ఊపిరి బిగబట్టుకుని తల పక్కకు తిప్పేసుకున్నాను....

ఆపూట ఎన్ని ఆటలాడేమో-ఎన్ని కొంటెపనులు చేశామో లెక్కలేదు. కొంతసేపు పియానో వాయించాం. పాటలు పాడేం. నృత్యం చేశాం. నిర్మత్స్కీకి ఎలుగుబంటివేషం వేసి మేమందరం జిప్పింమై అతనిచేత ఉప్పునీళ్ళు తాగించాం. కౌంట్ మాలెవ్స్కీ పేకట్రిక్కులు కొన్ని చూపించాడు. ఓసారి పేక కలిపి తురుపు ముక్కలన్నీ తనకు వచ్చేట్లు పంచాడు. అతని ప్రతిభకు లూషిన్ తెగ అభినందించాడు. కవి మైదనోవ్ తన కొత్త కావ్యం 'జూసికోర్' లోంచి కొన్ని భాగాలు వినిపించాడు. త్వరలోనే దాన్ని అచ్చొత్తించి నల్లటి బైండుమీద నెత్తురు లాంటి ఎర్ర అక్షరాల్తో పేరు రాయించి ప్రచురించబోతున్నాడట. రాజ

కుమారితో మాట్లాడ్డానికి వచ్చిన ఆఫీసరుగారి టోపీ లాక్కొని ఆయన చేత 'కజాచాక్' నాట్యం చేయించిగాని ఇవ్వలేదు. వృద్ధ సేవకుడు వాని ఫేటీ నెత్తిన ఆడవాళ్ల టోపీ పెట్టి జినైదా మగటోపీ పెట్టుకుంది.......... అబ్బ-ఎన్నని చెప్పను? బెలొవ్జోరోవ్ మాత్రం ఒంటికంటి రామలింగమైపోయాడు. చీటికి మాటికి మూలజేరి భ్రుకుటి బిగించి చిరచిరలాడుతూండేవాడు. మధ్యమధ్య వున్నట్టుండి అతని మొహం కందగడ్డలా అయిపోయి కళ్ళు చింతనిప్పులా మండిపోయేవి. అప్పుడు మనిషివాలకం చూస్తే ఏక్షణాన మా అందరిమీదా విరుచుకుపడి చేత్తో నెట్టిపారేస్తాడా అన్నట్టుండేవాడు. కాని రాకుమారి 'తప్ప'ని తర్జని ఆడిస్తూ అతనివంక చూసే సరికి వెంటనే పిల్లిలాగా మళ్ళీ మూలజేరేవాడు.

కొంతసేపటికి విసుగు పుట్టింది. నీరసం అనిపించింది. ఆటలూ పాటలూ చాలించి కాస్సేపు విశ్రాంతి తీసుకున్నాం. పదకొండు గంటలవంగానే భోజనాలు వడ్డించారు. ఎండు జాన్ను-కోర్ద్‌పై (పూర్ణముల వంటి ఒకరకం వంటకం)-ముక్కలు ముక్కలుగా తరిగిన పందిమాంసం అన్నీ దివ్యంగా వున్నాయి. కాని వైనుమాత్రం ఒక్క సీసాయే ఉంది. అదికూడా ఏదో ఎట్టుటి పెయింట్ వాసన కొడ్తోంది. ఎవళ్ళూ ముట్టుకోలేదు దాన్ని. ఆనందంతో సోలిపోతూ వాళ్ళ యింట్లోంచి బైటికి వచ్చాను. వస్తూండగా జినైదా నా చెయ్యి పట్టుకుని నెమ్మదిగా అదుముతూ నిగూఢమైన ఆ మందహాసం మళ్ళీ చేస్తూ 'గుడ్‌బై' అంది.

వేడెక్కిపోయిన నా మొహంమీద చల్లని రాత్రిగాలి నృత్యం చేసింది. నల్లని మేఘాలు అనుక్షణమూ రూపం మారి క్రమక్రమంగా పెద్దవి కాసాగాయి. గాలితెరలు వృక్షశాఖాంతాల్ని ఊపిపారేస్తున్నాయి. ఆకాశంలో ఎక్కడో దూరాన ఉరుము చిరుకోపంతో ఘూర్ణిల్లసాగింది.

దొడ్డిగుమ్మంత మాయింట్లో దూరి నాగదికి వెళ్ళాను. దోవలో నేలమీదపడి నిద్రపోతున్న నా సేవకుణ్ణి దాటిపోవడంలో వాడు లేచి మా అమ్మ చాలా కోప్పడుతోందని చెప్పాడు. నే నింటికి రాగానే తన దగ్గిర హాజరు కమ్మనదట గాని మా నాన్నగారు వద్దన్నారట. అంత

వరకూ నేనెన్నడూ మా అమ్మకు నమస్కారంచేసి ఆవిడ దీవెనలు పొందకుండా నిద్రపోలేదు. సరే-ఇప్పుడు చెయ్యగలిగిన దింకేంలేదు.

నేను బట్టలు మార్చుకుని పడుకుంటానని వారితో చెప్పి దీపం ఆర్పేశాను....కాని నేను బట్టలూ మార్చుకోలేదు-నిద్రాపోలేదు.

ఓ కుర్చీలో కూలబడి ఏదో మంత్రంచేత ముగ్ధుడనైపోయినట్లు అలానే చాలాసేపు కూర్చుండిపోయాను. .ఏదో నూతనమైన అనుభూతి, మధురమైన భావం నన్నావరించింది. గాఢమైన ఉద్వ్యేవ విశ్వాసాలతో చుట్టూ కలయజూస్తూ ఏదో జ్ఞాపకం వచ్చినప్పుడల్లా నిశ్శబ్దంగా నవ్వుకుంటూ నిశ్చలంగా కూర్చున్నాను. మధ్య మధ్య 'నేను ప్రేమలో పడిపోయాను-ప్రేమంటే ఇలా వుంటుందన్నమాట!' అని అనుకున్నప్పుడల్లా నా గుండెలు ఝల్లుమనేవి. నా వొళ్ళంతా చల్లబడిపోయేది. జీనైదా ముఖారవిందం నాకళ్ళముందే ఆడుతూవుంది-ఆ అర్థంకాని చిరునవ్వుతో-అనురాగంతో-ఆలోచనతో-ఏదో ప్రశ్నిస్తున్నట్లు అపాంగంగా నా వంక చూస్తూ....చివరకెల్లాగో లేచి అడుగుల్లో అడుగులు వేసుకుంటూ అతి జాగ్రత్తగా మంచం ఎక్కి బట్టలు మార్చుకోకుండానే నెమ్మదిగా పక్కమీద నడుం వాల్చాను. ఏమాత్రం తొందర పడ్డా నాలో అంచులదాకా వున్న దేదో తొణికిపోతుందని భయపడ్డట్టున్నాను....

పడుకున్నా నన్నమాటేగాని రెప్ప వాల్చలేదు. మళ్ళీ ఏవో స్మృతులు గదిలోకి తొంగి తొంగి చూడసాగాయి. నేను లేచి కిటికీవంక చూస్తూ కూర్చున్నాను. తుఫాను....! అవును-తుఫానే. ఎక్కడో దూరంగా....ఉరుములైతే వినిపించడం లేదుగాని-ఆకాశాన ఆ మూల మెరుపులుమాత్రం ఎడతెరిపి లేకుండా అస్పష్టంగా మెరుస్తున్నాయి-మెరవటంకూడా కాదు-వచ్చీరానట్టు కనిపించిపోతున్నాయి. నేను పక్కమీదనుంచి దిగి కిటికీదగ్గరకు వెళ్ళి తెల్లవారేదాకా అక్కడే నిలబడ్డాను ....ఒక్క క్షణంకూడా ఆగకుండా మెరుపులు వస్తూ పోతూనే వున్నాయి. రష్యన్ జానపదులు 'పిచ్చికల రాత్రి' అంటారు చూడండి-అలాంటి రాత్రి అది. మూగవోయిన ఇసుకదిబ్బవంక, నెస్కూచ్ని గార్డెన్స్‌లోని రూపరహితమైన ఛాయలవంక. మెరుపుమెరుపుకీ

వణికిపోతున్నట్లున్న దూరస్థలవన పురోభాగాలవంక చూస్తూ నిలబడ్డాను.... చూపులు మరల్చుకోలేకపోయి నిలబడ్డాను ఆ నిశ్శబ్ద విద్యుత్కాంతులూ, ఆ అణిగిమణిగిన దివ్యప్రకాశమూ, నాలో ప్రాదుర్భవించి రగులుతున్న ఉరువళ్ళకు పమాధానాలుగా తోచాయి. మళ్ళీ మరో రోజు ప్రారంభమౌతోంది. ఉదయారుణకాంతి ఎక్కువైనకొద్దీ మెరుపుల వెలుగు పసివాడి చివరకు నిర్మోహమైన ఆగామిదినకాంతిలో అదృశ్యమైపోయింది....

నా అంతః ప్రజ్వలనంకూడా సన్నగిలి, అమితమైన ధీరపమూ, విశ్చలత నన్నావహించాయి....కాని జీనైదా స్వరూపంమటుకు నన్నింకా విడనాడలేదు. కశ్మల తటాకంలోంచి లేచి వచ్చిన హంసలా ఈసారి ఆమె ఆకారం తన వికారపరిసరాలను విదలించుకువచ్చినట్లు అతిలోక సౌందర్యంతో భాసిల్లుతోంది. నిద్రాభరంతో కళ్ళు మూస్తున్న నేను మళ్ళీ మరోసారి ప్రగాఢమైన భక్తిశ్రద్ధలతో ఆమెముందు సాష్టాంగపడ్డాను....

స్వాధీనం తప్పని ఉద్రేకాలు-గొంతెత్తని శబ్దాలు-ప్రగాఢపంచలితమైన హృదయపు సౌమ్యత, ప్రశాంతి-ప్రథమ ప్రేమ విరాజమాన విద్యుజ్జ్యోతి-ఎక్కడున్నారమ్మా మీరంతా ఇప్పుడెక్కడున్నారు ?

8

తెల్లవారి నేను 'టీ'కి కిందకు దిగిరాగానే మా అమ్మ చివాట్లు పెట్టింది. నేను భయపడ్డంత ఇదేం లేదుగాని కిందటి రోజక్కడ జరిగిన సంగతులన్నీ చెప్పమంటూ కూర్చుంది. నేనూ చాలా వివారాలు వదిలేసి సాధ్యమైనంత అమాయకంగా అతిక్లుప్తంగా చెప్పాను.

"ఐనా వాళ్ళతో మనకేమిటీ? వాళ్ళచుట్టూ తిరగాల్సిన అవసరం నీకేంలేదు. పరీక్షలు దగ్గరకొస్తున్నాయ్-ఏ చదువేదో నువ్వు చదువుకో" అంది అమ్మ.

నా చదువుమీద మా అమ్మకున్న శ్రద్ధ ఈ రెండు మాటలూ దాటి అవతలకు పోదని నాకు తెలుసు. అందుకే అనవసరంగా ఆవిడతో వాదం పెట్టుకోలేదు నేను. కాని 'టీ' అయిన తర్వాత మా నాన్నగారు నా చేతికి తనచేయి కలిపి అలా తోటలోకి లాక్కుపోయి [illegible] యింట్లోనే చూసిన ప్రతి విషయమూ చెప్పించారు నాచేత.

మా నాన్నగారికి నామీద చాలా విచిత్రమైన ప్రభావం వుంది. నా చదువుసంధ్యలమీద ఎప్పుడూ అట్టే శ్రద్ధ తీసుకోరు - ఎప్పుడూ పల్లెత్తుమాటకూడా అనరు నన్ను. నా యిష్టాయిష్టాల్ని మన్నించేవారు. ఆ మాట వాడవచ్చో వాడరాదోగాని-నన్ను మర్యాదగా కూడా చూసే వారు....కాని ఎప్పుడూ అంత రంగంలోకి మటుకు రానిచ్చేవారుకాదు. నేనాయన్ని ప్రేమించాను ఆయన్ని చూసి గర్వపడ్డాను. మూర్తీభవించిన పౌరుషే యాతిశయంగా సంభావించాను. నన్నెప్పుడూ బారెడు దూరంలో వుంచుతాడన్న గుంజాటనొక్కటి నా మనస్సులో లేకపోతే ఆయన్ని నేనెంత పూజించేవాణ్ణో చెప్పలేను. ఆయన తలుచుకోవాలేగాని ఒక్క మాటతో ఒక్క సైగతో తనపై అంతులేని విశ్వాసాన్ని కలిగించగలరు. అటువంటి సమయాల్లో నా హృదయం పొంగి మనసు విప్పి మాట్లాడే స్తాను....మళ్ళీ అంత ఆకస్మికంగానూ నన్ను దూరంచేసి పారెయ్య గలరు. మనిషి అలాంటప్పుడు పరాభవించబడ్డట్టు బాధ పడతాడు-మనసు గాయపడే పరాభవంకాదు గాని ఎంత సున్నితంగా మృదువుగా దూరం చేసినా అది పరాభవమే సనిపిస్తుంది....ఆయనలాలన ఎంత ఆకస్మికమో ఆయన విముఖతకూడా అంత హఠాత్సంభవమే....

తర్వాత తర్వాత మా నాన్నగారి స్వభావంగురించి ఆలోచించి నప్పుడల్లా నేను-మా గృహ విషయాలే కాక ఆయన ఆలోచించాల్సినవి వేరే కొల్లలున్నాయనే నిర్ణయానికి వచ్చేవాణ్ణి. ఆయన మనసు వేరే వాటిల్లో లగ్నమైవుండేది. అవన్నీ కరువుదీరా అనుభవించేవారు. చేతి కందింది అనుభవించు. అంతేకాని మనస్సుమాత్రం దేనికీ లొంగిపోకు. జీవితమంటే-ఏదుమాత్రమే మనస్స స్వాధీనముద్దు కావడమని ఓసారి అన్నారాయన. మరోసారి వయసొచ్చిన తర్వాత నేను డెమోక్రాటుగా

మాట్లాడుతూ ఆయనముందే స్వేచ్ఛ - స్వతంత్రం గురించి మాట్లాడబోయాను. అప్పుడాయనన్నారు-'స్వేచ్ఛ! మనిషికి స్వేచ్ఛ నియ్యగలిగింది ఒక్కటే ఒక్కటుంది. అదేమిటో తెలుసా!'

'ఏమిటది!'

'సంకల్పం! స్థిరమైన దృఢసంకల్పం! ఏ స్వేచ్ఛా ఏ స్వతంత్రమూ ఇవ్వలేని శక్తినికూడా ఇవ్వగలదది! అసలు నీకావలిసిందేమిటో తెలుసుకోవడం నేర్చుకో బాబూ-అప్పుడే నువ్వు స్వతంత్రుడవై ఇతర్లను కూడా ఆదేశించగల సమర్థుడవౌతావు!'

మా నాన్నగారి ముఖ్యోద్దేశం 'బ్రతకడం'. నిజంగా 'బ్రతికాడు' కూడానూ ఆయన- 'బ్రతుకు' తానట్టేకాలం అనుభవించలేనని ఆయనకు ముందే తెలుసునేమో... నలభై రెండోయేట మరణించారాయన.

జెసీకిన్ల ఇంట్లో జరిగిన కార్యక్రమం యావత్తూ ఆయనకు సవిస్తారంగా వినిపించాను. ఎక్కడో చూస్తూనే చెప్పిందంతా విన్నారాయన. మధ్య మధ్య నావంక తమాషాగా చూసి చిన్న చిన్న ప్రశ్నలేస్తూ ఒకటి రెండు సార్లు నవ్వొచ్చి నవ్వారు కూడానూ. ముందు నేను జెనైధా పేరెత్తడానిక్కూడా భయపడ్డానుగాని పోను పోను పట్టలేక ఆమెను గురించి తెగ పొగిడాను. ముందాయనా తనలోతాను నవ్వుకుని తర్వాత కొత్త ఆలోచనాపరాయణుడై ఒళ్ళు విరుచుకుని బెంచీమీదనుంచి లేచాడు.

ఇంటిదగ్గరనుంచి బయలుదేరేటప్పుడు గుర్రం సిద్ధం చెయ్యమన్నారు-నాకు జ్ఞాపకం వుంది.

"నేనూ రానా నాన్నగారూ!" అనడిగాను.

ఆయన ముఖంలో మళ్ళీ యథాప్రకారం సప్రేమనిర్లక్ష్యభావం వచ్చేసింది.

"వొద్దు. కావాలంటే నువ్వొక్కడివీ వెళ్ళు. నాకు గుర్రం అక్కర్లేదనికూడా వాడికి చెప్పు." అంటూ ఆయన వున్నక్కడే వదిలేసి

ఉల్లాసంగా నడుచుకుంటూ వెళ్ళిపోయారు. గేటుదాటి కనుచూపుమేర దాటిపోయేవరకూ నా చూపులు ఆయనను వెన్నంటే వున్నాయి. కంచె అవతలనుంచి ఆయన టోపీ కనిపిస్తూనే వుంది. ఇంకొంచెం దూరం నడచి ఆయన జెసీకిన్ల ఇంట్లో ప్రవేశించడంకూడా చూశాను.

దగ్గిర దగ్గిర ఓ గంటసేపు ఉన్నారక్కడ. అక్కణ్ణుంచి బైటి కొచ్చి నరావరి వూళ్లోకి వెళ్ళిపోయి సాయంత్రానికిగాని ఇంటికి రాలేదు మళ్ళీ.

మధ్యాహ్నం భోజనాలయ్యాక నేనూ జెసీకిన్ల ఇంటికి వెళ్లాను. డ్రాయింగ్‌రూంలో వృద్ధరాజకుమారి ఒక్కతే వుంది. నన్ను చూడంగానే చేతిలోవున్న సూదితో తలమీద ఓసారి గోక్కుని 'ఓ దరఖాస్తు కాపీచేసి పెట్టగలవా' అని అడిగింది.

"తప్పకుండాను" అంటూ ఓ కుర్చీ అంచుమీద కూర్చున్నాను.

"అక్షరాలు కాస్త పెద్ద పెద్దవి రాయాలి సుమా....ఈ పూట పూర్తిచెయ్యగలవా?" అంటూ రవ్వంత సందులేకుండా బరికేసిన కాగితం ఒకటందించింది.

"అలాగే-ఈ పూటే చేసేస్తాను."

పక్కగది తలుపులు ఓరగా తెరుచుకుని జినైదా తొంగిచూసింది. ఆమె మొహం వివర్ణమై ఏదో ఆలోచిస్తున్నట్టువుంది. తల్లకూడా సరిగా దువ్వుకోలేదు-నావంక చూసి మళ్ళీ నెమ్మదిగా తలుపు మూసేసింది.

"జినా! జినా!....ఓ జినా!" ముసలావిడ కేకలుపెట్టిందిగాని జినైదా బదులుచెప్పలేదు. నేనావిడ దరఖాస్తు తీసుకుని ఇంటికివెళ్ళి ఆసాయంత్రం అంతా దానిమీదే కూర్చున్నాను.

9

ఆరోజునుంచే నాలో మోహం ప్రకోపించింది. జీవితపథంలో కొత్తగా అడుగుపెట్టినవాడిలా వున్నాయనుకుంటాను నా ఘనోభావాలన్నీ. నేను వట్టి యువకుణ్ణిమాత్రమే కాదు - ప్రేమికుణ్ణికూడాను! మోహంతోపాటు నా కష్టాలూ బాధలూకూడా ఆనాటినుంచే ప్రారంభం. జీనైదా ఒక్క క్షణం నాకు కనుమరుగైతే తపించిపోయేవాణ్ణి. ఏమీ తోచదు-రోజంతా ఆమెనుగురించే నా ఆలోచనంతా....ఆమె కనిపించనప్పుడు పరితపించిపోయినమాట వాస్తవమేగాని ఆమె సామీప్యంకూడా నన్నంతగా అలరించలేదు. నా పనికిరానితనం నాకు గోచరించింది. నాలో ఈర్ష్య జనించింది. చిరాకు ఎక్కువైంది. ఐనా ఏదో దుర్నివార్యమైన శక్తి నన్నామెదగ్గరకు లాగుతూనేవుంది. వాళ్ల గుమ్మందాటి లోపలికి అడుగు పెట్టినప్పుడల్లా గుండెలు కమ్మగా ఝల్లుమనేవి. నేను తన్ను ప్రేమిస్తున్నట్టు జీనైదాకు త్వరగానే అర్థమైపోయింది. అసలా సంగతి దాచిపెట్టడానికూడా నేనేం ప్రయత్నించలేదు. నా మోహం చూసి ఆమె నవ్వుకునేది-వెక్కిరించేది-తెలివితక్కువ వెధవకింద కట్టేసేది-ఏడిపించుకుతినేది. మరొకరి అమేయ ఆనందానికిగాని ప్రగాఢ దుఃఖానికిగాని ఏకైక మూలం కావడం అనేది చాలా మధురమైన విషయం. దానికితోడు మైనాన్ని మలచినట్లు మలచేది జీనైదా నన్ను. కాని ఆమెను ప్రేమిస్తున్నవాణ్ణి నేనొక్కణ్ణేకాదు. ఆ యింటికొచ్చే ప్రతి మనిషీ ఆమెనుగురించి ప్రలాపించడమే. అందర్నికూడా తన కాళ్ళముందు పడేసి వుంచేది. వాళ్ళలో ఆశలూ అపార్థాలూ రేకెత్తించి అందర్నీ తన చిటికెనవేలిచుట్టూ తిప్పడమంటే మంచి సరదా ఆమెకి. వాళ్ళు

కూడా ప్రతిఘటించే ప్రయత్నమైనా చేయకుండా ఆమె చెప్పుచేతలకు సంతోషపూర్వకంగా తలయొగ్గేవాళ్ళు. సోల్లాసమైన ఆమె సౌందర్యంలో ముందూ వెనకా చూడని తొందరపాటు, మితిలేని టక్కులూ, అతి నిరాడంబరతతోపాటు అస్వాభావికత, ప్రశాంతతోపాటు పాశవిక ఉత్సాహదీప్తి చాలా తమాషాగా పెనగొని వున్నాయి. ఆమె పలికిన ప్రతి పలుకులోనూ, వేసిన ప్రతి అడుగులోనూ, ప్రతి కదలికలోనూ కూడా ఏదో లావణ్యం తారట్లాడుతున్నట్టుండేది-ఏదో విచిత్రశక్తి ప్రభవించేది. అనుక్షణం మారిపోయే ఆమె ముఖకవళికలు మరో విచిత్రం. హాస్యపరిహాసం, ఆలోచన, ఆసక్తి-ఏభావమైనా ఇట్టే వుట్టిపడగల ముఖం. ఆమె కళ్ళల్లో, పెదవులపై బద్ధ విరుద్ధమైన భావాలు ఎండా కాలపు గాడ్పుల్లో మేఘాల్లా అతి చులాగ్గా, అతి శీఘ్రంగా పరస్పరం వెంటాడి తరుముతూంటాయి.

ఇప్పుడామెచుట్టూమూగిన భక్తాళుల్లో ఆమె కనవసరమైన వాళ్ళు ఎవరూ లేరు ఆమె పెంపుడు పశువు బెలోజొరోవ్ ఆమెకోసం నిప్పుల్లో దూకమన్నా సంసిద్ధుడేగదా! తన శక్తి స్తోమతలేవీకూడా ఆలోచించక మిగతావాళ్ళంతా సరదాకోసం తిరిగేవాళ్ళేనంటూ మాటి మాటికీ ఆమె పాణిగ్రహణం కోరుతూండేవాడు. మైదనోవ్ ఆమెలోని భావోద్రేకానికి సమాధానమయ్యాడు. సామాన్యంగా చాలామంది కవుల్లాగే అతనుకూడా వస్తుతః నిరుద్రేకి అయినా తానామెను పూజిస్తున్నట్టు ఆమెకు-బహుశః తన అంతరాత్మకుకూడా-నమ్మకంగా చెప్పజూసేవాడు. ఎంత తెచ్చిపెట్టుకున్నా నిష్కపటమైన పారవశ్యంతో అంతూ పొంతూలేని కవిత్వ ధారాపాతంలో ముంచెత్తేవాడు. అతనిపై కాస్తో కూస్తో జాలివున్నా జినైదా అతన్నికూడా కాస్త హేళనగానే చూసేది. అతని కవిత్వం విని విని చివరికి-వాతావరణంలోని కలుషత్వం పోవడానికంటూ-పుష్కిన్ కావ్యాలేమైనా చదవమంటూండేది. తోటి మనుషులంటే ఎంత ద్వేషమున్నా డాక్టర్ లూషిన్‌మటుకు ఆమెను అందరికంటే బాగా అర్థంచేసుకున్నాడు. అందరికంటే ఎక్కువగా ప్రేమించాడుకూడానూ! ఆమె ఎదట వున్నా లేకపోయినా తను తిట్టదలచుకున్నది తిట్టగాని

పూరుకోరు. అతనంటే ఆమెకు గౌరవంకూడా వుంది. ఐనాకూడా అతన్ని దయదలిచి వదిలేదికాదు. అతనూ తన కీలుబొమ్మల్లో ఒకడని ఆమె గర్వం. ఓసారి నా యెదురుగుండానే అతనితో అంది- 'అవునండీ. తమరన్నట్టు నేను కులుకులాడినే-నాకు హృదయం లేదు-నటన నా స్వభావం! సరే-మీ చెయ్యి ఇలా అందివ్వండి. పిన్నీసు పెట్టి గుచ్చుతాను. మీకు నెప్పి పుడుతుంది. అవమానమేస్తుంది. ఐనా మీరు మంచివారు-మంచితనంకొద్దీ నవ్వుతారు! నవ్వరా సత్య సంధులూ?' లూషిన్ మొహం పక్కకు తిప్పేసుకున్నారు. పెదవి కొరుక్కున్నారు. చివరికి చెయ్యజాచి అందించారు. జినైదా పిన్నీసుపెట్టి గుచ్చింది-అతను నిజంగా నవ్వాడు...............ఆమెకూడా నవ్వుతూ పిన్ను ఇంకా బాగా నొక్కింది అతని కళ్ళల్లోకే చూస్తూ. ఆమె చూపుల్నుంచి తప్పించుకోవాలని తెగ ప్రయత్నంచేశాడు గాని లూషిన్ - లాభంలేకపోయింది.... ....

కౌంట్ మాలెస్కీకి ఆమెకూ వున్న సంబంధం నా కసలే అర్థంకాలేదు. మనిషి బాగానే వుంటాడు-చలాకీతనం, తెలివితేటలూ అన్నీ వున్నాయి. ఐనా పదహారేళ్ళవాణ్ణి నాకే అతనిలో ఏదో కృత్రిమత కనిపించేది. జినైదాకు ఎందుకు గోచరించలేదో నా కాశ్చర్యంవేసింది. ఏమో-ఆమె తెలిసికూడా వూరుకుందేమో! ఆమె చదువు సంధ్యలలోని లోపాలు, ఆమె విచిత్ర స్నేహితులు, అలవాట్లు, ఇంటిలోని దారిద్ర్యము, అల్లకల్లోలమూ, విశృంఖల స్వేచ్ఛ, తనచుట్టూ చేరినవారందరికంటె తాను మిన్న అనే విరగబాటుతనం అన్నీ జేరి ఆమెలో అదోరకమైన తిరస్కారభావంతో కూడిన నిర్లక్ష్యాన్ని పెంపొందించాయి. నైతికంగా కూడా ఆమె మనసు కొఱడువారిపోయింది.... ....

మాలెస్కీ నెమ్మదిగా నక్కలా పక్కనజేరి ఆమె కుర్చీమీద పొంచి ఆమె చెవిలో ఏదో గుసగుసలాడినప్పుడల్లా-ఆమె చేతులు కట్టుకుని చిరునవ్వుతో గంభీరంగా అతనివంక చూస్తూ తల అడ్డంగా వూపి నవ్వుతల్లా నామటుకు నాకు రక్తం వుడికిపోయేది.

"కౌంట్ మాలెవ్స్కీని ఎందుకు రానిస్తావు ఇక్కడికి?" అని అడిగే వాణ్ణి నేనుకూడానూ ఓసారి.

"అతనికెంత ముచ్చటైన మీసం వుందో చూశావా?....అవున్లే నీకదేం తెలీదింకా." మరోసారి తనంతటతానే అంది—

"నే నతన్ని ప్రేమిస్తున్నాననుకుంటున్నారేమిటి ఖర్మ? ప్చ్.... నేను మెచ్చుకోలేని మనిషిని నేనెన్నడూ ప్రేమించలేను. నన్నెదిరించ గల మనిషి కావాలి నాకు. నా యిష్టాన్ని కాదనగలవాడుకావాలి. కాని దేవుడిదయవల్ల అలాంటివాడు దొరకడం అసంభవంలే!"

"అంటే-అసలు మీరెవళ్ళనీ కూడా ప్రేమించరా?"

"మిమ్మల్ని ప్రేమిస్తూనేవున్నాగా! ఏం-ప్రేమించడంలే?" తన చేతి తొడుతో నా ముక్కుమీద కొడ్తూ అంది.

అవును—నిజమే—జినైదాకు నేనొక విదూషకుణ్ణయ్యాను. మూడు వారాలపాటు వరసగా ప్రతిరోజూ ఆమె దర్శనం చేసుకునేవాణ్ని. ఆమైతే మాయింటికొట్టేసార్లు రాలేదుగాని వచ్చినప్పుడల్లా అతి మర్యాదగా, అతి వినయంతో అచ్చం రాజకుమారిలాగా ప్రవర్తించేది. ఆమెను చూస్తుంటే నాకు సిగ్గు ముంచెత్తుకొచ్చేది. మా అమ్మగారి ముందెక్కడ బైటపడిపోతానో అని భయం. జినైదా అంటే పరిపడని మా అమ్మ మా యిద్దర్నీ కళ్ళల్లో వత్తులేసుకుని కనిపెడుతూనే వుండేది.

మా నాన్నగారినిచూసి నాకంత భయంలేదు. ఆయనా అంతగా పట్టించుకోలేదు. జినైదాతోకూడా ఎప్పుడోగాని ఓమాట మాట్లాడేవాడు కాదు. చదువూ సంధ్యా మానేశాను. స్వారీ, షికార్లూ అసలేలేవు. కాలు కట్టేసిన కోడిలా ఆ పొరుగింటి చుట్టూ తిరిగేవాణ్ని ఎప్పుడూ. అసలు సాధ్యమైతే ఎప్పుడూ అక్కడే వుండిపోయేవాణ్ణి కూడాను. కాని మా అమ్మ గొణుగుతూవుండేది. ఒక్కోసారి జినైదాయే నన్ను బల వంతాన ఇంటికి పంపించేసేది అలాంటప్పుడు ఇంటికిపోయి గదిలో తాళంవేసుకుకూర్చునేవాణ్ణి లేకపోతే మా తోట మారుమూలకు వెళ్ళి పోయి కూలిపోయే గోడ యెక్కి కాళ్ళు దిగవార్చి ఆడిస్తూ శూన్యం

లోకి చూస్తూ కూర్చుండిపోయేవాణ్ణి. దుమ్ముకొట్టుకొనిపోయిన దూలగొంది మొక్కలమీద తెల్ల సీతాకోకచిలుకలు నిర్ధకంగా ఎగిరేవి. ఒంటరిపిచ్చుక ఒకటి ఎక్కణ్ణించోవచ్చి పగిలిపోయిన ఇటుకరాతి మీద వాలి గిర్రున తిరుగుతూ తోక ముడుస్తూ విప్పుతూ చిరాకు పుట్టేట్టు కిచకిచ లాడేది. చెట్ల చివారు కొమ్మలమీంచి కాకులు నావంక అనుమానంగా చూసేవి. ఒక్కోసారి డాన్స్కాయ్ మఠంలోంచి ప్రశాంతమైన నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వచ్చి చర్చిగంటలు నా చెవుల్లో పడేవి.

అనిర్దిష్టమైన భావోద్రేకమేదో గుండెలు నిండి వెల్లువలై పారగా కదలలేక అలానే అంతా చూస్తూ వింటూకూర్చుండిపోయేవాణ్ణి. సుఖం, దుఃఖం, ఖేదం, ఆనందం-జీవించాలని ఆశ,జీవితమంటే భయం-అన్నీ ఉప్పొంగివచ్చేవావెల్లువలో। కాని ఆ సమయంలో అవన్నీ నాకేం అర్థం అయ్యేవికావు. నా మనసులోని కల్లోలానికో పేరు పెద్దామన్నాచాతయ్యేదికాదు-పెట్టివుంటే ఒక్కటే పేరుపెట్టి వుండేవాణ్ణి-'జినైదా'।

అన్నాళ్లూ కూడా జినైదా ఎలుకతో పిల్లి చెలగాటలాడినట్లు నాతో ఆడింది. అంతలోనే దగ్గరజేరి సరసాలాడేది. అంతలోనే విరసంతో దూరంగా నెట్టేసేది. ఆమె సరసంతో కరిగి కల్లోలిత హృదయుణ్ణై పోయేవాణ్ణి. ఆమె తిరస్కారంతో మళ్ళీ ఆమె దరిజేరడానికి-ఆమెవంక కన్నెత్తి చూడటానికికూడా ఆస్కారం లేనంత విచలితుడనైపోయేవాణ్ణి.

ఓసారి వరసగా చాలా రోజులు నాకుదూరంగావుంటూవొచ్చింది. అప్పుడు వృద్ధరాజకుమారి మనసుకూడా ఏం బాగా లేవిపరిస్థితి. రెండు సార్లు పోలీసుస్టేషనుకు వెళ్ళి తన స్థితిగతుల్ని గురించి సంజాయిషీ చెప్పుకొచ్చింది కూడానూ. అలాంటి సమయంలోకూడా-జినైదా నన్ను దరిజేరనీయకపోయినా-ఆ యిల్లు వదలిపెట్టలేక సహం చచ్చి ఆ మూల లానిదగ్గరే కాస్సేపు కాలక్షేపంచేసి వస్తుండేవాణ్ణి.

ఓసారి తోట కంచె పక్కనుంచే పోతూజినైదాను చూశాను. పచ్చికగడ్డిమీద చేతులు వెనక్కి పెట్టుకుని నిశ్చలంగా కూర్చుని వుంది. నేనూ నిశ్శబ్దంగా వెళ్ళిపోదామన్నట్టు ప్రయత్నించా. కాని అకస్మాత్తుగా ఆమె తలయెత్తి చూసి రాజసం ఉట్టిపడేట్టు సంజ్ఞచేసింది. ఆసంజ్ఞ అర్థం

కాక, అక్కడే నిలబడిపోయాను నేను. ఆమె మళ్ళీ అదే సంజ్ఞ చేసింది. వెంటనే వర్ణనాశక్యం కాని ఆనందంతో ఎగిరి గంతేసి కంచెదూకి రెండంగల్లో ఆమెదగ్గర వాలాను. ఆమె ముఖం బాగా పాలిపోయివుంది. ఏదో అమితమైన వ్యసనమూ, గాఢమైన విసుగు, అలసట, ఆమె ముఖంలో ప్రస్ఫుటమౌతున్నాయి. నా గుండె తరుక్కుపోయింది. వెంటనే అడిగేశాను—

"ఏమిటండీ అలా వున్నారు?"

జినైదా చెయ్యిజాచి గడ్డిపరక ఒకటందుకుని తుంచి నోట్లో పెట్టుకుంది. ఒక్క క్షణంసేపు దాన్ని నమిలి అవతలపారేసి ఎట్టకేలకు అడిగింది—

"మీరునన్ను అమితంగా ప్రేమిస్తున్నారు...ప్రేమించడంలేదూ?"

నేను జవాబు చెప్పలేదు. చెప్పాల్సిన అవసరం లేదు.

ఆమె ఇంకా నావంకే చూస్తూ అంది—

"అవును-ప్రేమిస్తున్నారు. నాకు తెలుసు-" అంతలోనే ఏదో ఆలోచనాపరాయణురాలై మొహం చేతుల్తో కప్పేసుకుంటూ అంది-"అవ్వే కళ్ళు....నాకు రోతపుడ్తోంది. ఛీ ఛీ. ఎక్కడికైనా దిగంతాలకు లేచిపోవాలని వుంది. ఇహ నేను సహించలేను-నే భరించలేను....ఏం రాసిపెట్టివుందో నాకు....అబ్బ ఏమిటీ రంపకోత నాకు...."

"ఏమిటి-ఎందుకు?"

అని అతినెమ్మదిగా అడిగాను. గట్టిగా నోరెత్తి అడిగే సాహసం కూడా లేకపోయింది నాకు.

నా ప్రశ్నకు సమాధానంగా ఆమె ఒక్కసారి భుజాలు ఎగరేసి మాత్రం వూరుకుంది. నేనామెముందు అలానే మోకరిల్లి కూర్చున్నాను. ఆమెను చూస్తున్నకొద్దీ నా మనసు మరీ వ్యసనపడజొచ్చింది. ఆమె అడిన ప్రతిమాటా నాకు బల్లెమై గుచ్చుకుంది. ఆమె బాధేమిటో తొలగించడానికి నా ప్రాణాలైనా అర్పించి వుండేవాణ్ని అప్పుడు.

ఆమె అంత దురపిల్లవలసిన అవసర మేమిటో అర్థంకాక ఆమె వంకే చూస్తూ కూర్చుండిపోయాను. చుట్టూరా అంతా కన్నులపండువగా, పచ్చగా వెలుగు లీనుతూవుంది-అప్పుడే వీచిన చల్లని పిల్లగాడ్పుకి ఆకు లన్నీ అల్లల్లాడాయి - పక్కనేవున్న కోరింత చెట్లు తలలూపినాయి. అల్లంతదూరాన గువ్వలు గుసగుసలాడేయి-సమద షట్పదాలు ఝుంక రించాయి. వినీలమైన విశాలాకాశం వెలుగుల్ని గుమ్మరిస్తోంది. కాని నా మనసు చిన్నబోయింది. నా మనసుకూడా ఖిన్నతవహించింది

జినైదా ఒక మోచేతిమీద బరువంతా ఆన్చి నెమ్మదిగా అడిగింది—

"ఏదైనా కవిత చదివి వినిపిస్తారా? మీరు పాఠకులుగాని చద వరు-ఐనా మీరు చదువుతుంటే నాకుబాగుంటుంది. ఇలావచ్చి కూర్చోండి. కూర్చుని 'జార్జియా గిరులు' చదవండి."

నేను కూర్చుని 'జార్జియా గిరులు' చదివాను.

జినైదా ఆఖరుపాదాన్ని పునశ్చరణ చేసింది—

"ప్రేమించకుండా వుండుట
శక్తికి మించినదిగాదా!'....

అందుకే కవిత్వమంటే పడిచస్తాం మనం. మిథ్యావిషయాల్ని యదార్థం కంటే మనోజ్ఞంగా చిత్రిస్తుంది కవిత. అసలు యదార్థంకంటే మిథ్యే యదార్థమనిపించేట్టు చిత్రించగల శక్తి దానికుంది!....

'ప్రేమించకుండా వుండుట శక్తికి మించినదిగాదా....!'

అవును-మనసు ప్రేమించకూడదంటోంది- కాని హృదయం ప్రేమించకుండా వుండలేదు...."

మళ్ళీ కాస్సేపు మౌనం వహించి, జినైదా హఠాత్తుగా లేచి నుంచుంది—

"రాండి పోదాం. పాపం మైదనోవ్ ఒక్కడే వుండిపోయాడు అమ్మదగ్గిర. నాకోపం తన కొత్తగేయం ఏదో తెచ్చాడిందాక-నే విన కుండా వచ్చేశాను. అవలేమనిసి తల్లకిందులై పోయి వున్నారుకూడాను....

దానికి మనమేం చెయ్యలేమనుకోండి! సరే-ఎప్పుడో ఓ రోజు మీకే తెలుస్తుంది సంగతంతా....ఇప్పుడు మటుకు నామీదనేం కోపం పెట్టుకోకు బాబూ!....ఏం?....రా మరి!"

అంటూ నా చెయ్యి ఓసారి నొక్కి ముందు పరుగెత్తింది. ఇద్దరం కలిసి వాళ్ళింట్లోకి వెళ్ళాం. మైదనోవ్ అప్పుడే ప్రచురించబడిన తన "ఖూనీకోర్" చదివి వినిపించసాగాడు గాని అది విందామని నేనేం కూర్చోలేదు. జినైదా నాతో అన్న మాటలలోని అర్థమేమిటో....' అని ఆలోచిస్తూ ఆమె ముఖాన్నే పరీక్షగా చూస్తూ వున్నాను.

'లేక-
ప్రతిద్వంది ఎవడేని విన్న
ప్రలోభపరచాడా నా పడతి
ప్రమాదవశాన....?'

మైదనోవ్ గొంతుక విప్పి పరపర లాడించేస్తున్నాడు. జినైదా కూడా నా వంక క్రీగంట చూచి తటాలున చూపులు దించేసుకుంది ఆమె ముఖం హఠాత్తుగా కాస్త ఎఱ్ఱబారింది. ఆమె సిగ్గిలడం చూసి నా మనసు భయంతో కొయ్యబారిపోయింది. నేనూ కొన్నాళ్లు ఈర్ష్య అనుభవించాను కాని-ఆమె ప్రేమలో పడవచ్చునని నా కెప్పుడూ ఆలోచనైనా రాలేదు.

"అరెరె! ఆమె ప్రేమిస్తోంది-ఎవర్నో!"

10

అప్పట్నుంచే నేను చిత్రహింస పడటం ప్రారంభమైంది. అంతు లేని ఆలోచనలతో తల బద్దలుకొట్టుకుంటూ జినైదాని సర్వదా ఓకంట కనిపెడుతూ వచ్చాను. ఆమెలో ఏదో మార్పుమటుకు వచ్చింది-అంత వరకూ ఖాయం, ఒంటరిగా చాలాదూరం కాలినడకన తిరిగి రావడం కూడా సాగించింది. ఒక్కోసారి ఇంటికొచ్చిన మిత్రులను చూడకుండా గదిలో తాళం వేసుకు కూర్చునేది. అది ఆమె తత్వానికి చాలా విరుద్ధ మైన విషయం. వున్నట్టుండి నేనూ చాలా సూక్ష్మగ్రాహినయ్యాను-అధ మం అయినట్టు భావించాను.

'వీడా? లేకపోతే-వాడా?' అని ఇంటికొచ్చేవాళ్ళందరిమీదా నా అనుమాన దృక్కులు బరపి జూశాను. అసలు వాళ్ళల్లో ఎవర్ని అను మానించినా నాకూ జినైదాకూ అన్యాయం చేసుకున్నట్టే అవుతుందను కోంది....కాని వున్నవాళ్ళందర్లోకీ కౌంట్ మాలెస్కీ ఒక్కడే కాస్త ప్రమాదకరంగా కనిపించాడు.

నేను దాపరికంలేని మనిషిని. ఏవిషయాన్నీకూడా దాచిపెట్టలే ననుకుంటాను. డాక్టర్ లూషిన్ ఒకడు నన్ను వెంటనే కనిపెట్టేశాడు. కాని ఆయన కూడా ఈమధ్య బాగా మారిపోయాడు. మనిషి మరీ చిక్కి పోయాడు. వెనకటిలాగే ఇంకా నవ్వుతున్నాడుగాని ఇప్పుడా నవ్వుల్లో తృప్తిగాని ఆనందంగానీ ఏమీలేవు. వెనకటి వ్యంగ్యం, తెచ్చిపెట్టుకున్న మానవ ద్వేషమూ అన్నీ పోయి మళ్ళపెట్టుకోలేని చిరాకు ఎక్కువై పోయింది.

ఓసారి శశికళా యింట్లో జనైదాకోవం వీక్షిస్తూ మేం ఇద్దరం కూర్చుని వుండగా అడిగాడు—

"ఎందుకుబాబూ ఇంత తరుచుగా ఇక్కడికొస్తావ్ నువ్వు? ఇంకా కుర్రవాడివి-చదువుకోవాల్సిన వాడివి-నీకు తగునా ఇది?"

"నేను ఇంటిదగ్గర చదువుకుంటున్నానో లేదో మీకేం తెలుసు?" అని నా తడబాటు కప్పిపుచ్చుకోడానికి ఎదురుప్రశ్న వేశాను.

"ఓ! నాకు తెలీదంటావ్!........అవున్లే-నీతో వాదించను. నీ వయస్సులో అది సహజమేననుకో....కాని పడక పడక తలేచోట పడ్డావ్! ఈ ఇల్లూ వ్యవహారం నీ కింకా బోధపడలేదా?"

"క్షమించండి-మీరేం మాట్లాడుతున్నారో నా కంతుపట్టకుండా వుంది."

"ఓ! అంత దారుణంగావుందా నీ పరిస్థితి! ఐతే నిన్ను హెచ్చరించడం నా ధర్మం. ఏదో నాలాంటి వృద్ధ బ్రహ్మచారులం వస్తూ పోతూంటంలో పెద్ద నష్టమేంలేదు-మాదేముంది-ఎప్పుడో మొండికేసి పోయాం. మమ్మల్ని ఏదీ బాధపెట్టలేదు. కాని నువ్వింకా పసివాడివి. ఇక్కడ గాలి నీకు పడదుబాబూ నా మాట నమ్ము—చెడిపోతావ్!"

"అంటే మీ అభిప్రాయం-?"

"నీ ప్రస్తుత పరిస్థితి బాగుందంటావా? అది సహజమేనా అసలు? ఇప్పుడు నువ్వనుభవిస్తున్నదంతా నీ యీడుకు మంచిదేనంటావా?....చెప్పు మరి-"

"ఏమిటది? నేనేమనుభవిస్తున్నానంటా రిప్పుడు?"

డాక్టరు చెప్పేది వాస్తవమేనని నా గుండెలు ఘోషిస్తూనేవున్నా తప్పించుకుందామని చూశాను.

"హోరి కుర్రాడా! హోరి కుర్రాడా!....అ(....! ఊ(....! దిక్లామసీ చస్తే నీవల్లకాదుబాబూ! దేవుడిదయవల్ల నీ ముఖం ఇంకా నీ హృదయానికి దర్పణంగానేవుంది....ఊ(-వ్స్.నాగేం ప్రయోజనం?" డాక్టరిక్కడ ఓసారి పళ్ళు కొరుక్కున్నారు—

"నేను ఏలాంటి మూర్ఖుణ్ని కాకపోతే ఈ కొంప పట్టుకు వేళ్ళాడుతూంటానా ? కాని-మీలాంటి తెలివిగలవాడుకూడా ఇక్కడజరుగు తున్న తంతు తెలీకుండా వుంటమే నా కాశ్చర్యమేస్తోంది!"

"ఏమిటండీ ఆ తంతు ?"

ఏవిధమైన అమాయకీఅయినా తెలుస్తుందేమోనని గళాల్ని వంచేం ద్రియాలూ బిగబట్టి అడిగాను.

కాని డాక్టరు నావంకకు చోద్యమైన అనుకంపతో చూసి తనలో తాననుకున్నట్టు అన్నాడు—

"నేనేనేమిటి అంత దుర్మార్గుణ్ని.... నేనెందుకు చెప్పాలితనికి ?" అంతలోనే గొంతు కాస్త పెద్దదిచేసి అన్నాడు—

"ఒక్క మాట చెప్తాను వినుబాబూ-ఈ వాతావరణం నీకు మం చిదికాదు. ఇప్పుడు ఆనందంగానే వుండొచ్చు-కాని ప్రయోజనం ?.... ఎందుకొచ్చిందిగాని-ఇంటికెళ్ళి మళ్ళీ క్రైదనోవ్ హిస్టరీపుస్తకం చేతబట్టు నామాట విను."

అంతలో వృద్ధ రాజకుమారి తన పిప్పిపంటిబాధ డాక్టరుతో చెప్పుకోడానికి లోపలికి వచ్చింది. తర్వాత కొంతసేపటికి జినైదా కూడా దయచేసింది. ఆమెను చూడగానే తల్లి తనబాధ వదిలేసింది -

"అదుగో చూశారా డాక్టరుగారూ! కాస్త మీరైనా గట్టిగాచివాట్లు పెడుదురూ మీకు పుణ్యం వుంటుంది. పొద్దుగూకులూ ఐస్‌వీళ్ళు తాగుతూ కూర్చుంటుంది. అసలే బలహీనపు గుండెకదా - దానికేమన్నా మంచిదా అది-చెప్పండి ?"

"ఎందుకలా తాగడం ?" అని డాక్టరు జినైదాని ప్రశ్నించాడు.

"తాగితే వచ్చే నష్టమేమిటిలెద్దురూ !"

"నష్టమా ?....శైత్యంచేసి చస్తావ్ !"

"నిజంగా ?....నిజంగా అలా జరుగుతుందంటారా ?....అదొ చ్చినా బాగుండునని వుంది."

"ఓ ! అందాకా వచ్చిందీ !" అని డాక్టరు గొణిగాడు.
జీనైదా తల్లి గదిలోంచి వెళ్ళిపోయింది.
జీనైదా అంది—

"అవును-అందాకా వచ్చింది....లేకపోతే జీవితం అనేది అంత పసందైన విషయ మంటారా డాక్టర్ ? ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకోండి....సంతోషించదగ్గ సంగతి ఒక్కటుందా ? నాకేం తెలీదు-నాకేం అర్థంకాదు-నాకేం అనుభూతుల్లేవు అనా మీ అభిప్రాయం ? ఐస్ నీళ్ళు తాగటమంటే నాకు సరదాగా వుంటుంది. ఒక్కక్షణం సరదా కోసం జీవితాన్ని పణంగా పెట్టవద్దని మీరేమో పెద్ద చెప్తొస్తారు-ఆనందం అనేది కల్లోకూడా ఆశించలేని ఇంతోటి బతుకూ ఎక్కడ దాలిపోతుందనని !"

"ఓహో ! చపలచిత్తం-స్వేచ్ఛ-"
జీనైదా బలహీనంగా నవ్వింది—

"మీరింకా పాతకాలంలోనే వున్నారు. మైడియర్ డాక్టర్ ! మీ చూపుకూడా సన్నగిల్లింది. కాస్త కళ్ళజోడు పెట్టుకుచూడండి - చపల చిత్తానికీ మనకీ ఎంతదూరమో తెలిసిపోతుంది. మిమ్మల్నందర్నీ వెఱ్ఱి నాగమ్మలకింద కట్టేసి నేనూ మరో నాగమ్మలా నాటకమాడటం అదీ చాలా బాగానే గడిచిపోయిందీ....ఇదుగో మాన్షియర్ వాల్డెమార్ ! ఎందుకూ మొహం అల్లా పెడతావ్ ? దయచేసి నన్నుచూసిమటుకు జాలిపడకండి !"అంటూ పదఘట్టనంచేసి గబగబా నడిచి వెళ్ళిపోయింది.

"ఏం లాభంలేదుబాబూ-ఈ వాతావరణం నీకేం లాభంలేదు. నష్టపడతావ్-జాగ్రత్త !" అన్నాడు మళ్ళీ డాక్టర్ లూషిన్.

11

ఆరోజు సాయంత్రం మామూలుగా వచ్చే బృందమంతాకూడా జెసీకిన్ల ఇంట్లో సమావేశమైంది. నేనూ వున్నా నందులో.

సంభాషణ మైదనోవ్ గేయంమీదికి తిరిగింది. జినైదా నిజంగానే మెచ్చుకుంది—

"కాని.... నేనే కవయిత్రినైతే చాలా విభిన్నమైన విషయా లేరుకుంటాను నా కవిత్వానికి. నిద్రపట్టక తన్నుకులాడేటప్పుడు - సరిగ్గా తెల్లవారుజామున-చాలా విచిత్రమైన భావాలు వస్తూంటాయి నా బుఱ్ఱలోకి! ఓసారి నేను-ఊఁ-ఎందుకులేండి మీరంతా నవ్వివోతారు!"

"ఎబ్బెబ్బే!....ఛా-మేం నవ్వంగా!" అని అందరం ముక్త కంఠంతో అన్నాం.

జినైదా చేతులుకట్టుకుని ఎటువైపో చూస్తూ చెప్పసాగింది—

"రాత్రి....ప్రశాంతంగా ప్రవహించిపోతున్న నది....అందులో ఒక పెద్ద పడవమీద చేరిన ఆడపిల్లల గుంపు....పండు వెన్నెల.... అందరూకూడా తెల్లని బట్టలు వేసుకుని వున్నారు-తెల్లటి పుష్పగుచ్ఛాలతో వాళ్ళంతా సింగారించుకుని ఆదేదో పాటో యేదో మరి-ఆలపిస్తున్నారు—"

"ఓహోహో! ఊఁ-చెప్పండి చెప్పండి!" అన్నాడు మైదనోవ్ ఏదో స్వాప్నికానుభూతిలోకి అప్పుడే వెళ్ళిపోతూ.

"హఠాత్తుగా-ఒడ్డుమీద కలకలం-నవ్వులు - కాగడాలు - తంబుర వాద్యం....హోళీపండుగ చేసుకుంటున్న గుంపొకటి ఆడుతూ పాడుతూ

అరుస్తూ పరుగెత్తుకొస్తోంది. ఆ దృశ్యం చిత్రించడం మీవనండీ కవి గారూ!....కాని నాదో చిన్నసలహా-కాగడాలు పొగలుగక్కుతూ ఎఱ్ఱగా మండిపోతూండాలి. వాళ్ళందరికళ్ళూ నెత్తిన కట్టుకున్నపూలదండల కింద మెరసిపోతూండాలి. పులిచర్మాలూ-పానపాత్రలు-పసిడి అలంకారాలూ మటుకు మర్చిపోకండి!"

"పసిడి అలంకారాలా? అవ్వెక్కడ పెట్టాలి?" అని అడిగాడు మైదనోవ్ నాపికాపుటాలు ప్రచలింపచేస్తూ.

"ఎక్కడనేమిటి - బుజాలకి - చేతులకి - కాళ్ళకి - ఎక్కడపడితే అక్కడల్లానూ! వెనక ఆడవాళ్ళు కాళ్ళకున్నూడా బంగారపు కడియాలు వేసుకునేవారని తెలీదూ?....వాళ్ళంతా వచ్చి పడవలోవున్న కన్నెపిల్లల్ని కేకవేశారు. వీళ్ళంతా పాట మరిపాడుకోలేక ఆపేసి కదలకుండా మెదల కుండా కూర్చున్నారు. పడవ నెమ్మది నెమ్మదిగా ఒడ్డుకు జేరుకుంటోంది. అంతలో అకస్మాత్తుగా అతినెమ్మదిగా లేస్తుంది వాళ్ళల్లోంచి ఓపిల్ల.... మేఘాచ్ఛన్నమైన చంద్రజ్యోత్స్నలా ఆమె లలితంగా లావణ్యం ఒలికి పోయేట్టులేవడం - మిగతా అందరి కంగారు.... ఇక్కడమటుకు మీ శక్తంతా ధారపోసి బొమ్మ కట్టించాలి మీరు!

"ఆమె పడవచిగురున అడుగు పెట్టంగానే ఒడ్డున వున్నవాళ్ళంతా అమాంతం ఎగరేసుకుని ఆ నిశీధిలోకి-ఆ గాఢపాంద్ర....ఎక్కడ చూపినా పొగ-మేఘాలు మేఘాలుగా పరిభ్రమించే పొగ - కల్లోలం-గొడవ-వీటన్నిటిలోంచి ఆ విలాసుల కేకలు—ఎలుగెత్తి పెట్టే అరుపులు-ఒడ్డున జారిపడిపోయిన ఆమె పిగపూల చెండు....అన్నీ కళ్ళకుకట్టినట్టు కనిపిస్తున్నాయి!—"

జినైదా చెప్పడం మానేసి ఎక్కడో చూస్తూ నిలబడిపోయింది. ఆమె వాలకంచూసి మళ్ళీ అనుకున్నాను—

'ఈమె నిజంగా ఎవర్నో ప్రేమిస్తోంది! అవును-అందులో సందేహం ఏమాత్రం లేదు!'

"అంతేనా!" అనడిగాడు మైదనోవ్.

"అంతే!" అని జవాబిచ్చింది జినైదా.

"అదో పెద్ద కావ్యానికి తగ్గ వస్తువేం కాదుగాని....ఏదో 'చిన్న ఖండికకు' వుపయోగించుకోవచ్చుతే మీరిచ్చిన భావం!"

"శృంగార సంబంధంగానేనా ?" అని ప్రశ్నించాడు మాలెస్కీ.

"అవునుమరి. బైరన్ ధోరణిలో !"

"ఆ(అ(-బైరన్‌కంటే నాకు విక్టర్ హ్యూగోయే బాగుంటాడు!" అని నిర్లక్ష్యంగా చప్పరించాడు కౌంట్.

"విక్టర్ హ్యూగోకేం చాలా మంచి రచయిత. ఎందుకూ-నా మిత్రుడు టాం కోషేవ్ తన స్పానిష్ నవల 'ఎల్ ట్రావదోర్'లో-" అంటూ ఏదో చెప్పబోయాడు మైదనోవ్. కాని జినైదా మధ్యలోనే ఆపి ప్రశ్నించింది—

"ఏది-ప్రశ్నలగుర్తులన్నీ తల్లకిందులుగా రాసిన పుస్తకమేనా ?

"అవును-స్పానిష్ భాషలో అదో సాంప్రదాయం. ఆ పుస్తకంలో—"

"అబ్బ-మళ్ళీ ఏదో సాహిత్యగోష్ఠిలోకి దిగుతున్నావ్ - ఏమైనా ఆడుకుందాం.పదుదురూ కాస్సేపు !" అన్నది జినైదా మళ్ళీ అతన్ని ఆపుతూ.

"'ఫర్‌ఫిట్స్' ఆడదామా ?" అన్నాడు లూషిన్.

"అదంటే తలనొప్పిపుడుతోంది నాకు ! 'ఉపమానాలు' ఆడుకుందాం."

[ఈ ఉపమాన క్రీడకూడా జినైదా సృష్టించినదే. ఏదో ఒకవస్తువు ఎన్నుకోవడం-ప్రతివాడూ దానికో ఉపమానం చెప్పడం-ఎవరి ఉపమానం బాగుంటే వాడికి బహుమానం.]

జినైదా గవాక్షందగ్గిరికి వెళ్ళింది. సూర్యుడు అప్పుడే అస్తమించాడు. అరుణరాగ రంజితాలైన నిడుపాటి మేఘాలు ఆకాశంలో అల్లంత ఎత్తున వ్యాపించివున్నాయి.

"ఆ మేఘమాలికలెలా వున్నాయి?" అని ప్రశ్నించి ఎవరూ సమాధానం చెప్పకుండా తానే వెంటనే అంది—

"అంటోనీని కలుసుకోవడానికి అభినయిస్తున్న క్లియోపాత్రి పసిడి నావయొక్క తెరచాపల్లా వున్నాయి నాకు। ఈ మధ్యనే ఓ సారి నాతో అన్నారు మీరు-జ్ఞాపకముందా మైదనోవ్ ?"

మేమందరంకూడా వెంటనే జినైదా ఉపమానం చాలా అద్భుతంగా వున్నదనీ, అంతకంటె మంచి ఉపమానం చెప్పడం ఇంకెవరివల్లా కాదనీ నిర్ణయించేశాం.

జినైదా అడిగింది—

"అప్పటికి అంటోనీకి ఎన్నేళ్ళుంటాయో?"

"చాలా చిన్నవాడనుకుంటాను" అన్నాడు మాలెస్కీ.

"అవును. చాలా చిన్నవాడు।"అని మైదనోవ్ రూఢిగా అన్నాడు.

"క్షమించండి-అంటోనీకి నలభయ్యేళ్ళు దాటాయి అప్పటికి।"

అని ఖండించాడు లూషిన్.

జినైదా చటాలున అతనివైపు తిరిగింది—

"నలభై దాటాయా।"

తర్వాత కొద్దిసేపటికే నేను ఇంటికి వెళ్ళిపోయాను.

'ఆమె ప్రేమిస్తున్న మాట ఖాయం-కాని-ఎవర్ని ప్రేమిస్తోంది?'

12

రోజులు గడిచిపోతున్నాయి. జినైదాకూడా ఆరోజుకా రోజుకు విచిత్రంగా దురూహ్యంగా తేలుతోంది మనిషి. ఓసారి నేనామె గదిలోకి వెళ్ళినప్పుడు కుర్చీలో కూర్చుని తల టేబులుమీద ఆనించివుంది. ఆమె తలయెత్తి చూసింది. చెక్కిళ్ళన్నీ కన్నీళ్ళతో తడిసిపోయి వున్నాయి.

కసిగా చిరునవ్వు నవ్వుతూ నన్నాహ్వానించింది—

"ఓ-తమరా!....ఇలా రండి!"

ఎదురు మాటలేక నేనామెదగ్గరకు వెళ్ళాను. ఆమె నా తలమీద చేయి పెట్టి నాలుగు వెంట్రుకల కుచ్చొకటి పట్టుకుని మెలివేయసాగింది.

కొంతసేపెలాగో ఓర్చుకున్నాను గాని మరి తాళలేక అనేశాను-

"అబ్బ-నెప్పిపుడుతోంది!"

"ఓ! నెప్పిపుడుతోందా! మరి నేనేనా బాధపడటం లేదనుకుంటున్నావ్?"

కుచ్చు ఊడబెరుక్కుని ఆమెచేతిలోకి వచ్చేసింది.

"అరే! ఎంతపని చేశానో మాన్షియర్‌వాల్దెమార్! అయ్యో పాపం-!" అని నొచ్చుకుంటూ అతిజాగ్రత్తగా తన వేలికి ఉంగరంలా చుట్టుకుంటూ అంది జినైదా—

"మీ శిరోజాన్ని ఓ లాకెట్‌లో పెట్టి నా గుండెలమీద ధరిస్తాను. దాంతోనైనా మీకు కాస్త తృప్తి కలుగుతుందేమో....ఊ!-ఇహ వెళ్ళిపోండి మీరు." ఆమె కళ్ళల్లో మీళ్ళు గిర్రున తిరిగాయి.

నేనింటికి వెళ్లేసరికి అక్కడేదో గొడవ జరుగుతోంది. మా అమ్మా నాన్నా ఏవో సంజాయిషీలు చెప్పుకుంటున్నారు. అమ్మ ఆయన్నిదేనికో

చివాట్లు పెడుతోంది, ఆయన తన మామూలు పద్ధతిలో వినిపించుకునీ వినిపించుకోకుండా గొడవ పెరగకుండా ఎక్కడికో వెళ్ళిపోయాడు. [అసలే అంతూ పొంతూలేని ఆలోచనలతో సతమౌతున్న నేను] మా అమ్మ అన్నదేమిటో సరిగా వినిపించుకోలేదు. మా నాన్న వెళ్ళిపోయిన తర్వాత మా అమ్మ నన్ను పిలిచి ఎంతకైనా తగిన ఆరాజకుమారి ఇంటికి నే తరుచు వెళ్తున్నందుకు అసంతృప్తి వెళ్ళబోసింది. ఆవిడతో సంభాషణ అపుజెయ్యాలనుకున్నప్పుడల్లా జేసినట్టే అప్పుడుకూడా ఆమె చేయి ముద్దుపెట్టుకుని వినమ్రుడనై నా గదికి వెళ్ళిపోయాను. జినైదా కన్నీరు నన్ను దిగ్భ్రాంతుణ్ణిజేసింది. ఏమనుకోవాలో ఏమిటో ఏమర్థంకాక నా కూ యేడుపొచ్చేట్టుంది. పదాహారేళ్లు వచ్చాయన్నమాటేగాని ఇంకా పసిపెదపనేగదా. మాలెస్కీవిగురించిగానీ- అతన్ని నమిలి మింగేద్దామన్నట్టు మేకపిల్లవంక క్రొన్నెత్తురు గ్రోలే తోడేలులా చూసే బెలోవ్జారోవ్ గురించిగానీ నేనేం పట్టించుకోడం లేదు. అసలెవర్నిగురించీ పట్టించుకోడంలేదు-ఏమీ ఆలోచించడంలేదు కూడానూ. అంతుతెగని అనుమానాల్లో మునిగితేలుతూ నిర్జనాలైన నెలవులు వెతుక్కునేవాణ్ని. మాతోటలో కూలిపోతున్న గోడ అంటే ప్రత్యేకాభిమానం కలిగింది. ఆ గోడ యెక్కి నామీద నేనే జాలిపడుతూ నన్ను నేనే అనునయించుకుంటూ విషాదసంతప్త హృదయుడైన యువకుణ్ని నేను ఒంటరిగా ఏకాకినై కూర్చుంటూండేవాణ్ని-అబ్బ! ఆ విషాదభావాలు ఎంత మధురంగా వుండేవి! వాటిల్లో 'తల మునకలుగా ఎంత ఆనందించేవాణ్ని!

ఒకరోజు నేనా యెత్తైన గోడ యెక్కి దూరంగా చూస్తూ చర్చి గంటలు వింటూ కూర్చున్నాను....అకస్మాత్తుగా నా వొళ్ళు కాస్త సంకుచించినట్లనిపించింది. అది వున్నట్టుండి వీచినగాలీ కాదు-వొళ్ళు జలదరింపూకాదు-ఎవరో సమీపించిన భావం—ఎవరో నా అంతికంలోనే సంచరించిన జ్ఞానం....నేను కిందికి చూశాను. ఊదా రంగు దుస్తులు వేసుకుని ఒక బుజంమీద ఎర్రవాగ్దావున్న బుల్లిగొడుగు వేసుకుని జినైదా గబగబా వస్తోంది ఇటువైపే. ఆమెకూడా నన్నుచూసి గభాల్న

ఆగిపోయింది. టోపీ అంచు ఎత్తి తన స్నిగ్ధ నేత్రాలు నామీద నిలిపి విచిత్రంగా మందహాసంచేస్తూ అంది—

"అక్కడేంజేస్తున్నారుబాబూ ?....ఆః-అన్నట్టు- చీటికి మాటికి నామీద ప్రేమనిగురించి లెక్చర్లు దంచుతారుగదా-నన్ను నిజంగానేకనక ప్రేమిస్తుంటే అక్కణ్ణుంచి రోడ్డుమీదికి దూకండి చూదాం!"

ఆమె అన్నదే తడవుగా వెనకనుంచి ఎవరో తోసినట్టు గబాల్న ముందుకు దూకాను. గోడ నాలుగడుగుల ఎత్తు వుంటుంది-నేలకు కాళ్లు ఆనాయిగాని ఆ దూకుడుకు తట్టుకోలేక ఒక్కక్షణం స్మృతితప్పి పడిపోయాను. మళ్ళీ తెలివివచ్చి కళ్ళు తెరవకముందే జినైదా నా పక్కనే వున్నట్టు అవగతమైంది. నామీదికి వంగి ససంభ్రమంగా సానురాగంగా ఆమె అంటోంది—

"ఓహ్-మైడార్లింగ్! ఎంతపని చేశావ్! ఎందుకువిన్నావ్ బాబూ నామాట? నేను నిన్ను ప్రేమిస్తున్నానని నీకుమాత్రం తెలీదా?....లే బాబూ లే."

ఆమె చేతులు నా తలను నిమిరి నొక్కుతున్నాయి. .ఆమె వక్షస్థలం నాకు మరింత చేరువైంది....తర్వాత....తర్వాత....ఆమె నును వెచ్చని అధరాలు మృదువుగా నా మొహమంతా ముద్దులు గుమ్మరించాయి....చివరకు నా పెదవులపైనకూడా....కాని-నేను విస్మృతిలో లేనన్న సంగతి నా దొంగమొహం బైటపెట్టి వుంటుంది-జినైదా తటాలున లేచి నిలబడి అంది—

"లేవ్వయ్యా కొంటె కోణంగి! పిచ్చియేమైనా యెక్కిందా నీకు-ఏమిటా దుమ్ములోపడి దొర్లడం?"

నేను లేచి నిలబడ్డాను.

"చూడు నా గౌను గెక్కడ పారేశావో! అదిలా అందియ్యి. ఊః....ఎందుకలా చూస్తావ్ నావంక?....పాపం దెబ్బేమైనా తగిలిందా? అరె-నావంక అల్లా చూడకయ్యా బాబూ అంటూంటే......జవాబు చెప్పవూ....! నా మాటలుకూడా చెవుల్లో పడటంలేదుగామోను!....సరే

కొ_స్త ఆ బట్టలు దులుపుకుని ఇహ వింటికి దయచెయ్యండి మాన్షియర్ వాల్డెమార్ ! నావెంటమాత్రం పడకండి. నన్ను వెంటాడేరో నాకు భలే కొపమొస్తుంది. ఇహ మళ్ళీ జన్మలో........"

మాట పూర్తికాకుండానే గబగబా నడుచుకుంటూ వెళ్లిపోయింది. నా మోకాళ్ళల్లో వణుకు ఇంకా వదల్లేదు. రోడ్డుపక్కనే కూలబడ్డాను. చేతులన్నీ గీరుకుపోయాయి. నడుమంతా పట్టేసింది. తల తిరిగిపోతోంది. ఐనా ఆక్షణం అనుభవించిన దివ్యానందం ఇంకెప్పుడూ ఎరగన్నేను. అంగాంగాలోనూ పొటకరించుకు వచ్చింది కమ్మని బాధ. ఆనందంపట్టలేక ఎగిరి గంతులువేశాను. అరిచి కేకలుపెట్టాను. నిజానికి ఇంకా కుఱ్ఱకుంకని కాకపోతే ఏమిటి నేను !

13

ఆ రోజంతా చాలా హుషారుగా, ఉప్పొంగిపోతూ గడిపాను. నా ముఖంమీద జినైదా కురిపించిన ముద్దులు ఇంకా బాగా జ్ఞాపకమున్నాయి. ఆమె తన్మయత్వంతో అన్న ప్రతి మాటా మళ్ళీ మళ్ళీ అనుకున్నాను. నా ఆకస్మికమైన అదృష్టానికి నన్ను నేనే అభినందించుకున్నాను. ఇక నేను కోరదగిందేదీ లేదనిపించింది. మర్నాడే ఊపిరితీసి చచ్చిపోయినా ఫరవాలేదనిపించింది.

కాని మర్నాడు మళ్ళీ వాళ్ళయింటికి బయలుదేరుతున్నప్పుడు మటుకుమనసు కొ_స్త జంకింది. విషయం ముంచుకు రానేవచ్చింది. అది కప్పిపుచ్చుకోడానికి కొంచెం మొహమోటం మిళితం చేసినచనువు మాత్రం ప్రదర్శిద్దామనుకున్నాను, కాని జినైదాలో మటుకు ఏ ఉద్రేకమూ సూచనప్రాయంగానైనా కనిపించలేదు నాకు. వెనకటిలాగే చూసింది నన్ను. కాకపోతే నావంక వేలు ఆడిస్తూ దెబ్బలేం బాగా తగ

ల్లేదుగదా అని మాత్రం అడిగింది. దాంతో నా మొహమోటపు చమవు, నిగూఢ ప్రవర్తన మటుమాయమైపోయాయి. వాటితోపాటు నా జంకు, బిడియం కూడా అదృశ్యమైపోయింది. జినైదా ఫలానా మోస్తరుగా ప్రవర్తిస్తుందని నేనేం ఊహించలేదు గాని; ఆమె ప్రశాంతత, నిరుద్రిక్త పరిస్థితి చూసి చన్నీళ్ళ స్నానంచేసినట్లైంది. ఆమె కళ్ళముందు నేనో పసికుంకనని అప్పుడు నా కర్థమైంది. నిజంగా ఆ క్షణంలో నేపడ్డ విచారం, విషాదం అంతా యింతా కాదు. జినైదా అటూ యిటూ పచార్లు చేస్తూ మధ్య మధ్య నావంక తిరిగినప్పుడల్లా ఓ చిన్న మందహాసం పారేసేది గాని ఆమె ఆలోచనలు ఎక్కడో వున్నాయి. ఆ సంగతి స్పష్టంగా తెలుస్తూనే వుంది.

'నిన్నటి సంగతి నేనే కదిలించనా?' అని యోచించాను. నిన్న అంతహడావిడిగా ఎక్కడికి వెళ్తోందో అడిగితే....?

కాని ఆలోచన వదిలేసి బుద్ధిమంతనంగా ఓ మూలకు వెళ్ళి కూర్చున్నాను!

కొంతసేపటికి బెలొవ్జొరోవ్ వచ్చాడు. ఆ రోజు అతనిరాక నాకు నిజంగా ఆనందాన్ని కలిగించింది.

"మిమ్మల్ని సుఖంగా తీసుకెళ్ళగల స్వారీగుఱ్ఱం దొరకలేదు. ఫ్రైటాగ్ ఒకటుందని చెప్పాడు గాని దాన్ని నమ్మడంఎల్లాగా అని భయపడుతున్నాను". అన్నాడు జినైదాతో!

"ఏమని తమ భయం? దయచేసి కాస్త వివరంగా శలవియ్యగలరా?"

"అదేమిటి-మీకేమో స్వారి బాగా చేతకాదుగదా ఏమైనా ఐతే? అం హ..కీదెంచి మేలెంచాలిగదా....ఐనా వున్నట్టుండి స్వారి చెయ్యాలని ఎందుకు పుట్టింది మీకు?"

"అది మీ కనవసరం పశూనాంపతిగారూ! మీచేత కాకపోతే ప్యోటర్ వాసిలేవ్‌గార్ని అడగ్గలననుకోండి...."

(ప్యోటర్ వాసిలెవిచ్ మా నాన్నగారు. జినైదా ఆయన పేరు అంత దులాగ్గా భరోసాతో వాడటం చూసి నేను విభ్రాంతపడిపోయాను.)

"ఓ! ఐతే ఆయనతోనా తమరు స్వారీకి దయచేస్తున్నది!"

"ఆయనతో దయచేసినా మరెవరితో దయచేసినా మీ కనవసరం అది. మీతో మటుకు కాదు-సరేనా?"

"నాతోమటుకు కాదు. సరే కానీండి. మీ చిత్తప్రకారమే. గుఱ్ఱాన్ని తెస్తాను." అన్నాడు బెలొవ్‌జొరోవ్.

"కొంచెం సరిగా చూసి గుఱ్ఱాన్నే తీసుకురండి - ఆవుని తీసుకొచ్చేరు! గాలప్ తీయించాలి దానిచేత."

"అలాగే గాలప్ తీయండి ఎవరు-మాలెస్కీతోనా?"

"ఏం? మాలెస్కీతో మటుకు ఎందు తీయరాదు? ఆ(-ఆ(-కాస్త శాంతించండి. మరీ అంత తీక్ష్ణంగా చూడకండి నావంక. మీరు వద్దురు గానిలెండి నాతో. సరేనా? మాలెస్కీ అంటే నాకెంత ఇదో ఇప్పటికి తెలిసిందా-అహ్!" అంది జినైదా తల వెనక్కి విసిరేస్తూ.

"నన్నెందుకులేండి తృప్తిపరచడానికి ప్రయత్నిస్తారు" అని గొణిగాడు బెలొవ్‌జొరోవ్.

జినైదా అతనివంక కళ్ళు చికిలించి చూసింది.

"అలా అంటే మీకు తృప్తి కలుగుతుందన్నమాట! హోరి.... సైనికా!" ఇంకేం అంటానికీ తోచక ఆ సంబోధన వాడినట్టుంది.

"ఆ(-మరి మీరో, మాన్షియర్ వాల్డెమార్-మీరూ మాతో వస్తారా?"

నేను తలయెత్తి ఆమెవంక చూడలేకపోయాను. నాలో నేనే అనుకున్నట్టు మందస్వరంతో అన్నాను—

"నేను....నేను అంతమందిలో తిరగలేనండీ...."

"ఓ మాతో ఏకాంత సంభాషణ కావాలన్నమాట మీకు! సరే. అల్లాగే ఎవళ్ళయిష్టం వాళ్ళది!" అంటూ నిట్టూర్చి అతనివైపు తిరిగింది-

"సరే మీరు వెళ్ళండి. వెళ్ళి ఏది వీలైతే అది వ్రాయండి. రేపే కావాలి నాకు గుజ్జం."

"దీనికంతకీ డబ్బెక్కణ్ణుంచి వస్తుందో?" అని మధ్యలో కలగజేసుకుంది వృద్ధ రాజకుమారి. జినైదా కనుబొమలు ముడివడ్డాయి.

"నిన్నేం అడగనులేవమ్మా. బెలొవ్జొరోవ్‌కి నామీద ఆమాత్రం నమ్మకంలేకపోలేదు."

"నమ్మకం....! నమ్మకం....!" అని గొణుక్కుంటూ ముసలావిడ వున్నట్టుండి ఒక్క గావుకేక పెట్టి పనిమనిషిని 'దున్యాషా...!' అని పిలిచింది,

"ష్. ఎన్నిసార్లు చెప్పాలమ్మా నీకు ఎవళ్ళనైనా పిలవాలంటే ఆ బెల్ నొక్కమని?" అని విసుక్కుంది జినైదా. కాని ఆదేం వినిపించుకోకుండా మళ్ళీ మరో గావుకేక పెట్టింది ముసలావిడ.

బెలొవ్జొరోవ్ శలవుతీసుకున్నారు. అతనితోబాటు నేనూ బయలుదేరాను....జినైదా నన్నాపుచెయ్యడానికి ఏవిధంగానూ ప్రయత్నించలేదు.

14

మర్నాడు పొద్దున్నే లేచి చెట్టుకొమ్మ ఒకటి నరికి చేతికర్ర తయారుచేసుకుని వూరు ప్రహరీ దాటి వెళ్ళాను. ఎక్కడికన్నా పోయి దుఃఖమంతా వెళ్ళబోసుకువద్దామనుకున్నాను. ఎండకూడా అట్టేలేదు. పిల్లగాలి అన్నిటినీ సరదాగా కదిలించి చక్కలిగింతలు పెడ్తూ వెన్నుదిగా నేలబారుగా వీస్తోంది. వాతావరణం అంతా చాలా బాగుంది. అడవుల్లో కొండల్లో పడి ఎంతసేపు తిరిగానో లెక్కలేదు. కాని విషాదం మదిలో ఓలలాడుదామని వెళ్లానేమో ఒక్క నిసరుకూడా హాయి అని

పించలేదు. కాని కారుణ్యం, చక్కని వాతావరణం, స్వచ్ఛమైన గాలి, కాలి నడక, పచ్చగడ్డిలో నడుస్తున్న ఏకాంతం-అన్నీ కలిసి ఏదో ప్రభావం చూపించాయి మొత్తానికి. ఆ మరువరాని మాటలు, ముద్దులు మళ్ళీ నా మనస్సు నాక్రమించుకున్నాయి. వాటిలో అచంచలమైన నిశ్చ యము సాహసము వున్నాయన్న సంగతి జీనైదాకూడా కాదనలేదని సంతోషించాను....'నన్ను కాదని మిగతావాళ్ళని ఎన్నుకుంటుందీ-సరే కానీ....వాళ్ళవన్నీ ఎంత సేపూ ఊహలూ ఆశలేగాని నేను క్రియచేసి చూపిందానే ! ఆమెకోసం నే చెయ్యగలిగినదాంట్లో ఈ చేసిం దెన్నో వంతు.........?'

నా ఆలోచనలకి కళ్ళెం వదిలేశాను. ఆమెను శత్రువులబారి నుండి రక్షిస్తున్నట్టూ నా దేహమంతా ఆపాదమస్తకం రక్తసిక్తమైపోయి నట్టూ ఆమె పాదాల మ్రోల ప్రాణాలువిడుస్తున్నట్టూ.........ఏమేమో ఊహించుకున్నాను. వాళ్ళయింట్లో డ్రాయింగ్‌రూంలో వ్రేలాడుతూండే ఫోటో ఒకటి జ్ఞాపకానికి వచ్చింది-'మోలే ఏడెల్' 'మాటిల్డా'ని గుఱ్ఱం మీద ఎక్కించుకుని పరుగెత్తుకుపోయిన దృశ్యం అది. అంతలోనే నా దృష్టి ఒక బిర్చ్ వృక్ష కాండాన్ని ఛేదిస్తున్న వడ్రంగి పిట్టమీద పడింది. ఆర్కెస్ట్రాలో డబుల్‌బాస్ వాద్యగాడివలె ఆ పిట్ట అటూయిటూ చూస్తూ గబగబా చెట్టును బద్దలుకొడుతోంది.

అనుకోకుండానే 'ధవళ తుషారము కాదది....' అని పాడ సాగేను. అందులోంచి మరోపాటలోకి పోయాను. 'ఖోమ్యికో' విషా దాంత నాటకంలో యెర్మక్ స్వగతమంతా కనిపించని నక్షత్రాలకు నప్ప జెప్పాను. చివరకు 'జీనైదా ! ఓ జీనైదా !' అనే మకుటంతో స్వంతంగా ఓ విషాదగీతి కల్పించడానికి కూడా ప్రయత్నించానుగాని లాభంలేక పోయింది.

ప్రొద్దు బాగా యెక్కింది. భోజన సమయం దగ్గరైంది. నేను కొండదిగి లోయలోకి వచ్చి వూళ్ళోకి తిరుగుముఖం పట్టాను. నేనింకా ఆ మార్గాన నడుస్తూవుండగానే వెనక గుఱ్ఱపు డెక్కల చప్పుడు వినిపిం

చింది. నేను వెనక్కి తిరిగి చూసి నాకు తెలీకుండానే ఆగిపోయి నెత్తి మీది టోపీ తీసి చేతబట్టుకున్నాను. ఆ వస్తున్నది మా నాన్నగారు, జినైదా. ఇద్దరూ పక్కపక్కన స్వారిచేస్తూ వస్తున్నారు. ఆయన జీను మీదనుంచి పక్కకు వంగి చిరునవ్వు నవ్వుతూ జినైదాతో ఏమిటో చెప్తున్నారు. ఆమె ఏం మాట్లాడకుండా కళ్ళు నేలకు దించి పెదవులు బిగబట్టి వింటోంది. ముందు వాళ్ళిద్దరే కనిపించారు నాకు. కాని మరో క్షణంతర్వాత వెనకనుంచి మలుపు తిరిగి వస్తున్న బెలోజొరోవ్ తన గుఱ్ఱాన్ని దొక్కల్లో తన్ని ముందువాళ్ళని కలుసుకోవడానికి తహతహ పడుతూ కనిపించాడు. నేను దోవలోంచి తొలిగి నిలబడ్డాను. నాన్నగారు తన గుర్రం కళ్ళెపు వార్లు రెండూ చేతబట్టుకుని జినైదాకు ఎడంగా తొలిగిపోయారు. కన్నుమూసి తెరిచేలోగా ఇద్దరూ గాలప్‌చేసుకుంటూ నన్ను దాటి వెళ్ళిపోయారు. బెలోజొరోవ్ కూడా నడుముకు వ్రేలాడు తున్న కత్తి ఒరలో గరగరలాడుతూ వాళ్ళవెనకే పరుగిడిపోయాడు.... 'అరె-అదేమిటి-కందగడ్డలా అంత ఎర్రబడిపోయిందేమిటి ఆయన మొహం?....ఆమె మొహం మరీ అంత తెల్లనైపోయిందెందుకని? పొద్దున్నుంచీ స్వారిచేస్తూకూడా ఎందుకని అంత వివర్ణంగావుంది?'....

గబగబా అడుగులువేసి సరిగ్గా భోజనసమయానికి ఇంటికి చేరు కున్నాను. నే వెళ్లేవరికే మా నాన్నగారు స్నానంచేసి బట్టలుకూడా మార్చుకుని అమ్మ వాలుకుర్చీపక్కనే కూర్చుని పత్రిక చదివి ఆవిడకు వినిపిస్తున్నారు. నే వెళ్ళంగానే ఇంతసేపు ఏంజేస్తున్నానని అడిగి ఎక్కడెక్కడో తిరిగి ఎక్కడెక్కడివో వెధవ సావాసాలుచేసే మనుషు లంటే తనకున్న అసహ్యం వెళ్ళగక్కింది. నే నెక్కడికీ ఎవళ్ళతోనూ పోలేదు-ఒక్కణ్నే షికారుకు వెళ్లానని చెప్దామని నాలుక నివరదాకా వచ్చింది గాని మా నాన్నగారి మొహంకేసి ఓసారి చూడగానే నోరు కట్టుకుపోయింది నాకు.

15

తర్వాత ఐదారు రోజులవరకూ జినైదా నాకు సరిగా దర్శనమే యివ్వలేదు. వంట్లో బాగాలేదనేది. కాని మైదనోవ్ ఒక్కడు మినహా మిగతా సిబ్బంది అంతామటుకు 'డ్యూటీ'కి విధి తప్పకుండా హాజరౌతూనే వున్నారు. తనకు వచ్చిన కార్యక్రమం ఏదైనా వున్నప్పుడుతప్ప మిగతాఅప్పుడల్లా కుంగిపోతూండటం మైదనోవ్‌కు మామూలే. బెలొజొరోవ్ కంఠందాకా గుండీలు బిగించి ఓమూల కారట్లాడుతూండేవాడు. కౌంట్‌మాలెవ్స్కీ మొహంమీద ఎప్పుడూ తిరస్కార సూచకమైన చిరునవ్వు తాండవమాడుతూండేది. అతనొకడు జినైదాదగ్గర ఎందుకనో మొహంచెల్లక వృద్ధ రాజకుమారినే ఎక్కువ మచ్చిక చేసుకుంటున్నాడు. ఓసారి ఆవిణ్ణి గవర్నర్ జనరల్‌దగ్గిరికి స్వయంగా తీసికెళ్ళి వచ్చాడుకూడాను. కాని ఆ ప్రయాణం నిరర్థకమై అతనికే ఎదురు తిరిగింది. లూషిన్ రోజూ ఒకటి రెండుసార్లు వచ్చి పోతూనేవున్నాడుగాని ఆట్టే సేపు ఎప్పుడూ వుండంలేదు. మేమిద్దరం వెనక మాట్లాడుకున్నప్పట్నుంచీ అతనంటే నాకు కాస్త భయంగానే వుందిగాని నిజంగా అతను నన్నాకర్షించాడు. ఓసారి నాతోకలిసి నెస్కూష్ని గార్డెన్స్‌లోకి షికారుకి వచ్చాడు. అక్కడి చెట్లూ చేమలపేర్లూ వాటి విపరీత లక్షణాలు చెప్తూ చెప్తూ మధ్యలో హఠాత్తుగా నొసటిమీద కొట్టుకుంటూ అసందర్భంగా అన్నాడు- "వెఱ్ఱివెధవని-అది వొట్టి చపలచిత్త అనే అనుకున్నాను. నిజంగా చూస్తూ చూస్తూ ఆత్మనాశనానికి ఒడిగట్టేవాళ్ళుకూడా వున్నారని ఇప్పుడు తెలిసొచ్చింది।"

"ఏమిటది ? ఎవర్నిగురించి ?" అని అడిగాను.

"ఏం లేదులే! ఏంలేదులే! మీరు వినాల్సిన విషయమేంకాదులే." అన్నాడు బాషిన్, అంతలోనే మాట తప్పిస్తూ.........

జినైదా నన్ను తప్పించుకు తిరుగుతోంది. నన్ను చూడ్డమంటేనే ఆమెకు గిట్టడంలేదన్లేవుంది. నన్ను చూసీ చూడ్డంతోటే మొహం తిప్పే సుకోవడం నాకు మరీ బాధ కలిగించింది. అది అసలు సహించలేకుండా వున్నాను. కాని నే చెయ్యగలిగిందేముంది ? సాధ్యమైనంతవరకూ నేనూ ఆమె దృష్టిలో పడకుండానే వుంటూ వచ్చాను. దూరంనుంచే ఆమెనుచూస్తూ సంతోషించేవాణ్ణిగాని ఇది ఎల్లప్పుడూ సాధ్యమయ్యేది కాదు. ఇంకా ఆమె మనసులో నా కగమ్యమైన మధన ఏదో సాగుతూనే వుంది. మనిషి రూపే మారిపోయినట్లనిపించేది. ఆమెలోని ఆ మార్పేమిటో ఓరోజు నిశ్చల సాయంకాలంపూట అశనిపాతంలా నా కర్థమైంది. ఆవేళ జినైదా గదికిటికీకి ఎదురుగ్గా పూతోటలో ఓ చెట్టుకింద బెంచీ మీద కూర్చుని వున్నాను-ఎప్పటికైనా ఆ కిటికీ తెరుచుకోకపోతుందా అని. అటుకేసే చూస్తూ కూర్చున్నాను. కొంతసేపటికి నా సంకల్ప బలంవల్లనేమో అన్నట్లు ఆ కిటికీ నిజంగానే గభాల్న తెరుచుకుని జినైదా అగుపించింది. తెల్లని బట్టలు వేసుకునివుంది. మనిషికూడా-మొహమూ భుజాలూ చేతులూకూడా ఆ దుస్తులంత ధవళంగానూ వున్నాయి. చాలా సేపు ముడివడిన కనుబొమ్మల్లోంచి ఎదురుగ్గా చూస్తూ నిలబడింది. ఆమె అంత తీక్షణంగా దృష్టి నిగుడ్చి చూడటం అంతకు ముందెప్పుడూ చూడలేదు నేను. హఠాత్తుగా చేతులెత్తి ఒక కేలు మరోకేలంగిలించి తన పెదవుల కానించి ముద్దుపెట్టుకుంది-నొసటిమీద ఒత్తుకుంది - తల ఓసారి వెనక్కు విసిరి, అడ్డంగా వూపి, నిశ్చయ సూచకంగా ఒక్కసారి ఆడించి, ధడాలున కిటికీ తలుపులు మూసేసింది.

తర్వాత మూడురోజులకి తోటలో కనిపించింది. నేను వెనుదిరిగి వెళ్ళిపోబోయాను గాని ఆమే ఆపింది. ఈసారి మామూలుగానే చెప్పుడు మళ్ళీ వెనకటి అనురాగం, ఆ ఆప్యాయత తొంగిచూశాయి ఆమె కంఠ స్వరంలో—

"ఇలా రాండి. ఏదీ మీ చేయి ఇలా యివ్వండి. అబ్బ-మనిద్దరం సరదాగా కబుర్లు చెప్పుకుని ఎన్ని యుగాలైంది!"

నేనామె ముఖంలోకి చూశాను. ఆమె కళ్ళల్లో సాధుజ్యోతులు వెలుగుతున్నాయి-ఉల్లిపొర గుడ్డమాటున చిరునవ్వు వస్తున్నట్లుంది....

"ఇంకా వంట్లో బాగుండటం లేదనుకుంటాను" అన్నాను.

"అబ్బెబ్బే-అదంతా ఐపోయింది. ఇప్పుడేం లేదు. కొత్త నీర సంగా వుందంతే. అదీపోతుంది"

"మరి-ఇంతకుముందులాగే వుంటాదా ఇహమంచీ?"

జినైదా చేతిలోని గులాబీపువ్వు ఎత్తి వాసనచూపింది. ఆ పువ్వు రేకులు ఆమె పసిడిబుగ్గల్లో ప్రతిఫలించినట్లనిపించింది.

"ఏం? ఇప్పుడు మారిపోయానా?"

"మరి—?"

"అవును-మీపట్ల చాలా ఘోరంగా ప్రవర్తించాను. కాని....మీ రంతగా పట్టించుకోకుండా వుండాల్సింది....ఏంచెయ్యను చెప్పండి-సరే-ఇప్పుడేమనీ ఏంప్రయోజనం?"

"నేను మిమ్మల్ని ప్రేమించడం మీ కిష్టంలేదు నాకు తెలుసా సంగతి."

కడుపు మండిపోయి అనుకోకుండా అనేశాను సాహసించి.

"అహఁహఁ. మీరు నన్ను ప్రేమించాలనే నా అభిమతం. కాని మీరనుకున్నట్టుకాదు"

"మరెలాగ?"

గులాబీపువ్వు నన్ను వాసన చూడమని అందిస్తూ అంది—

"మంచి స్నేహితుడిలాగా! ఏ అరమరికలూ లేకుండా! నేను మీ కంటే ఎంతో పెద్దదాన్ని. మీ అత్తను కావచ్చు-లేకపోతే అక్కను కావచ్చు. మీరు...."

"అవును మీ దృష్టిలో నేనో కుఱ్ఱకుంకను!"

"కుంక కాదుగాని కుఱ్ఱవాళ్ళే. తెలివితేటలు, మంచితనం కలిగి ముద్దొచ్చే కుఱ్ఱవాడివి. నీవంటే నాకెంత ప్రేమో నీకు తెలీదు. పోనీ-ఇహ నెప్పుడూ నిన్ను దూరంగా వుంచను. సరేనా? నువ్వుకూడా నన్నెప్పుడూ వదిలిపెట్టి వుండకూడదు సుమా. ఆఁ-ఇదిగో ఇదే మనిద్దరి సావాసానికి చిహ్నం!" అంటూ ఆ గులాబీపువ్వు నా కోటుకు తగిలించింది.

"వెనక వేరే చిహ్నాలు చూపించారు!"

"అబ్బ-ఎంత జ్ఞాపకమయ్యా బాబూ నీకు! ఊఁ-సరే ఇలారా!... "

అంటూ నా మీదికి వంగి నా నొసటిమీద ప్రశాంతమైన నిష్కల్మషచుంబనం ఒకటి ముద్రించింది.

నానోటమాట పెగలక ఆమెవంకే చూస్తూండిపోయాను.

"ఊఁ-రావయ్యా నా నిత్యనెచ్చెలికాడా నాతో!"

అంటూ ఆమె వెనక్కు తిరిగి నడవసాగింది. నేను వెనక ఎరిగిన జీనైదా ఈమేనా? ఇంత సాధుత్వమూ, ఇంత వివేకమూ ఎక్కణ్ణుంచి వచ్చాయీమెకు? అని ఆశ్చర్యపోతూ ఆమెననుసరించానుకూడా. ఆమె నడకతీరే వేరుగా, అతిప్రశాంతంగా కనిపించింది నాకా పూట. ఆమె విగ్రహమే మరింత హుందాగా, మరింత లలితంగా, లావణ్యతరంగా........

నాలోని అగ్నిపర్వతం బద్దలైంది. నా మనసులోని ప్రేమ ఫెళఫెళార్భటులతో ప్రజ్వలించింది!

16

మధ్యాహ్నం భోజనాలయ్యాక అందరూ యథావిధిగా పోగయ్యారక్కడ. నేనెప్పటికీ మరువలేని ఆ మొట్టమొదటిరోజున వున్నట్టు అందరూ వున్నారు. ఆఖరికి నిర్మట్స్కీ కూడా కాళ్ళీడ్చుకుంటూ వచ్చాడు. ఇవ్వాళ మైదనోవ్ కొత్తగేయం ఒకటి రాసి అందరికంటే ముందొచ్చాడు. మళ్ళీ 'ఫర్ఫేట్స్' ఆడేం. కాని వెనకటి గోల, గల్లంతుమటుకు లేదు. రభస అసలేలేదు. మా వినోదాల్లోని జిప్సీతనమంతా ఇగుర్చుకు పోయింది. కాని జినైదామటుకు పార్టీలో కొత్త కొత్తదనం తెచ్చింది. నెచ్చెలికాని హోదాలో ఆమె పక్కనే కూచున్నాను నేను. ఆవేళ కొత్త కొత్త జరిమానాలు వేసింది. ఫలానా గుర్తుగల కాగితం ఎవళ్ళకి దొరికితే వాళ్ళు, వాళ్ళుకన్నకల దాపరికం లేకుండా చెప్పెయ్యాలి. కాని ఇది అనుకున్నంత హుషారుగా ఫలించలేదు చెప్పిన కలలన్నీ కొన్ని చాలా నీరసంగానూ, కొన్ని అసహజంగానూ, మరికొన్ని మరీ కల్పించి చెప్పవట్టు వున్నాయి. కొంతసేపు మైదనోవ్ నవల ఒకటి చదివి వినిపించాడు- దానినిండా శ్మశానాలూ సమాధులూ మాట్లాడే పూలూ చెట్లూ చేమలూ.... ఇక చాల్లే అంతటితో ఆపమంది జినైదా.

"సరే-కాస్సేపు కల్పించి కబుర్లు చెప్పుకుందాం. ప్రతివారూ అసలెన్నడూ ఎక్కడా జరగని సంఘటన ఒకటి వర్ణించాలి"

లాటరీ వేస్తే మొదటిచాన్సు బెలొవ్జొరోవ్‌కి వచ్చింది.

అతనికి నోటమాట రాలేదు. "ఏం చెప్పను....నాకేం తోచటం లేదే...." అన్నాడు నానుస్తూ. జినైదా కలగజేసుకుంది—

"ఛాఛా. చెప్పడానికేం లేకపోవడమేమిటి? పెళ్ళో గిళ్ళో అందను కుంటాను మీకు? మీభార్యని ఎలా చూస్తారో ఏమిటో చెప్పండి. ఆవిడ్ని గదిలో పెట్టి తాళం వేస్తారా?"

"ఆఁ ఆఁ వేస్తాను."

"ఆవిడ కొంగు పట్టుకుని వదిలిపెట్టకుండా ఎప్పుడూ తిరుగు తుంటారా మీరు ఆవిడతోనే?"

"ఆ. ఆ."

"సరే–ఆవిడకు మీమీద మోహం మొత్తి మిమ్మల్ని మోసం చేస్తుందనుకోండి—"

"సరికి పోగులు పెడ్తాను!"

"పారిపోతే?"

"వెంటబడి ఎక్కడున్నాసరే వెతికి పట్టుకుంటాను."

"సరే, చూడండి మహాశయా! నేనే మీ భార్యామణిగారిననుకోండి: అప్పుడేం చేస్తారు?"

బెలొజొరోవ్ ఒక్కక్షణం మౌనం వహించారు—

"నేనాత్మహత్య చేసుకుంటాను"

జినైదా నవ్వలేక మెలికలు తిరిగిపోయింది—

"ఆఁ-అప్పే–నీ కధ మరీ చిన్నదైపోయింది."

తర్వాతవంతు జినైదాకే వచ్చింది. తలయెత్తి యింటి పైకప్పుకేసి చూస్తూ ఆలోచించింది కాస్సేపు.

"ఆఁ-సావధానులుకండు, ఒక దివ్యమైన హర్మ్యం-వసంత కాలపు రాత్రి-అద్భుతమైన 'బాల్'*-ఇవన్నీ ఊహించుకోండి. మహా రాణి వయసులో చాలా చిన్నదేలేండి-అతిధుల్ని అందుకుని సాదరంగా లోనికి పంపిస్తోంది. ఎక్కడ చూసినా బంగారం స్ఫటికం సిల్కు-లైట్లు

*నాట్యం, ఇతర వినోదక్రీడలతో కూడినది.

రత్నాలు పూలు సుగంధద్రవ్యాలు-ఓహ్! ఒకటేమిటి!మానవహృదయం కోరగలిగిన భోగాలూ ఆడంబరాలూ అన్నీ అక్కడ పోగులుపడి వున్నాయి".

"ఆడంబరమంటే మీకూ యిష్టమేకదూ ?" అన్నాడు లూషిన్.

"ఆడంబరం....అదో అలంకారం. అలంకారమంటే మరి నాకిష్టమే !"

"అందంకంటేనా ?"

"బాబూ-మీరు నాకంటే ఎంతో తెలివిగలవారు-చదువుకున్నవారు. మీతో నేనెక్కడ వాదించగలను ? మీ మనసులోని వూహ ఏమిటో అసలు అర్థంకాలేదుకూడానూ నాకు. ఇహ మధ్యలో అడ్డకండి దయ చేసి. ఆఁ....నాట్యం, విందు దివ్యంగా జరిగిపోయింది. వచ్చిన అతిథు లంతా తరుణవయస్కులు - సుందరరూపులు - సాహసికులు - అందరూ కూడా రాణీగారిని మోహించి, తల మునకలౌతున్నవారే !"

"అతిధుల్లో స్త్రీ లెవరూ లేరా ?" అని అడిగాడు మాలెస్కీ.

"ఉఁహూఁ-ఆఁ ?....వుండడంవుండడండి....ఆఁ....వున్నారు."

"అందరూ సాదా ఆడవాళ్లను కుంటాను."

"బాగానేవున్నారు కాని మగవాళ్ళంతామటుకు రాణీగార్నే ప్రేమి స్తున్నారు. సన్నగా పొడుగ్గా శలాకలా వుంటుంది....తుమ్మెద బారు ల్లాటి నల్లటి శిరోజాలమీద ధగద్ధగాయమానంగా మెరిసిపోతున్న చిన్న బంగారపు కిరీటం........"

నేను జినైదావంక చూశాను. ఆక్షణంలో ఆమె మా అందరి కంటెకూడా నిజంగా పొడుగ్గా కనిపించింది. ఆమె ఫాలభాగాన, ఆమె నేత్రద్వయంలోనూ ప్రజ్వలించిపోతున్న వెలుగు చూసి అనుకున్నాను.

'అహో ! నీవే ఆ రాణివి !'

జినైదా చెప్పుకుపోతోంది—

"అందరూ రాణీగార్ని చుట్టుముట్టి ఎగబడి ఒకళ్ళనుమించి మరొకరు పొగడటం, ఇచ్చకాలాడటం మొదలెట్టారు—"

"ఓహో! ఆవిడగారిక్కూడా పొగడ్తలూ ఇచ్చకాలంటే ఇష్టమా!" అన్నారు లూషిన్.

"అబ్బ! ఏమిటండీ మీ గొడవ అడుగడుక్కీ?....అవును, పొగడ్తలంటే ఎవరికిష్టం వుండదు?"

"చివరి ప్రశ్న. ఇదొక్కటి చెప్పండి చాలు. ఆ రాణీగారికి భర్త వున్నాడా?" అని ప్రశ్నించాడు మాలెస్కీ.

"అరె-ఆసంగతి నే నాలోచించనేలేదే....ఊఁహూఁ. ఆమెకు భర్త లేడు. ఆవిడకు భర్తెందుకు?"

"అవునవును. భర్తెందుకూ." అన్నారు మళ్ళీ మాలెస్కీ.

"సైలెన్స్!" అని ఒక్క గావుకేక పెట్టాడు ఇందాకట్నుంచీ చిరచిరలాడిపోతున్న మైదనోవ్.

జినైదా మళ్ళీ తన కథనం ప్రారంభించింది—

"ఆఁ. అలా రాణీగారు వాళ్ళ పొగడ్తలూ పక్కనే వాయిస్తున్న సంగీతమూ వింటూ కూర్చుంది. కాని ఆవిడదృష్టి వాళ్ళల్లో ఎవరిమీదా లేదు. గోడమెత్తునా ఆరు విలువు కిటికీలు తలుపులు తీసి వున్నాయి. ఆ కిటికీ లకిఅవతల చలచ్చలత్తారకలతో వెలిగిపోతున్న ఆకాశమూ-దానికి నేపధ్యంగా అస్పష్టవృక్షాకారాలు, క్రీనీడల్లా కనిపిస్తున్న తమః పూర్ణమైన ఉద్యానవనమూ ఉన్నాయి, రాణీ ఉద్యానవనంవంక చూసింది. చీకట్లో చెట్లమధ్య ఫౌంటెన్ ఆకారం ఉన్నతంగా - అత్యున్నతంగా - తెల్లగా-దెయ్యంలా అగుపిస్తోంది. చుట్టూచేరిన శత్రుజాలు వాద్యగాళ్ళు చేస్తున్న రణగొణ ధ్వనిమధ్యకూడా ఆ ఫౌంటెన్‌లోంచి ఎగసి కింద వెలమలో పడుతున్న నీటి ధారలచప్పుడు రాణికి వినిపిస్తూనేవుంది. అలా కిటికీ లోంచి చూస్తూ తనలో తాననుకుంది—

'అవును మహాశయులారా అవును! మీరంతాకూడా అభిజాత్యం సిరిసంపదలు విజ్ఞానంగల పెద్దమనుషులు! మీరంతా నాచుట్టూ మూగుతారు-నా నోట్లోంచి జారిపడే ప్రతిమాటా మంచి ముత్యంలా చూసుకుంటారు-మీరంతా నా గుప్పెట్లోవున్నారు. మీలో ప్రతి ఒక్కరూకూడా నా పాదాల క్రింద ప్రాణాలు సమర్పించడానికైనా సిద్ధంగావున్నారు ....కాని-అక్కడ....ఆ ఫౌంటెన్‌దగ్గర........చెదిరి చిరుగంతులువేసే ఆ చెలమపక్కన నేను ప్రేమించేవ్యక్తి-నన్ను కైవసంచేసుకోగలిగిన వ్యక్తి నాకోసం నిరీక్షిస్తూవున్నాడు. అతనికి విలువైన దుస్తులు లేవు-అలంకారాలూ ఆడంబరాలూ అసలే లేవు-పేరూ ప్రఖ్యాతి అంతకంటే లేదు-ఐనా నేనతనికోసం వెళ్తానని అతనికి తెలుసు, తెలిసే నాకోసం ఎదురుచూస్తుంటాడు. నన్నాపగలిగేశక్తి కూడా మరేదీ ఇక్కడ లేదు. నేనూ వెళ్ళితీరాలి. వెళ్తాను. అతనితో వుండిపోవటానికి....ఆ వుద్యానవనపు చీకట్లలో-ఆ చెట్లు ఆకుల మర్మరధ్వని మధ్య-ఆ గలగల్లాడే నీటి చెలమపక్కన అతనితో కలిసి నన్ను నేను మర్చిపోవడానికి........ విశృంఖలంగా విహరించడానికి........'

జినైదా ఆగిపోయింది.

"ఇదంతా....పూర్తిగా కల్పితమేనా?"

అన్నాడు మాలెస్కీ సాభిప్రాయంగా. జినైదా అతనివంకైనా చూడలేదు.

అంతలోనే లూషిన్ అన్నాడు—

"మనమైతే ఏంచేసేవాళ్ళమో? మనమేకనక ఆ అతిథుల్లో ఒకళ్ళమై ఆ ఫౌంటెన్‌పక్కనే ఓ అదృష్టవంతు డున్నాడని తెలిసి వుంటే........?"

"ఆగండాగండి-" అంటూ వారించింది జినైదా—

"మీలో ఒక్కొక్కరే యేవిధంగా ప్రవర్తించేవాళ్లో అదికూడా నేనే చెప్తాను. బెలొవ్జొరోవ్ అయితే అతన్ని కేకేసి పిలిచేవారు. మైదనోవ్ అయితే అతనిమీదనో పద్యం రాసిపారేసేవారు....అహఁహఁ-

మీరు పద్యాలు రాయలేరుగా....ఏదో గేయంరాసి 'టెలిగ్రాఫ్'లో ప్రచురించేవారు. మీరైతే, విర్మిట్స్కీగారూ, మీ రతని దగ్గర—అఁహఁ—అతనికే మీరు వడ్డీకో చక్రవడ్డీకో డబ్బు అప్పిస్తారు. మరి మీరు—మీరేంచేస్తారో చెప్పడం కష్టమే డాక్టరుగారూ!"

"నేనైతే రాజవైద్యుని హోదాలో రాణీగారికి—'అమ్మా, అందరితోకలిసి ఆనందించే ఉద్దేశం లేనప్పుడు ఇలా విందులూ వినోదాలూ ఏర్పాటు చెయ్యరాదు' అని సలహా ఇస్తాను."

"అవును....మీరు చెప్పిందీ బాగానేవుంది. మరి మీరో కౌంట్?"

"నేనా?" అన్నాడు ఆగ్రహం అణుచుకున్న దండతాడిత భుజంగంలా వికృతహాసంచేస్తూ మాలెస్కీ.

"మీరైతే ఏ విషగుళికో ఇచ్చి మింగించి వుందురతనిచేత!"

అంది జినైదా అతను సమాధానం చెప్పకముందే.

మొహంమీద ఛళ్ళుమని కొట్టినట్టు ఒక్కసారి మాలెస్కీ కళ్ళు చికిలించి వూరుకున్నాయి. మరుక్షణంలో పగలబడి ఆపులేక ఆపుకోలేక నవ్వాడు. జినైదా నావంక తిరిగింది—

"ఇహ మీసంగతి చెప్పాల్సొస్తే మాన్షియర్ వాల్టెమార్....అఁ—ఇహవాల్లేద్దురూ. ఇంకెంతసేపీగొడవ. ఇంకేదైనా ఆడుకుందాం పట్టండి."

"మాన్షియర్ వాల్డెమారైతే చీకట్లో బయలుదేరి రాణీగారి కాళ్ళల్లో ముళ్ళెక్కడ గుచ్చుకుంటాయోనని నిజమైన నెచ్చెలికానిలాగా ఆపిడగారి పాదరక్షలు పుచ్చుకు వెంటబడేవాడు!" అన్నాడు మాలెస్కీ విషంగక్కుతూ.

నా మొహం ఎఱ్ఱబడిపోయింది. ఉక్రోషం కంఠందాకా తన్నుకొచ్చింది. కాని జినైదా చల్లనిచేయి నా భుజంమీదవేసి నేను లేవకుండా నొక్కి తాను లేస్తూ అంది—

"అంత పొగరుమోతుతనంగా మీరుండాల్సిన అవసరంఇప్పుడేం లేదు కౌంట్! అసలు నోటికి వచ్చిందల్లా మాట్లాడ్డానికూడా మీ

కెప్పుడూ నే వనుమతి యివ్వలేదు! ఇక్కడ మీకిక స్థానంలేదు. దయ చేసి వెంటనే నిష్క్రమిస్తారా ఇక్కడ్నుంచి?"

అంటూ వాకిలికేసి తర్జనితో నిర్దేశించింది.

మాలెస్కీ ముఖం వెంటనే పాలిపోయి నల్లబడిపోయింది—

"అదేమిటి యువరాజకుమారీ........" మరి మాట పెగల్లేదు.

తెలొజొరోవ్ కూడా లేస్తూ అన్నాడు—

"అవును. రాజకుమారి చెప్పేవదానికి ఆక్షేపణ ఏమీలేదు."

"నేను ప్రమాణంచేసి చెప్తాను. నేను....నేనన్నమాటల్లో మీకంత బాధకలిగించేది....మిమ్మల్ని గాయపరుద్దామని నా కెన్నడూలేదు. క్షమించాలి—"

చూపుకు మాడిపోయేట్లు జినైదా అతనివంకనోసారి చూసి శుష్కహాసంచేసి నిర్లక్ష్యంగా అంది—

"సరే నీయిష్టమైతే వుండు! నేనూ, మాన్షియర్ వాల్డెమార్ కూడా అనవసరంగా ఉద్రేకపడ్డాము. నీనోటికసలు హద్దూపద్దూ వుండదుగా....కానీ!"

"క్షమించండి" మని మళ్ళీ వణుక్కున్నాడు మాలెస్కీ.

అతన్ని బైటికి పొమ్మన్నప్పటి జినైదా మూర్తి నా గుండెల్లో నాటుకుపోయింది. నిజంగా అప్పుడామెలో ద్యోతకమైన ఠీవి, దర్పం, రాజసం మరే మహా మహా రాణీలకూడా స్ఫురించడం అసంభవం.

ఈ సంఘటన తర్వాత ఆటలేవీ సరిగా సాగలేదు. పూర్తిగా ఆ సంఘటనవల్ల కాదుగాని మొత్తానికి ప్రతి వ్యక్తికూడా ఇరకాటంగా వున్నట్టున్నారు. ప్రతివాళ్ళకూడా చెప్పరాని భావోద్రేకం ఏదో కుంగదీస్తోంది. ఐనా ఎవరూ దాని పూసెత్తలేదన్నమాటే గాని ప్రతి ఒక్కడికీ తానూ తన పక్కవాడూ కూడా అదే పరిస్థితిలో వున్నట్టు తెలుసు. మైదనోవ్ తన గేయం ఒకటి చదివి వినిపించాడు. అది విని మాలెస్కీ మైదనోవ్ని తెగ అభినందించసాగాడు.

"పాపం! మళ్ళీ మంచిగా కనిపించటానికి ఎంత యాతనపడు తున్నాడ్రా బాబూ!" అన్నారు లూషిన్ నా చెవులో.

ఆతర్వాత అందరం త్వరగానే వెళ్ళిపోయాం. జినైదా వున్నట్టుండి ఏదో తీవ్రంగా ఆలోచిస్తూ కూర్చుండిపోయింది. దానికితోడు వాళ్ళమ్మ తల నొప్పిగా వుందని కబురుకూడా చేసింది. నిర్మట్స్కీ కళ్ళనొప్పులని వెళ్ళిపోయాడు.

నా కింటిదగ్గర ఆ రాత్రి చాలా సేపటివరకూ నిద్ర పట్టలేదు. జినైదా చెప్పిన కథ నా మనసులో ముద్రించుకుపోయింది. నన్ను నేనే ప్రశ్నించుకున్నాను—

'అందులో ఏమైనా సూచనవుందా?....వుంటే....ఏమిటి సూచి స్తోంది?....ఎవర్ని?....నిజంగా అందులో నిజంవుంటే-అంత ధైర్యంగా అంత సాహసించి నలుగురికీ....ఊఁ హూఁ. అది అసంభవం. అసం భవం!....'

ఒక్క-క్షణం విరామం లేకుండా పేలాలగింజలాగా పక్క-మీద పడి దొర్లుతున్నాను. చెంపలు పేలిపోతున్నాయి. దిండుతో మొహం కప్పేసుకుని అదుముకుంటున్నాను....ఆ కథ చెప్తున్నప్పుడు జినైదా మొహంలో ద్యోతకమైన భావాలన్నీ నా కళ్ళకు కట్టినట్టున్నాయి.... నెస్కుష్నిగార్డెన్స్‌లో లూషిన్ నోరుజారి అన్నమాట-ఆమెలో కలిగిన మార్పులు....ఆలోచించి ఆలోచించి నాతల తిరిగిపోతోంది. నా మనసు పరిభ్రమిస్తోంది. ఎంతోచదు-ఏదారీ తెన్నూ కనిపించదు-చివరికి ఏమను కోవాలో ఏమిటో అసలే అగమ్యం! 'ఎవడు వాడు?' అంధకారపు అల మీద అగ్నిహోత్రపు కణికలతో కూర్చిన అక్షరాల్లా ఈ ప్రశ్నమటుకు నా కళ్ళముందు సర్వదా భగ భగ మండిపోతూంది. ఏదో అమా హ్యమైనభారం మూటగట్టుకుంటోంది. నా తల మీద ఆ మూట ఏ క్షణానైనా బద్దలు కావచ్చు....బద్దలై ఏం పైబడుతుందో....ఈ మధ్య అసాధారణ విషయాలకు చాలావాటికి అలవాటుపడ్డాను - జాసీకిన్ల యింట్లో జరిగే విచిత్రాలూ - అక్కడి గోల గల్లంతు - కొవ్వువత్తి

దీపాలు - వానిఫేటిగాడి ఏడుపుగొట్టు మొహం - తప్పించి పోయిన దాసీలు, వాళ్ళ మాసిపోయిన బట్టలు—వృద్ధురాలి విచిత్ర శ్రవ త్రవ-ఇవ్వేవీకూడా నాకివ్వుడేం ఆశ్చర్యం కలిగించడంలేదు-అవన్నీ నా కెప్పుడో అలవాటైపోయాయి....కాని....జీనైదామీద నాలో కలుగు తున్న కొత్త ఊహ భరించలేకుండా వున్నాను....ఓసారి మా అమ్మ ఆ అమ్మాయి నంది-'అదృష్టాన్ని వెతుక్కునే ముండ' అని....జీనైదా-నా కుందనపుబొమ్మ-నా పాలిటి దేవతామూర్తి-అదృష్టాన్ని వెతుక్కునే మనిషా? ఆమాట బల్లెమై నా పక్కలో పొడిచింది-తీవ్ర వాతాహతి కటు యిటు విజృంభించి విలయనాట్యంచేసే దవానలజ్వాలా కీలలవలె నా ముఖాన్ని దగ్ధంచేయబూనింది....బాధ భరించలేక పక్కమీద మళ్ళీ దొర్లాను. మంట సహించలేక మొహం దిండులో పూడ్చుకుని దాచుకున్నాను....అబ్బ....నేనే ఆఫాంబెన్ పక్కనవున్న భాగ్యశాలినైతే.... నేనే ఆ అదృష్టవంతుడనైతే..........

నా నరాల్లో రక్తం పిచ్చెక్కినట్టు ఉరకలు వేసింది.

'ఉద్యానవనం....ఫాంబెన్....నే వక్కడికి వెళ్తే—?'

ఒక్క క్షణంలో బట్టలు వేసుకుని బైటపడ్డాను. ఆ రాత్రి అంధకారమయంగా వుంది. చెట్ల గుసగుసలుకూడా సరిగా వినిపించడంలేదు. విశృంఖలమైన చల్లదనం వాతావరణమంతా కమ్ముకునివుంది. పార్కులోని దారులన్నీ తిరిగాను. నా పదధ్వనే నన్ను భయపెట్టింది - ఒక్కొక్కసారి మధ్యలో ఆగి అతితీవ్రంగా కొట్టుకుంటున్న గుండెల్ని వినేవాణ్ణి. చిట్టచివరకు ఫెన్సింగ్ దగ్గరకు వెళ్ళి దానిమీద ఆనుకునుంచున్నాను. హఠాత్తుగా-లేకపోతే అది వట్టి భ్రమేనా?-ఒక స్త్రీ ఆకారం నాపక్కనుంచి నడిచిపోయింది....ఊపిరి బిగబట్టి ఆ చీకట్లో నా కనుగుడ్లు వెళ్ళుకొచ్చేట్టు తీవ్రంగా కేంద్రీకరించి చూశాను....ఏమిటది?....అదేమైనా అడుగుల చప్పుడా....లేక నా గుండెల ధ్వనేనా?....' 'ఎవరక్కడ?' అన్నాను అస్పష్టమైన స్వరంతో. అదుగో....అది ....ఆవుతున్న నవ్వా?....లేక....గాలికి మెదిలిన ఆకుల గలగలా?....

కేకవేసే...నా చెవిదక్కనే ఎవరైనా పిల్చారా?...ఏదో విస్మయం-భీతి-ఆవరించాయి నన్ను. 'ఎవరక్కడ?' అని మళ్ళీ నోరు పెగలని కంఠస్వరంతో ప్రశ్నించాను.

ఒక్క పిసరుగాలి ఓక్షణకాలం కాస్త వీచింది. ఆకాశంలో ఏదో మెరిసింది-రాలిపోతున్న నక్షత్రం....'జినైదాయేనా అక్కడ?' అని అడుగుదామనుకున్నానుగాని ఆ ప్రశ్న నా పెదవులు దాటలేదు. అంతలోనే హఠాత్తుగా సంపూర్ణ నిశ్శబ్ద-నిర్జీవ నిశ్చలత - ఆవహించాయి. ఆకు కదల్లేదు-ఆరుద్ర మిణుకు మనలేదు...ఎక్కడో ఏదో గవాక్షం గళాల్ని మూసుకున్న చప్పుడు—అంతే! మరో నాలుగు క్షణాలు అలాగే నుంచుని నా గదికి తిరిగి వెళ్ళిపోయాను. ఏదో విచిత్రమైన అనుభూతి-నేనేదో సంకేతస్థలానికి వెళ్ళినట్టూ, అభిసారిక రాకపోయినా వేరెవరిదో సుఖచేలాంచలం నన్ను రాసుకుంటూపోయినట్టూ——

17

మర్నాడు జినైదా వాళ్ళమ్మతో కలిసి బండిలో ఎక్కడికోపోతూ మెరుపులా తళుక్కున ఒక్కసారిమాత్రం కనిపించింది. తర్వాత లూషిన్ కనిపించి ఊరికే పలకరించి వెళ్ళిపోయాడు. తర్వాత కౌంట్ మాలెవ్స్కీ కలిసి ఓసారి ఇకిలించి 'ఏమండీ' అన్నాడు. జెసీకిన్లయింటికి వచ్చేవాళ్లల్లో ఇతనొక్కడే మాయింట్లోకి కూడా ప్రవేశం సంపాదించి మా అమ్మతో పరిచయం చేసుకున్నారు. మా నాన్నగారికిమటుకు ఇతనంటే సరిపడలేదు ఎందుకనోగాని. వీలైనప్పుడల్లా కాస్త సభ్యతతో అవమానిస్తూనేవుండేవారు.

"ఓ నెచ్చెలికాడుగారా! అనుకోకుండా కనిపించారు- చాలా సంతోషంగావుంది దివ్యాక! ఆ-ఏంచేస్తున్నారు మీ భువనైక సుందరి మహారాణిగారు?"

అతని అందమైన ముఖం నాకా క్షణంలో కనిపించినంత అసహ్యంగా వికృతంగా మరెవ్వరూ కనిపించలేదు. అతనియీపుష్కో తూష్కారం, తిరస్కారం చూసి అవమానాగ్నితో మరీ దహించుకు పోయాను. జవాబు చెప్పడానికూడా నాకు మనస్కరించలేదు.

"ఏమిటి-ఇంకా కోపంగానే వున్నారేమిటి నామీద ?....అబ్బెబ్బే-నేను పెట్టానా మీకా పేరు ?....కాని ఒక విషయంమటుకు చెప్పాలని వుంది. తీరా ఆ వుద్యోగానికి ఒప్పుకుని....మీ విధుల్ని మీరు నిర్వర్తించకపోతే యెలా ?"

"నా విధులా?"

"అవును. వెర్రెలికాడంటే అమ్మగార్ని ఒక్క క్షణమైనా వదిలి పెట్టి వుండరాదు. ఆవిడ ఏక్షణాన ఏంపని చేస్తున్నదీ అంతా అతడికి తెలియాలి. ఆమె ఎక్కడికి వెళ్ళినా ఏంచేసినా కనిపెడుతూ వుండాలి-పగలూ రాత్రికూడా !"

"అంటే మీ వుద్దేశం ?"

"నా వుద్దేశం తేటతెల్లంగానే వుందనుకుంటానే ! పగలుకు పగలూ రాత్రికి రాత్రీ ఆమెగార్ని ఓ కంట కనిపెట్టి వుండాలని ! పగలు పూట ఏమంత ఫరవాలేదనుకోండి-బోలెడంత వెలుగుంటుంది-చుట్టూతా ఎందరో వుంటారు....రాత్రిపూట అలాకాదు. అప్పుడే మీరు కళ్ళల్లో వత్తులేసుక్కూర్చోవాల్సింది ! రాత్రిపూట తమరసలు నిద్రపోరాదు. నిద్ర మానేసి మీ శాయశక్తులా అమ్మగార్ని కనిపెట్టి వుండాలని నా మనవి. రాత్రి-పార్కు-షాంపెన్-అద్దది ! అక్కడా మీ దృష్టి కేంద్రీకరించాల్సింది ! నేనీసంగతి చెప్పినందుకు మీరే స్వయంగా నాకు ధన్యవాదా లర్పిస్తారు కూడాను రేపో మాపో !"

మాలెక్కే వికృతహాసంచేస్తూ 'మరి వెళ్లొస్తా'నంటూ వెనుతిరిగి పోయాడు.

తన మాటలకు నేనుకూడా విలువయిచ్చి వుండను. బహుశా. మనుష్యుల్ని వల్లీలా కొట్టించడమంటే అతనికి మంచి సరదా అని ప్రతీతి కూడా ఉంది....నన్నుకూడా పూరికే ఏడిపించడాని కన్నాడేమో....కాని అతనన్న ప్రతిమాటా ఒక్కొక్క విషబిందువులాగా నా నరాల్లోకి జొచ్చుకుపోయింది. నా సర్వాంగాల్లోని రక్తమూ మొహానికి ఒక్కసారిగా ఎగదన్నింది-

"ఓ అదా సంగతి! అదన్నమాట వ్యవహారం!....ఐతే విన్న వృత్తినే అనిపించలేదన్నమాట నాకు పార్కుకి పోవాలని! కాని - ఇది నేను సహించను-నే సహించను!"

నేను సహించలేని దేమిటో ఇంకా నాకు సరిగా అర్థం కాక పోయినా చాతీమీద చరుచుకుంటూ బిగ్గరగా ఒక్క కేకపెట్టాను. ..... 'ఓవేళ పార్కులో మాలస్కియే కనుపించినా- (గొప్పకు పోయి బడాయికోసం తన రహస్యంకూడా అలా పైకి చెప్పుకునే మనిషేలెండి అతను)-లేక ఇంకెవడు కారసవద్దా- (మా తోటమట్టూ వున్న ఫెన్సింగ్ అట్టే ఎత్తులేదు-చాలా తేలిగ్గా దూకవచ్చు).వాడెవడైనా కానీండి-కాస్త వొళ్ళు దగ్గర పెట్టుకువుంటం మంచిది! ఈసారి వాడు కలుసుకునేది నన్ను! సర్వ ప్రపంచానికీ ఆ మొనగత్తెక- (అవును-దాన్ని మొన గత్తే అంటాను-కాకపోతే ఇంకేమనాలి. ఆ బాపతు మనిషిని) అందరికీ చాటు తాను నేనూ కసి దీర్చుకోగల సాహసికుడనే నని!

గబగబా నా గదికివెళ్ళి డ్రాయరుదాగి ఆ మధ్యనే కొన్న బాకు బైటకి తీశాను. రెండువైపులా వాడి పరీక్షించి చూశాను. ఇలాంటి క్రూర కార్యాలు నాకు మంచినీళ్ళ ప్రాయమన్నట్టు కనుబొమలు కుంచించి అచంచలమైన నిర్ణయంతో జేబులో వేసుకున్నాను. నా హృదయం ఆగ్రహావేశంతో ఒక్కక్షణం దడదడ లాడిపోయి హఠాత్తు పాషాణంలా గడ్డ గట్టుకుపోయింది ఆరోజంతాకూడా పెదవులు బిగించి ముడివేసిన కనుబొమలు సడలనీయకుండా గదంతా పచార్లు చేశాను. మధ్యమధ్య నా జేబులో, వేడెక్కిపోయిన బాకు గుప్పిట పట్టుకుని ఏదో ఘోర కార్యాచరణకు సంసిద్ధుడను కాబోద్బాను. ఇంతకు ముందెన్నడూ అనుభవించి

ఎరుగని కొత్త ఉద్రేకం చాలా తమాషాగా వుంది. ఆ ఉద్రేకపు ఉత్తేజంలో కాస్సేపు ఉనికైనానే మర్చిపోయాను కూడాను. 'అరె..అదేమిటి వొళ్ళంతా రక్తసిక్తం అయిపోయింది? ఏంచేసి వచ్చావ్?' అని ఎవరైనా అడిగితే? 'ఏంలేదు' ఊఁ హూఁ. 'ఏమీలేదు!' ఆఁ..అదీ 'ఏమీ లేదు!' అనేస్తాను వికృతంగా పెదవి విరుస్తూ....

నాన్నగారు ఇంట్లోలేరు, ఈమధ్య చీటికి మాటికి చిరాకు పడుతున్న అమ్మమటుకు నాలోని రౌద్రం గుర్తించినట్టుంది. తోటవాందగ్గర అడిగింది—

"అదేమిట్రా..ఎలుకకోసం కాపేసిన పిల్లిలా చూస్తున్నావ్? ఏమిటి సంగతి?" 'పిచ్చికేకలు తెలిస్తేనా? అని మనసులో మాత్రం అనుకుంటూ సమాధానంగా ఒక్క చిరునవ్వుమాత్రం నవ్వాను. పదకొండు గంటలయింది. నేను నా గదిలోకి వెళ్ళాను గాని బట్టలు మార్చుకోలేదు. అర్ధరాత్రి పన్నెండుగంటలకోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు. చివరికెల్లాగో పన్నెండు కొట్టింది 'ఆఁ..ఇప్పుడు!' అని పళ్ళు బిగపట్టి అనుకుంటూ తోటవైపు బయల్దేరాను. బయలుదేరేముందు జాకెట్ గుండీలన్నీ పెట్టుకుని ఎందుకో నాకు తెలీకుండానే చేతులు పైకి మడిచాను.

తోటలో ఎక్కడనుంచుని కాపుగాయాలో ముందే స్థలం ఎన్నుకుని వుంచాను. తోటకి ఆ చివర మారెండిళ్ళకి మధ్యనున్న ఫెన్సింగ్, ప్రహరీ గోడని కలిపేచోట ఒకటే ఒక్క దేవదారు వృక్షంవుంది. నేలబారుగ పెరిగిన దాని దట్టమైన కొమ్మలకింద నుంచుంటే ఆ చీకట్లో సాధ్యమైనంత దూరందాకా నాకు బాహాటంగా కనిపిస్తుంది. అక్కడి కాలిదారి ఒకటి నాకెప్పుడూ చాలా విచిత్రంగా కనిపిస్తుంది. ఆ ఫెన్సింగ్ దాకా వేరుగావచ్చినదారి ఫెన్సింగ్కిందనుంచి దూరి పాములా మెలికలు తిరిగి అవతలికిపోయి అటుపక్కనున్న అకేసియా పొదలోకి అదృశ్యమైపోతుంది.

నేను దేవదారు వృక్షం కిందికెళ్ళి ఆచెట్టు మొదలుకానుకుని కావలా మొదలెట్టాను.

గతరాత్రి లాగానే ఆవేళకూడా చాలా నిశ్చలంగా వుంది. ఆకాశం మాత్రం అంత మేఘావృతంగా లేదు. పొదలూ పొరుగాటి చెట్లూ-వీటి ఆకారాలు కొత్త స్పష్టంగానే కనిపిస్తున్నాయి. నా నిరీక్షణ ప్రథమ క్షణాలు చాలా విసుగు పుట్టించాయి. కొత్త భయోత్పాదంగా కూడా లేక పోలేదు. ఏంచెయ్యడానికైనా సంసిద్ధంగా వున్నాను! కాని ఏంచెయ్యాలో ఎలా చెయ్యాలో ఏమిటో ఇంకేం ప్లాను వేసుకోలేదు. 'ఏయ్! ఆగు! నిజం చెప్పుకుంటావా లేక ప్రాణాలమీద ఆశ వదులుకుంటావా!' అని అరవనా! లేకపోతే కయ్‌కుయ్ మనకుండా ఆ అంధకారంలో గప్‌చిప్‌గా బాకుతో ఒక్కపోటు పొడిచి పారేసేదా!....

ఎంతచిన్న శబ్దమైనా-ఏఆకు కదిలినా-ఏపక్షి రెక్క అల్లాడినా-ఎగిరిదూకడానికి సిద్ధంగా వున్నాను....అరగంట గడిచింది....గంట గడిచింది....అంతకంతకూ నా మనసు ప్రశాంతించి కల్లోలం తగ్గు ముఖం పట్టింది. నా నిరీక్షణ నిరర్థకమనీ మాలెప్క నన్ను బొమ్మనిచేసి ఆడించాడనీ ఆ క్షణాని కాక్షణం రూఢి కాజొచ్చింది. చెట్టుకిందనుంచి ఇవతలకొచ్చి తోటంతా ఓసారి చుట్టివచ్చాను. నామీద పంతంకట్టినట్టు ఆఖరికి ఏమైనా చిటుకు మనటంలేదు. అంతా నిశ్చలంగా నిశ్శబ్దంగా వుంది. కూలిపోతున్న గోడయొక్క ఎదురుగ్గా వున్న విశాల మైదానం లోకి చూస్తూ జినైదాను గురించీ ఆమె నక్కడ కలుసుకోవడం అదీ నెమరుకు తెచ్చుకుంటూ అలానే కూర్చుండిపోయాను.

హఠాత్తుగా ఉలిక్కిపడ్డాను....ఎక్కడో ఏదో గుమ్మం తెరుచు కుంటున్న శబ్దం....స్పష్టంగా వినిపించింది! రెండంగల్లో నేలమీదకు దూకి అక్కడే కొయ్యబారిపోయాను. అతితేలిగ్గా గబగబా వేస్తున్న దొంగ అడుగులు తోటలోంచే వినిపించాయి. 'హమ్మ! దొరికాడ్రా చిట్టచివరికి!' అని మెరుపులా మెరిసింది నా మనసులో. గబాల్న నా జేబులోంచి బాకు బైటకి లాగాను....నా కళ్ళముందు విస్ఫులింగాలు గిర్రున తిరిగిపోయాయి. ఆగ్రహం భయం ఆవేశం అన్నీ ఆవహించి రోమాంచమైంది....ఆ అడుగులు నావైపుకే-సరాసరి నేనున్నచోటికే వస్తున్నాయి. ఎప్పుడు చేతివాటుదూరంలోకి వస్తాయా అని ఎదురు

చూస్తూ ఎగిరి లంఘించడానికి వీలుగా కుంగదీసుకు కూచున్నాను.... చిట్టచివరికో మానవాకారం కొడసూపింది-మరో రెండడుగులు చేరువైంది....హరి భగవంతుడా ! ఆయన మా నాన్నగారు !

నల్లటి ఓవర్‌కోటు వేసుకుని టోపీ కనుబొమలదాకా లాగి అందులుంచినా ఆయన్ని నేను గుర్తుపట్టాను. తోటవేళ్ళమీద నడుచుకుంటూ నన్ను దాటి వెళ్ళిపోయారు. నన్ను మాటుపరచగల చెట్టూ చేమా ఏం లేకపోయినా కుంగి నేలకంటుకుపోయినట్టు కూర్చొండిపోయున్నానేమో-నన్ను గమనించనేలేదాయన. ఈర్ష్యాగ్నితో వేగిపోతూ రక్తపిపాసతో తహతహలాడిపోతున్నఓతెల్లో ఒక్క-క్షణంలో బడిపిల్లాడుగామారిపోయాడు....మానాన్నగారి ఆకస్మిక సాక్షాత్కారంతో గుండెలు జారిపోయిన నేను ఆయ నెటునుంచి వచ్చారో ఎటు మాయమయ్యారో కూడా గమనించలేదు. మళ్ళీ అంతటా నిశ్శబ్దం ఆవరించి నిశ్చలత ఆవహించినప్పుడుగాని నా అవయవాలు నా స్వాధీనంలోకి రాలేదు. అప్పుడుగాని తోచలేదుఆయన అర్ధరాత్రివేళ ఈ తోటలో ఏంచేస్తున్నారా అన్న ప్రశ్న. భయావేశంతో గజ గజ వణికిపోయినప్పుడు చేతిలోంచి బాకు జారి కిందపచ్చగడ్డిలోపడిపోయింది. అది మళ్ళీ వెతికి తీసుకోడానికూడా సిగ్గేసింది. వెంటనే తెలివి తెచ్చుకున్నాను. ఇంటికివెళ్ళేముందు నా మామూలు బెంచీమీద కూర్చుని జనైదా గది కిటికీకేసి చూశాను. ఆ నిశీధ సమయపు అస్పష్టకాంతిలో ఆ కిటికీ అద్దాల నీలివర్ణం చూచాయగా కనిపిస్తోంది. వున్నట్టుండి వాటి రంగు మారిపోయింది....వాటి వెనకాల మరేదో రంగుతెర నెమ్మది నెమ్మదిగా అతి జాగ్రత్తగా కిటికీ మంచిగందాకా దించినట్లు తోచింది.

'ఏమిటిదంతా ? ఏమిటి దీ నర్థం-?'

నా గదిలోకి వెళ్ళంగానే నాకు తెలీకుండానే బిగ్గరగా ప్రశ్నించుకున్నాను—

'ఇదేమైనా కలా ? కాకతాళీయమా? లేక....' నా మస్తిష్కంలోకి దొలుచుకువచ్చిన విచిత్రమైన అపూర్వ అనుమానాలు పైకి చెప్పటానికి కూడా సాహసించలేను.

18

మర్నాడు ఉదయం నిద్ర లేవడమే తలనొప్పి పగలగొడ్తూ లేచాను. క్రిందటిదినం హడావుడంతా అదృశ్యమైపోయింది. దానిస్థానే నా అంతర్గతమైనదేదో చచ్చిపోతున్నట్టు నే నింతకు ముందెన్నడూ ఎరగని ఖేదం, బాధాకరమైన దిగ్భ్రమ, చీకాకు తప్ప మరేంలేదు.

లూషిన్‌కూడా ఎక్కడో కలిసి—

"అదేమిటి బాబూ—సహం మెదడు తీసేసిన చిన్నకుందేల్లా కనిపిస్తున్నారేమిటి తమరు?" అన్నారు డాక్టర్ల భాషలో.

ఉదయం భోజనాలదగ్గిర మా అమ్మవంక నాన్నగారివంక క్రీగంట చూశాను. ఆవిడ మామూలుగానే చిరాకూ విసుగూ దిగమింగుకుంటూ కూర్చుంది. ఆయనకూడా యధాప్రకారం సముద్రుడిలా అతి గంభీరంగా ప్రశాంతంగా వున్నారు. కాని నన్ను మటుకు మామూలుగా పలకరించినట్టుకూడా పలకరించలేదాయన.... ....

'జరిగిందంతా జినైదాకి చెప్తే-? చెప్తేమట్టుకు పోయిందేముంది- మాయిద్దరికీ ఇంకా సంబంధం ఏంవుంది కనక?

మొండికేసి ఆమెదగ్గరకు వెళ్ళాను. కాని ఆమెను విడిచి నే చెప్పదలచుకున్నది చెప్పటంసంగతల్లావుంచి - అసలామెతో సరిగా మాట్లాడ్డానిక్కూడా సావకాశం చిక్కలేదు. వృద్ధ రాజకుమారి కొడుకు-పన్నెండేళ్ళుంటాయి-మిలిటరీస్కూల్లో చదువుకుంటున్నాట్ట-శలవుల కని పీటర్స్‌బర్గ్‌నుంచి వచ్చాడు. జినైదా తన తమ్ముణ్ణి వెంటనే నా కప్పగించింది—

"హలో మైడియర్ నటాషా!" (ఇంతవరకూ ఆమె నన్నెన్నడూ ఆ ముద్దుపేరుతో పిలవలేదు) "ఇదుగో మీకో కామ్రేడ్! వీడి పేరుకూడా నటాషాయే - కొంచెం వినయం ఎక్కువన్నమాటేగాని చాల మంచివాడు. మీకు తప్పకుండా నచ్చుతాడు. నెస్కూష్ని గార్డెన్స్ని తిప్పండి-మీరెక్కడికెళ్తే అక్కడికల్లా షికారు తీసుకెళ్ళండి-ఇక వాడి సంరక్షణంతా మీదేననుకోండి. ఏం?" అంటూ అత్యంతానురాగంతో రెండుచేతులూ నా భుజాలమీద పెట్టింది. నా హృదయం మళ్ళీ కరిగి నీరై పోయింది, ఆ కుఱ్ఱవాడి రాకతో నేనూ మళ్ళీ కుఱ్ఱవాణ్ణైపోయాను, నిశ్శబ్దంగా అతనికేసి చూశాను. అతనూ యేం మాట్లాడకుండా నావంక నిశ్చలంగా చూశాడు. జినైదా మా యిద్దర్నీ చూసి విరగబడి నవ్వుతూ ఒకళ్ళదగ్గర కొకళ్ళని తోసింది—

"కావలించుకోండర్రా కుఱ్ఱాళ్ళా!"

కిక్కురు మనకుండా ఆజ్ఞ శిరసా వహించాము.

"పార్కు చూస్తావా?" అని అడిగానతన్ని.

"ఊఁ చూస్తాను సర్" అన్నాడు అచ్చమైన మిలటరీ కేడెట్* లాగా. జినైదా కి మళ్ళీ విరగబడి నవ్వొచ్చింది.... ఆ రోజున ఆమె దేహం ఏదో అపూర్వమైన వింత శోభతో మెరిసిపోతోంది.... నేనూ ఆ కేడెట్ కలిసి పార్కులోకి బయలుదేరాము. పార్కులో కొమ్మ ఉయ్యాల ఒకటి-ఎప్పటిదో పురాతనపుది వుంది. ఉయ్యాల బల్లమీద అతన్ని ఎక్కించి ఊపసాగాను. కొత్తయూనిఫారంలో కదలక మెదలక ప్రాణాలు బిగపట్టినట్టు బలంకొద్దీ ఉయ్యాల చేర్లు పట్టుకుని కూర్చున్నాడు.

"ఆ కాలర్ కాస్త వదులు చేసుకోరాదా?" అన్నాను. అతను గొంతు సవరించుకుని "ఆఁ ఆఁ-ఎందుకూ-అదిమాకు అలవాటేలెండి" అన్నాడు.

---

* మిలటరీ స్కూలు విద్యార్థి.

ముహూర్తం అక్కగారి పోలిక. ముఖ్యంగా ఆకళ్ళు అమెత నీమూ నాకామెనే జ్ఞాపకం చేస్తున్నాయి. అతన్ని వెంటబెట్టుకు తిప్పడం నాకూ ఆనందంగానే వుందిగాని ఇంకా ఆ పాతబాధ నా మనస్సులో మెలేస్తూనేవుంది. ఇవ్వాళకదా నేను వాళ్ళి దుఃఖవాణ్ణైపోయాను.

కాని....విన్నారై తే....!, హఠాత్తుగా నేను బాకు జారవిడిచిన చోటు గుర్తు కొచ్చి దాన్ని వెదకడంకోసం వెళ్లాను. దొరికింది. అది తనకిమ్మని ఆ కుర్రాడు మరీమరీ బ్రతిమలాడి తీసుకుని దాంతో 'హెమ్లాక్' * కాడ ఒకటి కోసి బూరచేసి వూదాడు. ఒథెల్లో కూడా కాస్సేపు ఆ మురళి మ్రోగించాడు.

కాని ఆరోజు సాయంత్రం ఈ ధీర ఒథెల్లో తోటలో ఓమూల చేరి కూర్చుండగా జినైదా వచ్చి ఏమిటంత విచారంగా వున్నావని అడిగింది. దాంతో అతని దుఃఖం కట్టలు తెంచుకుని ఆమెమీదపడి వలవల విలపించాడు. అర్థూ అదుపూలేని ఆ కన్నీళ్ళు చూసి ఆమె కూడా భయపడిపోయింది.

"ఏమిటి వాల్డెమార్ ? ఏమిటి సంగతి ?" అని సానునయంగా మళ్ళీ మళ్ళీ అడిగింది. నే నెంతకీ సమాధానం చెప్పలేకపోయాను. నా కన్నీళ్ళుకూడా ఆగే సూచనలు కనిపించక జినైదా నా తలచెంపనే ముద్దుపెట్టుకోడానికి ప్రయత్నించింది. కాని నేను గభాల్న మొహం తిప్పేసుకుని ఎక్కిళ్లుపట్టి ఏడుస్తూనే ఒక్కొక్క ముక్కే అన్నాను—

"నాకంతా తెలుసు. ఎందుకు నాతో ఇలా చెలగాటాలాడ్డం ? నా ప్రేమతో మీకేం పనసలు ?"

"నిజమే వలోద్యా ! నీపట్ల నేను చాలా అన్యాయంగా ప్రవర్తించాను. నాది తప్పే-నాకు తెలుసు. నేను చాలా దుర్మార్గురాల్ని-పాపిని-చండాలిని....కాని....నే నిప్పుడు నీ ప్రేమను కించపరచడంలేదు. నిజం చెప్తున్నాను-నీమీద నాకున్న ప్రేమకి అంతులేదు. నీ కర్థంకాని విష యాలు కొన్ని....అవునూ-అస లింతకీ నీకు తెలిసిందేమిటి ?"

* కాడలు బోలుగావుండే ఒక రకమైన మొక్క.

ఇహ ఇంకా నేను చెప్పవలసిందేముంది? నావంక చూస్తూ నా ఎదురుగ్గా నిలబడివుంది జినైదా. నేనామె మనిషిని-ఆమె నావంక చూసినప్పుడల్లా ఆపాదమస్తకమూ ఆమె స్వాధీనమే నేను!....మరో పావుగంటతర్వాత జినైదాతోనూ ఆమె తమ్ముడితోనూ కలిసి పరుగులు తీస్తున్నాను. ఇప్పుడు నేనేడ్వటంలేదు-నవ్వుతున్నాను.-నా దుఃఖాశ్రువులు అంతలోనే ఆనందబాష్పాలైపోయాయి. జినైదా తలలోంచి రిబ్బనొకటి తీసుకుని నామెళ్ళో 'టై' బదులు కట్టుకున్నాను.-ఓసారి ఆమెను నడుం చుట్టూ చెయ్యివేసి పట్టుకున్నందుకు ఆనందాతిరేకంతో కేకలుపెట్టాను ....నిజంగా నన్ను తన చిత్తంవచ్చినట్లు వాడుకోగల సమర్థురాలు జినైదా.

19

ఆ అర్ధరాత్రి నిద్రం చైత్రయాత్రచేసి వచ్చినతర్వాత వారం రోజులదాకా నాలో రేగిన భావసంచలనాన్ని విశదపర్చిచెప్పడం నావల్లకాదు. ఏవేవో భావాలూ ఆలోచనలూ అనుమానాలూ ఆశలూ ఆనందం దుఃఖం అన్నీ విపరీత ఉద్రేకాలూ కలిసి ఒక భయంకర సుడిగుండంలో పడి కొట్టుకుంటున్నట్లు వుందా నాలుగు రోజులూ. సంధి పుట్టినప్పటిలాగా అంతా అల్లకల్లోలంగా అతివిచిత్రంగా వుంది. నా హృదయం విప్పి చూసుకోడానికి నాకే భయం-ఏ విషయం గురించైనా తీవ్రంగా ఆలోచించడానికి భయం....ఐనా నిద్రమటుకు బాగానే వచ్చేది. ఈ సందర్భంలో మటుకు నా బాల్యచాపల్యం నాకు బాగా ఉపయోగపడింది. నన్నెవరైనా ప్రేమిస్తున్నారా లేదాఅన్న విషయం తెలుసుకో కోరలేదు. నన్నెవరూ ప్రేమించడం లేదన్న సంగతికూడా ఒప్పుకోవడానికి ఇష్టంలేదు. మా నాన్నగార్ని తప్పించుకు తిరుగుతున్నాను. కాని జినైదాని చూడకుండా వుండలేకపోతున్నాను. ఆమె సమక్షం అగ్నిజ్వాలలా నన్ను దహిస్తోంది.

అలా దహించుకుపోవడమూ హతమైపోవడమూ కమ్మగా వున్నంత సేపూ ఆ అగ్నిజ్వాల ఏదైతే నాకేం; మనమూ కోరిన ప్రశాంతానికి లోబడుతూ నాలోనే నేను దాగుడుమూత లాడసాగాను-స్మృతులను విస్మరించాను-ఏదో సంఘటిల్లబోతోందని అనుకుంటూనే ఆ ఆగామి విషయాన్ని నా మనసునుండి బలవంతంగా నెట్టివేశాను-కళ్ళు గట్టిగా మూసేసుకున్నాను.... ఈ సంధిజ్వరావస్థ ఆట్టేరోజులు వుండదు. నాకు తెలుసు. అలాగే ఒక ఆకస్మికవిపాతం ఈ అవస్థను అంతంచేసి నా జీవిత ప్రవాహాన్ని దారి మళ్ళించింది.

ఓనాడు నేనెక్కడెక్కడో తిరిగితిరిగి భోజనానికి ఇంటికివచ్చాను. భోజనానికి నేనొక్కణ్ణే. చాలా అపూర్వం ఆశ్చర్యకరం అయిన విషయం ఇది. నాన్నగారు బైటెక్కడికో వెళ్లారు. అమ్మ వంట్లో బాగుండలేదని భోజనం అక్కర్లేదని తనగదిలో తాళం పెట్టుక్కూర్చుంది. పని మనుషుల మొహాలుచూసి ఏదో గొడవ జరిగిందని అర్థం చేసుకున్నాను.... వాళ్ళ నడగడానికి సాహసించలేకపోయాను. కాని వాళ్ళల్లో నాకో స్నేహితుడున్నాడు. వాడిపేరు ఫిలిప్. పద్యాలూ పాటలూ అంటే మంచి యిష్టం-'గిటారు' బాగా వాయిస్తాడు-వాణ్ణి పట్టుకున్నాను. అమ్మకీ నాన్నకీ చాలా ఘోరమైన యుద్ధం జరిగిందట. [ప్రతి మాటా పనివాళ్ళ గదిలోకి వినిపించిందట. పోట్లాట చాలా భాగం ఫ్రెంచిభాషలోనే జరిగినా ఒక దాసీదానికి ఆ భాషవచ్చు. పారిస్‌లో ఐదేళ్ళు పనిచేసివచ్చిందది.] నాన్నగారు శీలనియమం విడిచిపెట్టి పక్కింటి అమ్మాయితో తతంగం నడుపుతూ తనకు ద్రోహం చేశారని అమ్మ అన్నదట. ముందీ సంగతి కాదని అన్నా తర్వాత ఎగిరిపడి కోపంతో వొళ్ళు మరిచిపోయి 'పయసు మళ్ళిన నీలాంటి ఆడదాంతో....' అని ఏమిటో నానా చండాలం అన్నారట. దాంతో మా అమ్మ ఏడుపులూ పెడబొబ్బలూనూ. ఏదో ప్రామిసరీనోటుకూడా ఇచ్చారట వృద్ధ రాజకుమారికి నాన్నగారు. తల్లీ కూతుళ్ళ నిద్దర్నీ నానా దుర్భాషలాడిందట అమ్మ. దాంతో ఆయన మరీ రెచ్చిపోయి పైమాట అన్నారట.

"అసలు దీనికంతా మూలం ఆ ఆకాశరామన్న ఉత్తరంబాబూ. అదిరాకపోతే ఏ గొడవా వుండేదికాదు." అని ముగించాడు ఫిలిప్.

"అంటే-ఏదో వుందనా నీ వుద్దేశంకూడా ?"

నా కాళ్లూ చేతులూ చల్లబడ్డాయి. ఎక్కడో అంతరాంతరాల్లో ఏదో ప్రకంపించసాగింది.

"వుందనేంబాబూ. చాలావుంది గ్రంధం. ఇలాంటి విషయాలు దాగుతాయా ? అయ్యగారుకూడా చాలా జాగ్రత్తగానే వున్నారు గాని ఈసారి....ఎప్పుడో అప్పుడు ఏ బండియో తీసుకురావాల్సివస్తుంది. పనిమనుషులులేకుండా వీలౌతుందా బాబూ ?"

ఫిలిప్ని పంపించేసి పక్కమీద పడ్డాను. నేను వలవలా ఏడవనూలేదు-నిరాశతో కుమిలిపోనూలేదు. ఇదంతా ఎప్పుడెలా జరిగిందో ప్రశ్నించుకోలేదు. ఈసంగతి నేనింతకుముందే ఎందుకు కానుకోలేకపోయానా అనికూడా అనుకోలేదు. మానాన్నగార్నిగురించి పల్లెత్తుమాట కూడా అనుకోలేదు....దుర్భరమైన ఆ ఘోరవార్త నిర్ఘాతపాతంలా నన్నణగద్రొక్కింది....అంతా అయిపోయింది. నా పూవులన్నీ కూకటి వేళ్ళతోసహా పెకలింపబడి చిందరవందరగా నా చుట్టూ విరజిమ్మి వున్నాయి-క్రూరపదఘట్టనతో నలిగి పసివాడి ఛిన్నాభిన్నాలై.......

20

మర్నాడు మాఅమ్మ తిరిగి పట్నం వెళ్ళాలంటూ కూర్చుంది. నాన్నగారు ఆమెగదిలోకి వెళ్ళి చాలాసేపు మాట్లాడివచ్చారు. ఆయనేం మాట్లాడిందీ ఎవళ్ళకీ ఏం వినిపించలేదుగాని అమ్మ ఏడుపుమాత్రం మానింది. కాస్త శాంతించి భోజనం చెయ్యడాని కంగీకరించింది గాని తన గదిలోకేపంపమంది. పట్నం వెళ్ళిపోయే వుద్దేశంకూడా మార్చుకోలేదు. ఆ రోజంతా కూడా నేను కాలుగాలిన పిల్లిలా తెగ తిరిగినట్టు జ్ఞాపకం. కాని తోటలోకిమాత్రం ఒక్కసారికూడా పోలేదు-ఆ యింటి

వైపు అసలు కన్నెత్తి చూడలేదు. ఆరోజు సాయంత్రం నేనొక విచిత్ర దృశ్యం తిలకించాను-మా డ్రాయింగ్ రూంలోంచి కౌంట్‌మాలెవ్స్కీ రెక్క పట్టుకుని హాల్లోకి లాక్కొచ్చి పనివాళ్ళందరూ చూస్తూండగానే మానాన్నగారన్నారు-"మొన్న మధ్యనే తమర్ని యింట్లోంచిమర్యాదగా బైటికిదయచెయ్యమన్నారు. మర్చిపోలేదుగదా? ఈసారి సంజాయిషీలతో నిమిత్తంలేకుండా చెప్తున్నాను-మళ్ళీ తమరి యింట్లో అడుగు పెట్టారంటే కిటికీలోంచి విసిరి అవతల పారేస్తాను. అర్థమైందా? నీ దస్తూరీ అంటే పరమాసహ్యం నాకు!"

కుంగి, ముడుచుకుపోయిన కౌంట్ పళ్ళు కొరుకుతూ నలిగిపోయిన కోటు సర్దుకుంటూ నెమ్మదిగా జారుకున్నాడు.

మేమంతా పట్నం వెళ్ళిపోవడానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. మా నాన్నగారికి కూడా ఇంకా ఆ జనపదంలో అట్టేకాలం వుంటం ఇష్టంలేనట్టుంది, కాని గొడవ, రభస చెయ్యకుండా అమ్మని లొంగదీసుకొచ్చారు. ప్రయత్నాలన్నీ చాలా నిశ్శబ్దంగా తొందరలేకుండా తాపీగా జరిగిపోయాయి. అమ్మ రాజకుమారి జెసీకినాకు ఉత్తరంకూడా ఒకటి రాసి పంపింది-తనవంట్లో బాగులేకపోవడంవల్ల స్వయంగా వచ్చి చెప్పిపోవడానికి వీల్లేకపోయిందని రాసింది. నేను దయ్యంపట్టిన మనిషిలా పరిభ్రమిస్తున్నాను, నా కోరికల్లా ఒకటే-ఇదంతా ఎప్పుడు-ఎంత త్వరగా ముగిసిపోతుందా అని! కాని ఒక్క ఆలోచనమాత్రం ఎంత ప్రయత్నించినా నన్ను వదిలిపెట్టకుండా పట్టుకు వేలాడుతోంది; అంత చిన్నపిల్ల-అందులోనూ రాజకుమారి-అలా ఎలా ప్రవర్తించగలిగింది? మా నాన్నగారు సపత్నీకుడని తెలుసు-తను పెళ్ళి చేసుకోవాలనుకుంటే లక్షమంది-బెలొవ్జొరోవ్‌వంటివాళ్ళు! ఏం ఆశించి చేసిందీపని? తన భవిష్యత్తే నాశనమైపోతుందనికూడా భయపడలేదా మనిషి? 'ప్రేమ అంటే అదే మరి! ప్రగాఢమైన దివ్యప్రేమ అంటే అలానే వుంటుంది. ఆ ఉద్రేకం మహోద్రేకం!' అని వెంటనే జవాబుతోచింది నాకు. 'ఆత్మ నాశనానికికూడా ఒడిగట్టే మనుషులుంటారన్నమాట!' అని లూషిన్ ఓసారిఅన్నమాటలుకూడా జ్ఞాపకానికొచ్చాయి. ఇంకా మేము ప్రయాణ

సన్నాహాలు చేస్తున్న రోజుల్లో ఓసారి పక్కింటి కిటికీలోంచి బాగా పాలి పోయి వివర్ణమైన ముఖం ఒకటి కనిపించింది....'అది జీనైదా ముఖమా ?' అనుకున్నాను....నిజంగా అ కనిపించింది జీనైదా ముఖమే. ఇక నేనాగలేకపోయాను. ఆమెదగ్గిర శలవుతీసుకోకుండామటుకు ఆమెను విడిచి వెళ్ళలేను !... అవకాశంచూసి వాళ్ళ యింటికి వెళ్ళాను.

వృద్ధ రాజకుమారి ఎప్పటంత నిర్లక్ష్యంగానూ అంత బాహాటంగానూ పలకరించింది నన్ను: నవ్వుం పిలుస్తూ—

"ఏం-ఇంత తొందరగా వెళ్ళిపోతున్నారు మీ వాళ్ళంతా ?" అని అడిగింది. ఆమెను చూడగానే నా గుండెమీదనుంచి సగం బరువు దిగినట్లయింది. ఫిలిప్‌గారు చెప్పిన ప్రామిసరీనోటు నా ప్రాణాల్ని పీక్కుతింటోంది. ఆవిణ్ణి చూడంగానే ఆమేం అనుమానించడంలేదని తెలిసిపోయింది. అధమం నా కన్పడలా అనిపించింది. జీనైదా పక్క గదిలోంచి నెమ్మదిగా వచ్చింది. మొహం నిజంగా బాగా పాలిపోయింది-నల్లటి బట్టలు-సంస్కారంలేని శిరోజాలు....నా చెయ్యిపట్టుకుని నిశ్శబ్దంగా అవతలికి తీసికెళ్ళింది.

"నీ గొంతు వినిపించి వచ్చాను. నిజంగా నీ మనసంత కఠోరమని అనుకోలేదు-మమ్మల్ని ఇలా వదిలేసి పూరుకోవడం నీకంత తేలిగ్గావుందాబాబూ ?"

"మీదగ్గర శలవుతీసుకోడానికి వచ్చాను రాజకుమారీ ! బహుశా ఇవే మన ఆఖరి చూపులు....మేం పట్నం వెళ్ళిపోతున్నాం - విన్నారుగా ?"

జీనైదా దృక్కులు దేనికోసమో నా మొహమంతా వెతికాయి.

"అవునట-విన్నాను. మీరు వచ్చినందుకు చాలా సంతోషం. అసలు కనిపించకుండానే వెళ్ళిపోతారేమోననికూడా భయపడ్డాను.... ఏదో కాస్త దయతోమటుకు తలుచుకుంటూ వుండండి నన్ను-మిమ్మల్ని నేను చాలా హింస పెట్టాను. నాకు తెలుసు. కాని మీరనుకుంటున్నంత నీచురాల్నిమాత్రంకాదు." అంటూ కిటికీ కామకుని తటాల్న మొహం తిప్పేసుకుంది—

"నిజంగానే కాదు. నామీద మీకు చాలా దురభిప్రాయం వుందని నాకు తెలుసు."

"నాకా?"

"అవును. మీకు....మీకే!"

"నాకు....?"

మళ్ళీ నాగొంతులో వచ్చి వెలక్కాయ పడింది. యధాపూర్వం దుర్నివార్యమైన ఆమె మనోహరశక్తిముందు నా హృదయం మళ్ళీ ప్రకంపించి నీరవమైపోయింది.

"నేను-నేను నిజం చెప్తున్నాను జీనైదా అలెగ్జాండ్రోవ్నా. నన్ను నమ్మండి-మీరు నన్నెంత హింసించినాసరే-మీరు నన్నేంచేసినాసరే-నేనుమటుకు నా జన్మాంతం మిమ్మల్ని ప్రేమిస్తూనే వుంటాను-మిమ్మల్నే కొలుస్తూంటాను!"

ఆమె రెండుచేతులూ బారజాచి గిఱ్ఱున నావైపు తిరిగి నా కంఠం చుట్టూ పెనవేసింది. నన్ను తన హృదయానికి హత్తుకుని గాఢంగా ముద్దుపెట్టుకుంది. ఆ సుదీర్ఘమైన వీడ్కోలు ఎవరికోసం ఉద్దేశించబడిందోగాని నేనుమటుకు అత్యాశతో అందులోని మాధుర్యమంతా జుఱ్ఱుకున్నాను. మళ్ళీ అది లభ్యంకాదని నాకు తెలుసు.

ఆమె బలవంతాన నామంచి పెకలించుకుని ఆ గదిలోంచి వెళ్ళిపోయింది. నేను బైటికొచ్చాను. వాళ్ళింట్లోంచి వచ్చేటప్పటికి నా మనోభావాల వర్ణించడం నా శక్యంకాదు. ఆ అనుభవం మళ్ళీ మళ్ళీ జరగాలని ఆశించలేనుగాని అదసలు జరక్కపోతేమటుకు చాలా దురదృష్టవంతుణ్ణిగా భావించుకునేవాణ్ణి.

మేం మళ్ళీ పట్నం చేరుకున్నాం. గతాన్ని విస్మరించి మళ్ళీ ప్రపంచంలో పడటానికి నాకు చాలాకాలం పట్టింది. నా గాయం అతి నెమ్మదిగాగాని మానలేదు. ఐనా మా నాన్నగారిమీద నాకెప్పుడూ ద్వేషం

కలగలేదు సరిగదా ఆయనంటే నా దృష్టిలో మేరువులా పెరిగిపోయారు. మనస్తత్వ శాస్త్రజ్ఞులు ఈ వైరుధ్యానికేమని వ్యాఖ్యానం చేసినా సరే.

ఓరోజు వీధిలో వెళ్తూంటగా హఠాత్తుగా లూషిన్ ఎదురయ్యారు. నామనస్సొక్కసారి ఆనందంతో ఎగిరి గంతేసింది. గబగబా అతని దగ్గరకు వెళ్ళాను.

"ఓ! తమరా బాబూ! ఏదీ- సరిగాచూడనీ-ఊఁ....మనిషిని ఇంకా అల్లాగే వున్నావు గాని - ఆ కళ్ళలోని నిద్దరమోతుతనం మటుకు పోయిందిలే! నాలిక వేళ్లాడేసిన కుక్కపిల్లలా కాక కాస్త మనిషిలా కనిపిస్తున్నావ్! బాగుంది ఊఁ-ఎలావున్నావ్-ఏం చేస్తున్నావ్?"

నేనొక్క నిట్టూర్పు విడిచాను. అబద్ధమాడటం ఇష్టంలేదు-నిజం చెప్పడానికి అభిమానం...."ఫరవాలేదులే-నిరాశ పడకు. ఏ ఒడిదుడుకులూ లేకుండా ఏ ఉద్రేకంలోనూ పడి కొట్టుకుపోకుండా జీవించగలగటం బాబూ ముఖ్యం! ఏదో ఒక్క ఆధారం తప్పకుండా కావాలి-మనిషి తన కాళ్ళమీద తానునుంచోగలగాలి....అబ్బ-వెధవ దగ్గు చంపేస్తూంది-ఆఁ-అన్నట్టు-బెలొబొరోవ్ సంగతి విన్నావా?"

"ఏం? ఏమైందతనికి?"

"ఐపులేదు మనిషి. వున్నట్టుండి మాయమైపోయాడు. కాకసస్ వెళ్ళాడని కొందరంటారు మరి; ఈ బాధంతా కూడా ఎప్పు డే విషయాన్ని ఎక్కడ వదిలిపెట్టెయ్యాలో తెలీకపోవడంవల్లే! అదీ నీకో పాఠం కుర్రాడా! జాగ్రత్తగా మెసులుకో. ఐనా నువ్వేం దెబ్బలు తినకుండానే బైటపడ్డట్టున్నావులే- మళ్ళీ ఇంకేం వలలోనూ పడకుండా మటుకు చూసుకో. ఆఁ-వస్తానుమరి;గుడ్ బై!"

"మళ్ళీనా? అసంభవం! అసలామెను మళ్ళీ జన్మలో చూడను!" అనుకున్నాను నాలోనేను.

కాని జినైదాను మరోసారి చూపితీర్తానని విధి నా నుదుట వ్రాసి అట్టిపెట్టాడు.

21

మా నాన్నగారికి ప్రతిరోజూ స్వారీకి వెళ్ళడం అలవాటు. ఆయనకి మంచి ఇంగ్లీషుజాతి కపిలవర్ణపు గుఱ్ఱం ఒకటుంది. నాజూకైన పొడుగాటి మెడ-నిడుపాటికాళ్ళు - సామాన్యంగా ఎవరికీ అలవికాని గుఱ్ఱం అది దానిపేరే 'విద్యుత్' మా నాన్నగారొక్కరే దాన్ని లొంగదీయగలరు. ఓరోజు మాంచి హుషారుగా ఆయన నాగదిలోకి వచ్చారు. ఆమధ్య ఆయన్ని అంత హుషారుగా చూడటం చాలా అరుదు. కాళ్ళకు స్పర్స్‌కూడా తగిలించుకుని పూర్తిగా స్వారీదుస్తులలో వున్నారు. నన్నుకూడా తీసికెళ్ళమని మరీమరీ వేడుకున్నాను.

"సరే పదమరి-కప్పగంతుల్లోనే వెళ్ళాలిమరి-లేకపోతే నాతోబాటు గాలప్‌చెయ్యలేదు నీ గుఱ్ఱం."

"ఫరవాలేదండీ-నేనూ స్పర్స్ తగిలించుకుంటాను."

"ఊఁ-రామరి."

ఇద్దరం బయల్దేరాం. నా గుఱ్ఱంకూడా హుషారైనదే. 'విద్యుత్ ఒయ్యారపు నడకతో సమానంగా వుండాలంటే అది కాస్త గాలప్ ధోరణిలో పరుగెత్తాలన్నమాటేగాని మంచి జవసత్వాలుగల గొడ్డు అందుకనే నాన్నగారికి వెనకపడలేదు నేను. ఆయనలాంటి రౌతుని మరి చూడాలేదు నేను. ఆయన్నిచూస్తే చాలా ఉప్పొంగిపోతుంది గుఱ్ఱం. వూరంతా తెగతిరిగాం-'డివిషిపోలై'లో కొంతసేపు గడిపాం-కంచెలూ పిట్టగోడలూ ఎన్నో దూకాం-(అలా దూకటమంటే నాకు చెడ్డభయం. ఒంటరిగా ఎప్పుడూ ప్రయత్నించలేదు. కాని నాన్నగారికి పిరికివాళ్ళంటే పరమ అసహ్యం. అందుకని భయం ఓ పక్కకి పెట్టి ఆయన వెనకే

కళ్ళుమూసుకుని నేనూ దూకేశాను)-మాస్కోనది రెండుసార్లు దాటాం. ఇక వెనక్కితిరిగి వెళ్ళిపోతున్నామేమోననుకున్నాను. అంతలోనే హఠాత్తుగా నన్ను వదిలేసి క్రిందికి రేవుకేసి గాలప్ తీశారు నాన్నగారు. నేనూ ఆయన వెనకబడి గాలప్ తీయించాను. రేవులో ఓపక్కన కొయ్య దూలాలనేకం విడివిడిగా కుప్పబెట్టి వున్నాయి. అక్కడికి వెళ్ళంగానే ఆయన గుఱ్ఱంమీంచి అలాగ్గా దూకి నన్నూ దూకమన్నారు. తన గుఱ్ఱం కళ్ళెపు చేరులు నాచేతిలోకి విసిరేసి నన్ను అక్కడే ఆగమనిచెప్పి ఆచేరువలోనేవున్న ఓయిరుకుపాటి సందులోకి దిగి అదృశ్యమైపోయారు. 'విద్యుత్' మాటిమాటికీ తల ఎగరేసి గిట్టలతో నేలరాస్తూ సకిలిస్తూ గొడవచెయ్యసాగింది. దాన్ని శాంతింపజెయ్యలేక విసుగుపుట్టి తిట్టుకుంటూ రెండుగుఱ్ఱాల కళ్లేలూ పట్టుకుని ఆనదివొడ్డునే అటూయిటూ నడయాడసాగాను నేను. ఒక్కక్షణం నిలబడితేచాలు 'విద్యుత్' నా చొక్కాపట్టుకు లాగడం-మెడకొరకడం-మళ్ళీ గొడవ మొదలెట్టేది. ఎంతసేపటికీ రావడంలేదు నాన్నగారు. వాతావరణం అంతా చాలా చెమ్మగావుంది. అతి సన్నని తుంపర నిశ్శబ్దంగా పడసాగింది. నాకు విసుగెత్తింది-చిరాకుపుట్టింది-ఇంకా ఆయన తిరిగి రాలేదు. ఇంతలో ఆ పక్కనుంచి ఓ పోలీస్ నాకేసి వచ్చాడు. (మాస్కోనది ఒడ్డున పోలీసు వాడేంచేస్తున్నాడు?) నన్ను సమీపించి శతవృద్ధులా మొహంమీద లక్ష ముడతలొచ్చేట్టు పెట్టి—

"ఈ గుఱ్ఱాలు పట్టుకుని ఏంచేస్తున్నారుబాబూ యిక్కడ? నే పట్టుకునేదా?" అన్నాడు.

నేనేం జవాబియ్యలేదు. కాస్త సన్నాయించి కొంచెం పొగాకుంటే పెట్టమన్నాడు. వాణ్ణి వదిలించుకోడానికి-(నిలబడి నిలబడి విసుగుకూడా పుట్టింది.) మా నాన్నగారు వెళ్ళిన వైపు నాలుగడుగులు వేశాను. ఎలాగో అటు తిరిగామగదా అని ఆ మలుపు తిరిగి సందులోకి వెళ్లాను. వెళ్తూ వెళ్తూ హఠాత్తుగా నెత్తిన పిడుగుపడ్డట్లై ఆగిపోయాను. ఓ వందై అడుగుల అవతల ఒక బల్లకూర్పు ఇంట్లో కిటికీలోంచి మా నాన్నగారు కనిపించారు. ఆయన అటుతిరిగి కిటికీకి ఆనుకుని నిలబడివున్నారు. గది

లోపలి తెరలవెనక ఆయనతో మాట్లాడుతూ మరో స్త్రీకూడా సగం కనిపించింది—ఆమె జినైదా !

నానోటమాట పెగల్లేదు. ఇదిమటుకు నేను కలల్లోకూడా అనుకో లేదు. వెంటనే తోక ముడుచుకు వెనక్కి పరుగెత్తుకు పోదామనిపించింది. 'నాన్నగారు చూస్తేనా-' అనుకున్నాను-కాని కుతూహలం-ఈర్ష్య-భయం-వీటన్నిటినీ మించిన బలవత్తరమైన శక్తి యేదో నన్నక్కడ దిగ్బంధం చేసింది. అక్కణ్ణుంచి కదల్లేక వాళ్ళవైపే చూస్తూ వాళ్ళనుకునే ప్రతి మాటా వినాలని చెవులు రిక్కించి స్థాణువులా అలానే నిలబడిపోయాను. మానాన్నగారేవిషయంలోనో పట్టుదల పడుతున్నట్టున్నారు....జినైదా ఒప్పుకోవడంలేదల్లే వుంది....ఇంకా అదే ముఖం-గంభీరమూ మనోహరమూ అయిన ఆమె ఖిన్నసుందరముఖంలో అప్పటిలాగే భక్తి, దైన్యం, ప్రేమ, నైరాశ్యం మొదలైన భావాలతి విచిత్రంగా ఇంకా పెన గొనేవున్నాయి. తల యెత్తకుండానే వినయ విధేయతలతోనే మొండిగా చిరునవ్వు నవ్వుతూ అతిముక్తసరిగా ఏవో జవాబులు చెప్తోంది. ఆ చిరునవ్వొక్కటి చాలు-ఆ మనిషి జినైదాయే నని చెప్పెయ్యవచ్చు....నాన్నగారు భుజాలెగరేసి నెత్తిమీది టోపీ సరిదిద్దుకున్నారు — ఆయనకి బాగా విసుగుపుట్టినప్పుడల్లా అలా చెయ్యడం ఆయన కదో అలవాటు.

మనిషికూడ దీసుకుని, జినైదా చెయ్యి జాపింది....అసాధారణమైన అపూర్వదృశ్యం ఒకటి నా కళ్ళముందు జరిగిపోయింది : నాన్నగారు చేతిలోని చబుకు ఎత్తి జినైదా నగ్నహస్తంమీద ఛళ్ళునకొట్టారు. నా గుండె లొక్కసారిగా ఆగిపోయాయి-నా గొంతులోంచి బయల్వెడలిన వెఱ్ఱికేక అతిప్రయత్నంమీదగాని దిగమింగలేక పోయాను. జినైదా మటుకు ఒక్కసారి మనిషంతా కదిలిపోయి మరిమాట మాటాడకుండా ఆయనవంక నిశ్శబ్దంగా చూసి దెబ్బతిన్న తనచేయి నోటిదగ్గరకు ఎత్తుకుని ఎఱ్ఱగా కందిపోయిన ఆ గాయాన్ని ముద్దు పెట్టుకుంది. చబుకు అక్కడే విసిరిపారేసి కిటికీదగ్గర్నుంచి విసురుగా బయల్దేరారు....జినైదా కూడా చేతులు బారజాపి తొణకని గాంభీర్యంతో తల వెనక్కి విసిరి కిటికీదగ్గర్నుంచి తొలిగిపోయింది....

భయావిష్టతతో బొమ్మనిలిపోయినట్లైంది నాకు. నేచూసిన దృశ్యం నా హృదయాన్ని మెలిపెట్టి పారేసింది. తడబడుతున్న అడుగుల్తో వెనక్కి తిరిగి గుర్రాల్ని నా వెనకే ఈడ్చుకుంటూ మళ్ళీ ఏటి ఒడ్డుకు పరుగెత్తాను. నా ఆలోచనలన్నీ అయోమయంగా వున్నాయి. సర్వసాధారణంగా ఏదీ పట్టించుకోకుండా అతి ప్రశాంతంగా వుండే మానాన్నగారు అప్పుడప్పుడు ఆకస్మికమైన ఆగ్రహావేశంతో ప్రళయకాల రుద్రుడై పోతుంటాడని తెలుసు నాకు. ఐనా నేనప్పుడు చూసిన దారుణదృశ్యం మటుకు ఏ విధంగానూ సమన్వయ పరుచుకోలేక పోయాను....కాని జన్మ జన్మాలకీకూడా జీనైదా చెయ్యిజాపిన తీరు, ఆమె చూపు, ఆ చిరునవ్వు మటుకు మర్చిపోలేను. ఈ కొత్తరూపంలో మలుచుకువచ్చిన ఆమె చిత్రం మటుకు నా స్మృతి పథంలో శాశ్వతంగా నిలిచిపోతుంది. 'ఆమెని కొట్టాడు....ఆమెను కొట్టాడు....,అని పునశ్చరణ చేసుకుంటూ నా చెక్కిళ్ళవెంబడి కారుతున్న కన్నీళ్ళనుకూడా గుర్తించకుండా అమహా నదివంక శూన్యంగా చూస్తూ నిలబడిపోయాను....

"ఆఁ.. ఆ కళ్ళెం ఇలా ఇయ్యవోయ్—"

నా వెనగ్గా వచ్చి నిలబడి అడిగిన మానాన్నగారి కంఠస్వరంఅది. నేను యాంత్రికంగా ఆయన గుర్రం కళ్లెపుచేరులు అందించాను. ఆయన ఎగిరి 'విద్యుత్'మీదకు దూకికూర్చున్నారు. చాలా సేపటినుంచీ నిరీక్షణతో విసిగి వరవళ్ళు తొక్కుతున్న 'విద్యుత్' ఒక్క అంగలో పది అడుగులు దూకింది, స్పర్శతో దాని డొక్కల్లో తెగబొడిచి మెడమీద గుద్దుతూ చివరికెల్లాగో దాన్ని లొంగదీశారు—

"అరె..చేతిలో చుబుకు లేకుండా పోయిందే!" అంటూ.

జీనైదా చేతిమీద ఛళ్ళుమంటూ ఆ చుబుకుదిగిన శబ్దం నాచెవుల్లో మళ్ళ మార్మోగిపోయింది.

"ఏంచేశారు చుబుకు?" అని అడిగాను ఒక్కక్షణంఆగి.

జవాబు చెప్పకుండా గాలపటిగారాయన. నేనూ గాలపటిపి ఆయన

కంటె ఓ అడుగు ముందుకెళ్లాను. ఆయన ముఖం చూసితీరాలనిపించింది.

"చూసి చూసి విసుగెత్తిపోయావా?" అని అడిగారాయన పళ్లు బిగబట్టి.

"ఆఁ అఁ-ఏదో....ఇంతకూ చుట్టకెక్కడ మర్చిపోయారు?" అని మళ్ళీ అడిగాను.

"ఎక్కడా మర్చిపోలేదు. నేనే విసిరి అవతల పారేశాను."

హఠాత్తుగా ఏదో ఆలోచనలో పడిపోయి తలవంచుకున్నారు.... ఆయన కఠోరమైన ముఖకవళికల్లో ఎంత దయ, సానుభూతి సమ్మిళితమై వున్నాయో నాకు కనిపించడం అదే మొదటిసారి-అదే చివరిసారి కూడానూ.

ఆయన మళ్ళీ గుట్టాన్ని గాలప్తియించారు. ఈసారిమటుకు నేనాయనతోబాటు వెళ్ళలేకపోయాను. ఆయన ఇంటికి చేరుకున్నతర్వాత పావుగంటకుగాని నేను చేరుకోలేకపోయాను.

'ప్రేమంటే అదీ! అల్లా వుండాలి నిజమైన ప్రేమ!' అని మళ్ళీ అనుకున్నాను ఆరాత్రి నాగదిలో టేబులుముందు కూర్చుని.

'కోపం ఎవళ్ళకైనా రావచ్చు. కాని అవతలమనిషి తనకెంత ప్రియతముడైనా ఆమనిషికొట్టే దెబ్బలకు కిక్కురుమనకుండా ఎవరు లొంగిపోగలరు? కాని నిజమైన ప్రేమ దీన్నికూడా సహించగలదన్న మాట!....నేను....ఇంకా నేననుకున్నాను.........'

ఆ అజ్ఞాతశక్తిని నేనర్థంచేసుకోలేకపోయేవాణ్ణి. అంధకారరాశిలో లాగా అస్పష్టంగా అగుపించే ఆ భయోత్పాతమైన దివ్యసుందర శక్తి ముందు నా ప్రేమ, నా బాధలు పట్టి తహతహ అనిపించింది-పక్షి ఊబలాటంమాత్రమే ననిపించింది. దాంతో పోల్చిచూస్తే ఇది మరీ కుర్రతనం, అనామకంఅనికూడా తోచింది.........

ఆరాత్రి నాకో విచిత్రమైన కల వచ్చింది. నేనొక చీకటికొట్లోకి వెళ్ళానట-అక్కడ మా నాన్నగారు కొరడా చేతబట్టుకుని ఒళ్ళుమరచిన

ఆగ్రహంతో పదఘట్టనం చేస్తున్నారు.........జినైదా ఓమూల కుంగి కూలబడివుంది-ఎఱ్ఱని గాయం-చేతిమీదకాదు-ఆమె నొసటిమీద అడ్డంగా తేలివుంది. వాళ్ళిద్దరివెనకా బెలొజొరోవ్....వణికిపోతున్న పెదవులతో అపమర్థమైన ఆగ్రహంతో మా నాన్నగార్ని తిట్టిపోస్తున్నాడు..........

తర్వాత రెండునెలలకి నేను యూనివర్శిటీలో జేరాను. ఆతర్వాత అరునెలలకు పీటర్స్‌బర్గ్‌లో మా నాన్నగారు హఠాత్తుగా గుండె ఆగిపోయి మరణించారు. ఆయన చనిపోయేముందు మాస్కోనుంచి ఓ వుత్తరం వచ్చింది. అది ఆయన్ని చాలా కలవరపెట్టింది. మా అమ్మ దగ్గరకు వెళ్ళి ఏమిటో అడిగాడు-నిజంగా కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడని కూడా చెప్పారు. వలవలా యేడ్చారట-మానాన్నగారు! గుండెజబ్బు వచ్చేరోజున ఆయన నాకో వుత్తరం రాశారు—

"స్త్రీ ప్రేమవిషయంలోమటుకు జాగ్రత్తగావుండుబాబూ - ఆ ఆనందం-ఆ హాలహలం........" మా నాన్నగారు చనిపోయిన తర్వాత అమ్మ కొంత డబ్బు-పెద్దమొత్తమే-మాస్కోకి పంపించింది.

22

మూడు నాలుగు సంవత్సరాలు గడిచాయి. యూనివర్శిటీనుంచి బైటపడ్డాను. ఇహనేంచెయ్యాలో, జీవితపథంలో ఏదారి తొక్కాలో, ఏ తలుపు తట్టాలో ఇంకేం నిర్ణయించుకోలేదు. అలా సోమరిగా కాలం గడుపుతున్నాను. ఓరోజు ఓ నాటకశాలదగ్గర మైదనోవ్ కనిపించాడు. పెళ్ళి అయిందట-ఏదో గవర్నమెంటు ఆఫీసులో వుద్యోగంచేస్తున్నాడట. కాని అతనిలో నాకేం మార్పు కనిపించలేదు. మనిషిలో ఇంకా ఆ వెనకటి వ్యర్థోత్సాహం-వున్నట్టుండి బిగుసుకుపోవడం-ఏమీ తగ్గలేదు. మాటల ధోరణిలో అన్నాడు—

"అప్పట్టు-మేడమ్ దాల్స్కాయా ఇక్కడేవుంది తెలుసా ?"

"అవిదెవరు ?"

"అరె-అప్పుడే మర్చిపోయారా ? మీరూ నేను అందరం కలిసి ప్రేమించాం-యువరాజకుమారి జినైదా! నెస్కూష్ని గార్డెన్స్ దగ్గర-జ్ఞాపకంలేదూ ?"

"ఓ! ఆవిడిప్పుడు డాల్స్కీనివి పెళ్ళిచేసుకుందా ?"

"అవును."

"ఇప్పుడెక్కడ-డ-హోల్లో వుందా ?"

"లేదు. పీటర్స్‌బర్గ్‌కి వచ్చింది ఈమధ్యనే. విదేశాలకి వెళ్తోంది"

"మరి....ఆమె భర్త ఎలాంటివాడు ?

"ఓహ్ -అతనికేం! చాలా మంచివాడు. మంచి ఆస్తిమంతుడు కూడానూ.మాస్కోలో మేమిద్దరం కలిసి పనిచేసేవాళ్ళం. ఆ గొడవ జరిగాక-అదంతా మీకు తెలుసుగా. (ఈమాట అంటూ సాభిప్రాయంగా చిరునవ్వొకటి పారేశాడు) దాంతోఆవిడకు పెళ్ళి కావడం కాస్తకష్టమై పోయింది....కాని ఆమె ఎంతకైనా సమర్థురాలు గదా! పెళ్ళి అయిపో యింది, వెళ్ళి ఓసారి చూసి రాకూడదూ-మీరు వెళ్తే ఆవిడకూడా చాలా సంతోషిస్తుంది. మనిషికూడా వెనకటికంటే చాలాబాగుంది."

మైదనోవ్ జినైదా అడ్రసు ఇచ్చి వెళ్ళిపోయాడు. డీమత్ హోటల్లో బస జేసింది ఆమె! మళ్ళీ పాతస్మృతులన్నీ కలకబారాయి.... నా పూర్వ ప్రియురాలిని మర్నాడే వెళ్ళి చూసి రావాలనుకున్నాను. కాని ఏవేవో అడ్డంకులు వచ్చాయి. మర్నాడు వెళ్ళలేదు. ఆవారమంతాకూడా వెళ్ళలేదు. మరోవారం గడిచింది. చివరి రోజున డీమత్ హోటలుకు వెళ్ళి ఆమెకోసం అడిగాను. చాలా అకస్మాత్తుగా ప్రసవవేదన భరించలేక నాలుగు రోజుల క్రితం మరణించిందని చెప్పారు.

నా హృదయంమీద ఎవరో సమ్మెట పట్టుకు కొట్టినట్లనిపించింది. ఆమెను చూడగలిగి వుండికూడాచూడలేకపోయినందుకు నన్ను నేనే

నిందించుకున్నాను. ఇహ మరిచూడలేనన్న ఆలోచన నా మనస్సుని రంపకోత పెట్టింది. సమాధానం చెప్పిన హోటలు బోర్డరువంక వెర్రిచూపులు చూస్తూ "చచ్చిపోయిందా!" అని ఒక్క కేకపెట్టి మరి మాటాడలేక వీధిలో పడ్డాను. ఎక్కడికి వెళ్తున్నది, ఎటుపోతున్నదీకూడా గమనంలేక నడవసాగాను. గతమంతా ఒక్కసారిగా వెల్లువెలా ఉబికివచ్చి నాముందు అల్లకల్లోలమైపోయింది....

రవ్వలాంటి ఆలేతబ్రతుకు చివరికిల్లా అంతంకావాల్సి వుందన్న మాట!....

ఆమె ఆ వేగం, ఆ ఉద్ధృతం చివరికిగతిపట్టించడానికా పనికొచ్చాయి!....ఆమె కళ్ళు కుటిలాలకలూ-ఆమె సర్వరూపాన్నీ నా కళ్ళ ముందు రూపించుకున్నాను. అన్నీకలిపి ఓ కొయ్యపెట్టెలోకుక్కి అనతి దూరానే ఎక్కడో పూడ్చిపెట్టేశారప్పుడే............

అన్నీ నా మనసులో మననం చేసుకుందామని ప్రయత్నించాను. గాని ఎప్పుడో విన్న గీతం ఒకటి నా అంతరాళంలో ప్రతిఘోషించింది—

'యాంత్రికంగా
చావువార్తను జేరవేశాయ్
—నీ పెదవులు........

అంతకంటే
అశ్రద్ధగా ఆలకించాయ్
—నా వీనులు........

అహో యౌవనమా! నీవు దేనికీ లక్ష్యంచేయవు - విశ్వంలోని విధివిశేషాలన్నీ నీలోనే అంతర్భూతాలు-విషాదమే నీకొక వినోద హేతువు! దుఃఖమూ పరివేదనమూకూడా నీ కలంకారాలు! అమేయమైన ధైర్యం, అంతులేని సాహసం నీ సహజ సంపద! ఉదయారుణ సూర్యప్రభలముందు మంచుబొరల్లా, వీతిహోత్రునిముందు వెన్నముద్దలా

నీలోని వసంతా ఆరోజుకారోజు విశేషంగా అదృశ్యమౌతున్నా నీ రోజులు వడుగిడి అనంతకాలవాహినిలో లీనమైపోతున్నా రొమ్మువిరిచి నిలబడగలవు! అసలు నీ తత్త్వరహస్యమంతా ఇమిడివున్నది నీవు సంకల్పించినది సాధించడంలో కాదనుకుంటాను.-'మనం సాధించలేనిదేముంది?' అని విశ్వసించడంలో....బతికినన్నాళ్ళు బద్ధకద్దమని అదుపూ ఆజ్ఞాలేకుండా విశృంఖలంగా విహరించడంలో....చివరకు-'నా జీవితమంతా వేనలా వ్యర్థం చేయకుండావుంటే నేనెంతటి ఘన కార్యాలు చేయగలిగేవాణ్ణి!' అని ప్రతి మానవుడూ వాపోయేట్టు చేయడంలో వుందనుకుంటాను నీ ప్రజ్ఞ అంతా!

నన్నే ఉదాహరణగా తీసుకోండి: మరి జన్మలో కంటి కగుపించని నా ప్రథమ ప్రణయినీమూర్తి దగ్గర శలవుతీసుకునేటప్పుడుకూడా ఉస్సురని నే నొక్క నిట్టూర్పైనా విడవలేదే.........ఒక్క క్షణమైనా నా హృదయం వేదనతో దోదూయమానం కాలేదే-అసలు నేనాశించినది ఇంకేమిటని? నా ఆశలన్నీ వీటిమీద ఆధారంచేసుకున్నానని? ఏలాంటి దివ్య భవిష్యత్తు ప్రతీక్షించానని?.... ....

అసలు నా ఆశలో ఆలోచనల్లో ఏది ఫలించింది? నా ప్రతీక్ష యేది సార్థకమైంది? జీవిత సాయంకాలపు క్రీనీడలు మెలమెల్లగా నా మార్గాని కడ్డుపడుతున్న ఈ వయసుకికూడా అలనాటి క్షణికమైన వసంత ప్రభాతపు అమూల్య దివ్యస్మృతులు తప్ప ఇక మిగిలిందేముంది?....

కాని అప్పుడుకూడా ఆ మత్త విశృంఖల వయోవస్థలోకూడా ఆమె సమాధినుండి ఎలుగెత్తివచ్చిన సవిషాదకలస్వనం నేను వినిపించుకోక పోలేదు. నేనుంటున్నయింట్లోనే మరొకభాగంలో వేరెవరూ దిక్కులేని వృద్ధురాలొకతెవుంది. చీకి చివికిపోయిన కట్టుబట్టలకింద ఆమె శీర్ణ దేహం ప్రాణాలకోసం పెనగులాడుతోంది. జీనైదా చనిపోయిన సంగతి తెలిసిన తర్వాత కొద్దిరోజులకే ఆమెసంగతి విన్నాను. వెంటనే నా అంతట నేనే ఏదో దుర్నివార్యమైనశక్తి నెట్టినట్టు ఆమెదగ్గరకు వెళ్ళి నా శాయశక్తులా సపర్యలు చేశాను. ఆమె జీవితమంతాకూడా నిత్య దారిద్ర్యంతో నిరంతర పోరాటమే. ఏనాడూ ఏసుఖమూ ఎరగదు. ఆనందం

తృప్తి అనేది అసలే అందని ప్రాణివల్ల. ఆమె నిజంగా మరణాన్ని కోరుతుందేమో-అందులోనే ఆమె స్వేచ్ఛగా ప్రశాంతిని ఆశిస్తుందేమో ననిపిస్తుంది. ఐనాకూడా ఆమె శిథిలశరీరం నిశ్చలమయ్యేదాకా-దుర్భరమైన బాధతో ఆమె ఊపిరాడక రొప్పుతున్నంతసేపూ కూడా-గుండెలు గట్టిగా పట్టుకున్న ఆమె శల్యావశిష్టమైనపిడికిలి సడలేదాకాకూడా 'హే భగవాన్! క్షమించు-నేచేసిన పాపాలన్నీ క్షమించ' మని గొణుక్కుంటూనేవుంది. ఆ అంతిమ క్షణంలో-మిగిలిన ఒక్క ప్రాణమూ ఉత్క్రామించేటప్పుడుకూడా ఆమె కళ్లల్లో విపరీతమైన భయం-మరణభీతి ప్రస్ఫుటించక మానిందికాదు. ఆ వృద్ధురాలి మరణశయ్య ప్రక్కనే నిలబడివున్న నన్ను జీనైదా స్మృతి మెలిపెట్టింది-ఆమెకోసం, మానాన్నగారికోసం నాకోసం చేసెత్తి దేవదేవుణ్ణి ప్రార్థించాలనిపించింది.